
నేడు ఖమ్మంలో పైసా వసూల్ ఆడియో ఆవిష్కరణ



విచ్చేస్తున్న హీరో బాలకృష్ణ, తరలిరానున్న సినీ తారాగణం 16

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



16 ఖమ్మం

గురువారం 17 ఆగస్టు 2017

వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థ ప్రక్షాళనకోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-నామ్ వ్యవస్థ అమలు ఖమ్మం మార్కెట్‌లో ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కు అన్నట్లు సాగుతోంది. దళారులనుంచి రైతులను కాపాడి మద్దతు ధర కల్పించేందుకు ఉద్దేశించిన ఈ ఆన్‌లైన్ విధానం అమలుకు అనేక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. మొదటినుంచి ఈ సాంకేతిక వ్యవస్థను వ్యతిరేకిస్తున్న వ్యాపార వర్గాల కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా బుధవారం నుంచి మార్కెట్‌లో ఈ-నామ్ అమలు కావాల్సి ఉండగా కంప్యూటర్లు అందని కారణంగా మళ్లీ వాయిపడినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం 9

ఈ-నామ్‌కే వాస్తే!



eNAM

- వ్యవసాయ మార్కెట్‌లో ఈ-మార్కెటింగ్ అమలు ఎప్పుడు?
- ఎప్పటికప్పుడు వాయిదాలతో సరి..
- దళారుల దందాకు అడ్డుకట్ట ఎన్నడు?
- త్వరలో ప్రారంభం కానున్న పత్తిసీజన్
- ఆన్‌లైన్ కొనుగోళ్లకోసం రైతుల ఎదురుచూపు



వ్యాధి నిరోధక
కొత్తటీకా సిద్ధం

- నేటినుంచి పిల్లలకు 'మీజిల్స్ రుబెల్లా'
- 3.54 లక్షల మందికి వేసే లక్ష్యం 11
- తప్పకుండా వేయించాలి: డీఎంహెచ్‌వో



దసరా తర్వాత
మరో ఉద్యమం

- ఒక్కడి వల్లే తెలంగాణ రాలేదు
- ప్రశ్నించే హక్కు అందరికీ ఉంది. 16
- ఏఐవైఎఫ్ నిరుద్యోగ సదస్సులో జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

పట్టపగలే.. కొట్టి చంపారు

- ఎన్డీ చంద్రన్న వర్గం చేతిలో టీడీపీ కార్యకర్త రాయల భాస్కర్ హత్య
- గొత్తికోయలతో పోడు వివాదాలే కారణం
- పాల్వంచ మండలం నర్సంపేటలో కలకలం
- మృతదేహాన్ని పరిశీలించిన ఎస్పీ.. భారీగా బలగాల మోహరింపు

6



భాస్కర్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఆదాయంగా పరిగణించే జీతభత్యాలు

బోనకల్: పే, డీఏ, హెచ్ఆర్ఏ, ఐఆర్, సీసీఏ అలవెన్సులు, మెడికల్ అలవెన్సులు, అదనపు అలవెన్స్, సరెండర్ సెలవు, జీతం, పీఆర్సీ బకాయిలు, స్టెప్ అప్ ఎరియర్స్, సెలవు కాలం జీతంను ఆదాయంగా పరిగణిస్తారు. పదవీ విరమణ తరువాత పొందే జీపీఎఫ్/జీఐఎస్/టీఎస్.జీఎల్ఐల నుంచి పొందే సొమ్ము, నగదుగా మార్చుకున్న సంపాదిత సెలవులు, అర్ధజీతపు సెలవులపై వచ్చిన సొమ్ము, ఎల్టీసీపై పొందిన సొమ్ము ఆదాయంగా పరిగణించరాదు. సెక్షన్ 10(13ఎ) ప్రకారం ఇంటి అద్దె అలవెన్స్ నెలకు రూ.మూడు వేలు (సంవత్సరానికి సరాసరి 36వేలు)కన్నా ఎక్కువ మొత్తం పొందుతున్నవారు మొత్తం హెచ్ఆర్ఏ మినహాయింపు పొందాలంటే రశీదు డీడీవోకు సమర్పించాలి. చెల్లిస్తున్న



ఇంటిఅద్దె ఒక లక్ష దాటిన పక్షంలో ఇంటియాజమాని పాన్‌నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. సొంత ఇంట్లో ఉంటున్న వారికి హెచ్ఆర్ఏ మినహాయింపు వర్తించదు.

గిరిజనుల ఇలవేల్పు పెద్దమ్మతల్లి

శుక్ర, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు

చంద్రుగొండ: గిరిజనుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటోంది. మంగయ్య బంజరు గ్రామ శివారులో ప్రతిష్ఠించిన పెద్దమ్మతల్లి భక్తుల పూజలందుకుంటోంది. గిరిజనుల సంప్రదాయ రీతిలో ఆషాఢం, శ్రావణ మాసాల్లో పెద్దమ్మతల్లికి బోనా లెత్తి మొక్కులు తీర్చుకుంటారు. ప్రతి శుక్ర, ఆదివారాల్లో భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లక్ష్మి, భోజ్యా నాయక్ దంపతులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రూ.50లక్షల అంచనా వ్యయంతో నూతనంగా ఆలయాన్ని నిర్మించేందుకు డిప్యూటీ చైర్‌పర్సన్ గడిపెల్లి కవితతో ఆలయ



నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవంగా గిరిజనులు అధిక సంఖ్యలో పెద్దమ్మతల్లిని కొలుస్తుంటారు.

ప్రజలకు ధైర్యం కల్పించేందుకే

పోలీసునయ్యా

జెంగిలి ఆంజనేయులు,
సబ్ ఇన్‌స్పెక్టర్, ఎర్రుపాలెం, ఖమ్మం జిల్లా



రైతు కుటుంబాలతో ప్రశాంతంగా ఉండే పల్లెలో ఉన్నట్టుండి అలజడి రేగింది. బయటికి వెళ్లడానికి గ్రామస్థులు జంకేవారు. విద్యార్థి దశలో ఉన్నప్పుడు జరిగిన పలు సంఘటనలు ఆ యువకుడికో లక్ష్యాన్ని నిర్దేశించాయి. దాంతో ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించేలా, వారిలో చైతన్యం కలిగించాలనుకున్నాడో యువకుడు. దీనికి తోడు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం తోడవడంతో పోలీస్ శాఖలో ఎస్ఐగా ఉద్యోగం సాధించాడు ఎర్రుపాలెం ఎస్ఐ ఆంజనేయులు. 'ఆంధ్రజ్యోతి' పలుకరింపుతో ఆత్మీయంగా మాట్లాడారు. ఆ ముచ్చట మీకోసం..

ఎర్రుపాలెం

రాజకీయ కుటుంబం

కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలం నాగారం మా సొంతూరు. తల్లిదండ్రులు లక్ష్మి, కొమరయ్య. మా నాన్న పంచాయతీ ప్రెసిడెంటుగా పలు మార్లు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాకు అక్క, చెల్లి ఉన్నారు. అక్క ఎంపీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. చెల్లి డాక్టర్. అమ్మా నాన్నలు, గురువులు నాకు ఆదర్శం

ఉన్నత చదువులు..

ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ చేసిన నేను మా గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో నక్సల్స్ ప్రభావాన్ని గమనించారు. వారి తీరుకు ప్రజలు బలవడాన్ని సహించలేదు. అమాయకులు ఇబ్బందులు పడొద్దకున్నా. ప్రజలకు ధైర్యంగా ఉండలనుకున్నా. ఇందుకు సరైన వేదిక పోలీస్‌శాఖే అనుకున్నా.

ఒత్తిళ్లకు తలొగ్గను..

పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో నేను పనిచేసినంత కాలం రాజకీయ పార్టీ నాయకులకు, ప్రలోబాలకు తలొగ్గను. నిరక్ష్యరాసులైన పేదలకు పోలీస్ శాఖ ద్వారా వారికి న్యాయం జరిగేలా చూడటమే నా లక్ష్యం.

మెదటి పోస్టింగ్ ఎర్రుపాలెం..

నేను 2015 బ్యాచ్‌లో ఉద్యోగంలో చేరా. శిక్షణానంతరం ట్రైనీ ఎస్ఐగా బోనకల్‌లో చేసి ఎస్ఐగా ఎర్రుపాలెంలో పోస్టింగ్ పొందాను. ఇక్కడి ప్రజలు, వాతావరణం చాలాబాగుంది. యువకులు సమయాన్ని వృథా చేయకుండా నిర్ణీత లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి. విజయానికి అడ్డదారులు లేవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.



రేణుక

పాలేరు జలాశయం.. 23 అడుగుల లోతు.. ఎగిసిపడే అలలు.. వీటినేమీ లెక్క చేయకుండా తెప్పలపై చేపల, రొయ్యల వేట సాగిస్తూ అబ్బురపరుస్తున్నారు ఇక్కడి మత్స్యకారిణులు. ఎక్కడైనా పురుషులు మాత్రమే చేపలు పడతారు. పట్టిన చేపలు విక్రయిస్తుంటారు మహిళలు. కానీ కుటుంబానికి ఆసరాగా చేపలు పడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు మహిళలు. ఎంతో ధైర్యంతో, ఈత నైపుణ్యంతో పురుషులతో దీటుగా పాలేరు జలాశయంలో చేపలు, రొయ్యలు పడుతున్నారు. చేపల శికారు అంటే తమకు ఎలాంటి భయం లేదని చెపుతున్న అతివల ధైర్యంపై ప్రత్యేక కథనం..

\- కూసుమంచి



బుల్లెమ్మ

చేపల వేటలో అతివలు పాలేరు జలాశయంలో మీనాల శికారు

అలలపై అలవోకగా..

ఖమ్మం జిల్లా కూసుమంచి మండలానికి చెందిన మహిళలు చేపల వేటనే వృత్తిగా ములుచుకుని జీవిస్తున్నారు. కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో తల్లితండ్రుల సహాయంతో కుటుంబాన్ని ఈడ్చుకుస్తున్నారు. పెద్ద పెద్ద అలల నడుమ లోతైన చెరువులో చేపలు పట్టడం అంటే అంత తేలికేంకాదు. ఒక్కోసారి గాలిదుమారంలో తెప్ప తలకిందులైనా, పట్టు తప్పినా జీవితంపై ఆశ వదులుకోవడమే. అయినప్పటికీ తప్పని పరిస్థితి. వారికి మత్స్యకార సొసైటీలో కనీసం సభ్యత్వం లేదు. ఏదైనా జరిగితే పిల్లలకు దిక్కు కూడా లేదు.



తెప్పపై చేపలుపట్టే బుల్లెమ్మ

పాలేరు గ్రామపంచాయతీ శివారు భోజ్యతండకు చెందిన పానుగోతు బుల్లెమ్మ పదేళ్ల నుంచి చేపల శికారు చేస్తోంది. గతంలో భర్త దేవాతో కలహాలు రావడంతో ఎర్రగడ్డతండాలో పుట్టింటికి వెళ్లింది. తల్లితండ్రులు మంగ్య, హన్సీకు భారం కావద్దని ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు తండాకు ఆనుకుని ఉండే పాలేరు జలాశయంలో చేపల వేట నేర్చుకుంది. అప్పటినుంచి ఏటా చేపలవేట కాలంలో తెప్పపై జలాశయంలోకి వెళ్లి చేపల, రొయ్యలవేట సాగించి వేటాడిన మత్స్యాలను కాంట్రాక్టర్‌కు అమ్మేది. వచ్చిన ఆదాయంతో కూతురు, కుమారుడుతో కలిసి కుటుంబ జీవనం సాగిస్తు ఉండేది. ఇటీవల పెద్ద మనుషులు పంచాయితీ పెట్టించి భార్యభర్తలను తిరిగి కలపడంతో గత ఏడాది భోజ్యాతండాలో భర్తతో పాటు కాపురముంటోంది. అయినప్పటికి భర్తకూలీ పనులకు వెళుతుండగా, తాను చేపల వేటను మాత్రం కొనసాగిస్తోంది.

మహిళలదే కీలకపాత్ర

పాలేరు జలాశయంలో చేపల షికారులో మహిళలదే కీలకపాత్రగా ఉంటుంది. మే నెల నుంచి ఐదు నెలలపాటు సాగే చేపల, రొయ్యల వేటలో మహిళలు ముఖ్యభూమిక పోషిస్తుంటారు. సుమారు 1200 కుటుంబాలు పాలేరు జలాశయం ఆధారంగా జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో పురుషులు కేవలం చేపల, రొయ్యల వేట సాగించి పట్టుకుని వచ్చిప్పటికీ వాటిని గ్రేడింగ్ చేయడం, జిహ్వాపరులకు విక్రయించడం వంటివి వారి కుటుంబానికి చెందిన మహిళలే చేస్తుంటారు. అంతేకాకుండా వలలు, తెప్పలు, బుట్టల తయారీలో కీలకపాత్ర వహిస్తుండటం విశేషం. ఇంట్లో కుటుంబ పనులు చేస్తు, బయట తన భర్తకు సంభందించి వృత్తిపరమైన పనుల్లో భాగస్వామిగా పనిచేస్తు బిజీబిజీగా ఉంటారు.



సామగ్రి మరమ్మతులో..

వేటకు కావాల్సిన వలలు, గాలాలు, తెప్పలు, బుర్రల మరమ్మతులో మత్స్యకార మగువలు నైపుణ్యం సాధించారు. ఒక్కసారి తెప్పపై వెళ్లివచ్చాక తీసుకు వెళ్లిన సామాగ్రినంతా మళ్లీ ఉపయోగించడానికి సిద్ధం చేసుకుంటారు. నిత్య ఇదే వృత్తి కావడంతో వారి ఇళ్లల్లోనూ చేపకు కావాల్సిన పరికరాలు కన్పిస్తుంటాయి. శికారుకు వెళ్లని రోజుల్లో చిరిగిన వలలకు మరమ్మతులు చేస్తుంటారు.



రొయ్యలు శికారుచేసే రేణుక

నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన కాపరబోయిన నర్సయ్య-వెంకటనర్సమ్మకు ఇద్దరు సంతానం. రేణుక పెద్ద కూతురు. 18ఏళ్లక్రితం సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలోని గుడిబండకు చెందిన వీరమల్లు సైదులుకిచ్చి వివాహం చేశారు. కాగా సుమారు అయిదేళ్లక్రితం సైదులు జ్వరంతో చనిపోయాడు. దీంతో పుట్టింటిని ఆశ్రయించింది రేణుక. తల్లితండ్రుల వద్దనే ఉంటు తన పిల్లలను పోషిస్తుంది. వారు కూడ వృద్ధులు కావడం, పేదవారు కావడంతో రేణుక పాలేరు జలాశయంలో చేపల, రొయ్యల శికారు చేస్తుంది. ఏటా అయిదు నెలల పాటు జరిగే చేపల రొయ్యల వేటకు వెళ్తు, మిగిలిన సమయాల్లో వ్యవసాయకూలీ పనులకు వెళుతుంది. 22 అడుగుల నీటిలో ఎగిసిపడే అలల నడుమ ఊగిసలాడే తెప్పపై జంకు లేకుండా ధైర్యంగా చేపలు పట్టడం పట్ల మహిళ ధైర్యానికి గ్రామస్థులు మెచ్చుకుంటున్నారు.

మినీ లోకం



అదేం సాహసం కాదు...
మందు ఎక్కువై డోర్‌తీసి దూకేశాడు!

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ దరఖాస్తులపై చర్యలు తీసుకోండి

వీడియోకాన్ఫరెన్స్‌లో తహసీల్దార్లకు కలెక్టర్ లోకేష్‌కుమార్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్: కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పెండింగ్ దరఖాస్తులపై సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎస్ లోకేష్‌కుమార్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రెవెన్యూ అంశాలపై కలెక్టర్ తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఎట్టిపరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. అర్హతఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలుతీసుకొని ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులకు అందించాలన్నారు. రెవెన్యూ రికార్డు ఆధునికీరణలో భాగంగా మండలాల్లో అన్ని గ్రామాలకు సంబంధించిన వెబ్ ల్యాండ్ వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఇటీవలె నిర్వహించిన రైతు సమగ్రసర్వే వివరాలను సంబంధిత మండల వ్యవసాయ శాఖ అధికారినుంచి తీసుకుని పట్టేదారు పాస్ పుస్తకాలు, టైటిల్‌డీడ్‌తో సరిపోల్చాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ దరఖాస్తులు ఖమ్మండివిజన్‌లో 680, కల్లూరు డివిజన్‌లో 136 పెండింగులో ఉన్నాయన్నారు. ఆర్డీవోలు దరఖాస్తుల పరిష్కారాని ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. సాదా బైనామాల దరఖాస్తులు పెండింగులో ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. హరితహారం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న తహసీల్దార్లను కలెక్టర్ అభినందించారు. 88శాతం లక్ష్యం సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో నూరుశాతం సాధనకు కృషి చేయాలన్నారు. నాలుగున్నర లక్షల సుబాబుల్, అయిదులక్షల టేకుమొక్కలు నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయని అవసరైమన ప్రాంతాలకు వాటిని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ఏడాది అక్టోబరు రెండోతేదీనాటికి జిల్లా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం 50చొప్పున జిల్లాలో రోజుకు వెయ్యి మరుగుదొడ్లు పూర్తిచేయాలని ఆదేశించారు. బహిరంగ విసర్జనరహిత జిల్లాగా ప్రకటించేందుకు యుద్ధప్రాతిపదికన నిర్మాణాలను పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతోపాటు ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంచేసి ముమ్మరంగా అవగాహన కలిగించాలని కోరారు. గ్రామాల్లో నీళ్ల, ఆరోగ్య, పారిశుధ్య కమిటీలను బాధ్యులుగా చేస్తూ.. నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ లోకేష్‌కుమార్ కోరారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, శిక్షణ కలెక్టర్ జి.హన్మంత్, డీఆర్డీవో వి.మురళీధర్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి (జేడీఏ) విజయనిర్మల, ఖమ్మం అర్బన్ తహసీల్దారు శ్రీలత, ఎంపీడీవో ఏలూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ లోకేష్‌కుమార్, పక్కన జేసీ వినయ్‌కృష్ణారెడ్డి

రేపు ఆడిట్‌కు హాజరుకండి

డీఈవో విజయలక్ష్మీబాయి

ఖమ్మం ఎడ్యుకేషన్: రాష్ట్రీయ మాధ్యమిక శిక్షాభియాన్ పథకం కింద 2016-17 సంవత్సరానికి సంబంధించిన చార్టెర్డ్ అకౌంట్‌లచే ఆడిట్ చేసుకునేందుకు ఈ నెల 17వతేదీ(గురువారం)న అన్ని ఒరిజినల్‌బిల్స్, రిజిస్టర్లతో హాజరుకావాలని డీఈవో విజయలక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఉన్నతపాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఖమ్మంనగరంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు హాజరుకావాలని మూడుసెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని డీఈవో విజయలక్ష్మీబాయి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమనిధి రుణ స్వాధీనంపై దృష్టి

అధికారులతో డీఆర్వో శివశ్రీనివాస్

ఖమ్మం కలెక్టరేట్: ఉద్యోగుల సంక్షేమనిధి రుణాలస్వాధీనంపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జె.శివశ్రీనివాస్ కోరారు. బుధవారం సాయంత్రం తన చాంబర్‌లో ఉద్యోగుల సంక్షేమ నిధికమిటీ సమావేశంలో రుణాల మంజూరు, రికవరీపై ఆయన సమీక్షించారు. 2015 నుంచి దరఖాస్తుచేసుకున్న వారిలో 97మందికి ఉద్యోగ సంక్షేమనిధి నుంచి రుణాల మంజూరుకు కమిటీ ఆమోదించింది. డీఆర్వో మాట్లాడుతూ.. జిల్లాలో గత 15ఏళ్లుగా రుణ రికవరీలు, వడ్డీ రికవరీలు పెండింగులో ఉన్నాయని, వీటి చెల్లింపునకు ఉద్యోగ సంఘాల నాయకులతోపాటు డ్రాయింగ్‌అధికారులు ప్రత్యేకచొరవ చూపాలన్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా ఇతరప్రాంతాలకువెళ్లిన ఉద్యోగులనుంచి రావాల్సిన బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన జాబితాలను జిల్లా విద్యాశాఖాధికారికి పంపించాలన్నారు. సెప్టెంబరు మొదటివారంలో కమిటీసమావేశం నిర్వహించాలని, అప్పటివరకు రికవరీలో పురోగతి సాధించాలన్నారు. సంక్షేమనిధి నిల్వమేరకు 2015-16 సంవత్సరంలో దరఖాస్తుచేసుకున్న ఉద్యోగులకు సంక్షేమనిధిరుణాన్ని మంజూరు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఖజానాశాఖాధికారి బి.శ్రీనివాస్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు పి.రామయ్య, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం నాయకుడు బిక్కు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్‌హకీం ఉమామహేశ్వరరావు, మోహినుద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో శివశ్రీనివాస్

రైల్వేస్టేషన్‌లో..

‘స్వచ్ఛత పక్వాడా’..!

ప్రయాణికులకు అధికారుల అవగాహన

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో బుధవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్లాట్‌ఫారాలు, ట్రాక్‌లపై చెత్తచెదారాన్ని తొలగించారు. అనంతరం ప్రయాణికులకు పరిశుభ్రతపై అవగాహన కలిగించారు.



ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ‘స్వచ్ఛభారత్’పై ప్రమాణం చేయిస్తున్న అధికారులు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఏఐకేఎఎస్ నేతల వినతి



కలెక్టర్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐకేఎస్ నేతలు

ఖమ్మం అర్బన్: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. సీపీఎం అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ నేతలు బుధవారం కలెక్టర్ డీఎస్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లుదాటినా, ఇప్పటి వరకు వ్యవసాయ సంక్షోభ పరిష్కారానికి చొరవ చూపటం లేదని విమిర్శించారు. సాగులో పెట్టుబడులు పెరిగి, దిగుబడులుతగ్గటం.. మార్కెట్ ‘మాయాజాలం’తో ధరలుదక్కని కారణంగా రైతులు తీవ్ర సంక్షోభానికి గురయ్యారన్నారు. పెట్టిన పెట్టుబడులకు, దక్కే ఆదాయానికి.. పొంతన లేక పోవటంతో రైతులు అప్పులఊబిలో కూరుకుపోతున్నారని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలుచేయక పోతుండటంతో వ్యవసాయ సమస్యలు పరిష్కారంకావటం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.4వేల రాయితీని కౌలురైతులకు కూడా వర్తింపచేయాలని.. చిన్న, సన్నకారు రైతులందరికీ పూర్తి సబ్సిడీతో విత్తనాలు, పురుగుమందులు అందజేయాలని డిమాండ్ చేశారు. 50ఏళ్లు మించిన రైతులకు నెలకు రూ. 5వేల పింఛన్ అందజేయాలన్నారు. పాలకులు ఇప్పటికైనా.. తమ విధానాలను మార్చుకొని, వ్యవసాయ సంక్షోభ నివారణకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు బండి రమేష్, తాతా భాస్కర్‌రావు, కట్టా గాంధీ పాల్గొన్నారు.

నేడు పంచాయతీషాపుల వేలంపాట

కల్లూరు: కల్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు గురువారం ఉదయం 10.30గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్టు సర్పంచ్ భరోసు సుజాత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ పరిధిలోగల 18,33,34,35,40/1,44,46షాపులకు వేలం నిర్వహించనున్నట్టు వారు వివరించారు. బహిరంగ వేలంపాటలో పాల్గొనదలిచినవారు ఒక్కోషాపుకు సగటున రూ.పదివేల డిపాజిట్ చెల్లించి గురువారం ఉదయం 9గంటల్లోగా అందజేయాలని వారు కోరారు.

పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ



విద్యార్థులకు పెన్నుల పంపిణీ

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం నారాయణపురంలోని యూపీఎస్‌లో మట్టా వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మట్టా అజయకుమార్ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు అందజేశారు. స్థానిక సర్పంచి అడ్డగట్ల లలితారాజేశ్వరి, ఉప సర్పంచి దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కుశిరెడ్డి వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో మట్టా అజయకుమార్, ఉపాధ్యాయులు నర్సారెడ్డి, శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, జానీ, బాబూరావు పాల్గొన్నారు.

మీజిల్స్, రూబెల్లా వేక్సినేషన్‌కు సర్వం సిద్ధం

డిప్యూటీ డీఎం హెచ్‌వో భాస్కర్ నాయక్

సత్తుపల్లి రూరల్: మీజిల్స్, రుబెల్లా వేక్సిన్‌ను గురువారం ప్రారంభిస్తున్నట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో భాస్కర్ నాయక్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా డివిజన్‌వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని గంగారం-19815 మంది, వేంసూరు- 10809 మంది, లంకాసాగర్-13643 మంది, కల్లూరు-16278 మంది, ఏన్కూరు-8687 మంది, తల్లాడ-8710 మంది చొప్పున మొత్తం 77942 మంది పిల్లలకు వేక్సిన్ సిద్ధంగా ఉందన్నారు. డివిజన్‌వ్యాప్తంగా 409 పాఠశాలలు, 442 అంగన్‌వాడీ కేంద్రాలు, 15 ప్రత్యేక కేంద్రాలు, 96 ఆసుపత్రి కేంద్రాల చొప్పున 962 కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. నేటినుంచి నెల రోజులు పాటు జరిగే ఎంఆర్ వేక్సినేషన్ కార్యాక్రమంలో 9నెలల నుంచి 15సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పకుండా వేక్సిన్ వేయించాలని కోరారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత రెండు మూడు గంటలు పిల్లలను గమనించి, ఏమైన శరీరంలో మార్పులు వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి తీసురావాలని కోరారు.

మండలంలో 8710మందికి ఎమ్మార్ వ్యాక్సినేషన్

తల్లాడ: మీజిల్స్, రుబెల్లా వేక్సిన్ వేయడానికి 8710మందిని గుర్తించినట్టు తల్లాడ మండల వైద్యాధికారి డాక్టర్ మోతియా అన్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న వేక్సినేషన్‌కు మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.





తల్లాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది, భాస్కర్ నాయక్

గురువారం నుంచి 4వతేదీ వరకు వేక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందని మోతియా తెలిపారు. 15సంవత్సరాల్లోపు బాలబాలికలకు ఎంఆర్ వ్యాక్సినేషన్ వేయించాలని సూచించారు. అంగన్‌వాడీకేంద్రాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిగంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు వేక్సినేషన్ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఆర్టీసీ సత్తుపల్లి డిపోలో స్వచ్ఛభారత్



ఆర్టీసీ ఆవరణను శుభ్రం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లి: ఆర్టీసీ సత్తుపల్లి డిపో ఆవరణలో బుధవారం డిపో మేనేజర్ జవ్వాది వెంకటేశ్వరబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. డిపో, బస్టాండ్ ఆవరణలో చెత్తను తొలగించి శుభ్రంచేశారు. మొక్కలకు పాదులు చేసారు. ఈసందర్భంగా డిపోమేనేజర్ వెంకటేశ్వరబాబు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిపో సీఐ బి.మహేష్‌కుమార్, ఎంఎఫ్ పి.శ్రీనివాసరావు, డిపోసిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు పంపిణీ

కల్లూరు: కల్లూరు మండలం తాళ్లూరు గ్రామంలో ప్రమాదానికి గురై మృతిచెందిన ఇటుకల రాము కుటుంబానికి టీఆర్ఎస్ తరపున రూ.రెండులక్షల నగదు చెక్కును ఆకుటుంబానికి బుధవారం ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు టీఆర్ఎస్ తరపున ప్రమాదంలో మృతిచెందిన 40మంది కార్యకర్తల కుటుంబానికి రూ. 80లక్షల చెక్కులు పంపిణీ చేసినట్టు వివరించారు. ప్రమాదంలో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వం కల్గి ఉంటే వారికి బీమా ద్వారా ఆర్థికంగా చేయూతనిస్తున్నట్టు వివరించారు. ఈకార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకుడు, ఆత్మ డైరెక్టర్ నర్వనేని అంజయ్య, సర్పంచ్ ఈదె జయలక్ష్మి, ఎంపీటీసీ రాజులపాటి భారతి, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఈదె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న రవి

డిజిటల్ తరగతుల ప్రారంభం

కల్లూరు: కల్లూరు మండలం పుల్లయ్యబంజర గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం డిజిటల్ తరగతులు ప్రారంభించారు. ఖమ్మం పట్టణానికి చెందిన డీఎన్ఎఫ్ సభ్యులు నాగుబండి సంహిత్ రూ.12వేలు, పాఠశాల పూర్వవిద్యార్థి రూ.5వేలతో కలిసి టీవీ, ఉపకరణాలను వితరణ చేశారు. డిజిటల్ తరగతులను ఆపాఠశాల పూర్వ విద్యార్థులు బోబోలు శ్రీనివాసరావు, సాయిన్ని లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థి రాచబండి రామకృష్ణతోపాటు ఎస్ఎంసీ ఛైర్మన్ రాంబాబు, ఎంఆర్‌సీ మందా రామారావు, ఉపాధ్యాయులు మల్లిఖార్జున్, కరుణాకర్, చిన్నవెంకట్రావ్, వసంత్, షకీలా పాల్గొన్నారు.



పుల్లయ్యబంజర ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న దృశ్యం

మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్‌పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కల్లూరు, చెన్నూరు గ్రామాల్లో మీజిల్స్-రుబెల్లా వేక్సిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు లక్ష్య సాధనే ప్రధానం: ప్రిన్సిపాల్

సత్తుపల్లి: విద్యార్థులకు లక్ష్య సాధన ఉండాలని, లక్ష్యం లేకుండా ముందుకు సాగటం వల్ల ప్రయోజనం ఉండదని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నరసింహారావు అన్నారు. బుధవారం కళాశాలలో జరిగిన దిశ (యూఎన్‌డీపీ) అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం ఏర్పచురుకొని లక్ష్య సాధనకోసం కష్టమైనా ఇష్టపడి చదవాలన్నారు. ప్రతిఒక్కరిలో ఏదో ఒకటి సాధించాలన్న పట్టుదల ఉండాలని సూచించారు. దిశ కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల గురించి అవగాహన కల్పించారు. యూఎన్‌డీపీ-దిశ తరపున ఇందిర మాట్లాడుతూ విద్యార్థినులు ముందుగా ఇమెయిల్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో యూఎన్‌డీపీ కోఆర్డినేటర్ ఎ.సోమనర్సయ్య, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం, మోనిటర్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్‌వో, వీఆర్‌ఏలను రెవెన్యూలోనే కొనసాగించాలని ఆందోళన

కల్లూరు: గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలను రాష్ట్రప్రభుత్వం వ్యవసాయశాఖ పరిధిలోని గ్రామరైతుసంఘాల్లో విలీనం చేయటాన్ని వ్యతిరేకిస్తూ కల్లూరులో డివిజన్‌స్థాయిలో పలు మండలాలకు చెందిన వీఆర్‌వో, వీఆర్‌ఏలు బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం నుంచి వీఆర్‌వో, వీఆర్‌ఏలందరూ పెద్దఎత్తున ప్రదర్శనగా బయల్దేరి డివిజన్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేశారు. ఈసందర్భంగా డివిజన్ పరిధిలోగల కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, ఏన్కూరు, సత్తుపల్లి, వేంసూరు మండలాల వీఆర్‌వో సంఘం అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, జె.నర్సింహారావు, ఎన్.అచ్యుతరావు, శేఖర్, ఏసురత్నం, వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు ఎం.భూషణం, కె.సిద్ధయ్య, రాందాసు, ఆజాద్ ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలను గ్రామరైతుల సంఘాల్లో విలీనం చేయటాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నట్టు వారు ప్రకటించారు. ఈసందర్భంగా పైవిధంగా ప్రస్తుతం తీసుకున్న నిర్ణయాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి నేరుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలను రైతుసంఘాల్లో విలీనం చేసే నిర్ణయాన్ని రాష్ట్రప్రభుత్వం సత్వరమే విరమించుకోకపోతే తాము రాష్ట్రంలో మూకుమ్మడిగా విధులను బహిష్కరించి పెన్‌డౌన్ కార్యక్రమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. రెవెన్యూశాఖ అయిన మాతృసంస్థనుంచి వేరేశాఖలో విలీనం చేయటాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. డివిజన్ స్థాయిలో త్వరలో తాము పైవిధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ఈమేరకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కుముదునిసింగ్‌కు వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు నాగేశ్వరరావు, నాగూల్‌మీరా, హుస్సేన్, జానిమియా, ఆరుమండలాల వీఆర్‌వోలు పాల్గొన్నారు.





ఆందోళన నిర్వహిస్తున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలు, ఆర్డీవోకు వినతి అందజేస్తూ..

సినిమాలు

సత్తుపల్లి

• శ్రీనివాస	జయ జానకీ నాయక
• శ్రీబాలాజీ	ఫిదా
• సాయి బాలాజీ	లై
శ్రీకృష్ణ	కాటమరాయుడు

మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

సత్తుపల్లి	9985411343
సత్తుపల్లి రూరల్	8501943215
వేంసూరు	9966944799
పెనుబల్లి	9949931415
కల్లూరు	9491541765
తల్లాడ	9866673481

పురుగుల మందు వికటించి పంట నష్టం

● పిచికారీ చేసిన గంటల వ్యవధిలోనే పంట మాడిపోయింది ● ఎరువుల దుకాణాల్లో బిల్లులు ఇవ్వకుండానే విక్రయం ● లబోదిబో అంటున్న కౌలు రైతు

సత్తుపల్లి రూరల్: వరి పంటకు ఆశించిన పచ్చ పురుగునివారణకు వాడిన పురుగులమందు వికటించి రెండెకరాల వరి పైరు పూర్తిగా మాడిపోయింది. సత్తుపల్లి మండలం సదాశివునిపాలెంలోని పర్సా సత్యనారాయణ రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగుచేశాడు. నాటువేసిన 20 రోజుల వ్యవధిలోనే పంటకు పచ్చపురుగు ఆశించింది. 14వ తేదీన సత్తుపల్లి పట్టణంలోని ఒక ఎరువుల దుకాణంలో పురుగుల మందును కొనుగోలుచేసి ఎలావాడాలో కూడా అడిగి తెలుసుకుని తక్కువ మోతాదులో వాడాడు. పరుగు మందు పిచికారీ చేసిన నాలుగు గంటల సమయంలోనే పైరు రంగు మారిపోయింది. దమ్ముచేసినప్పటినుంచి ఇప్పటివరకూ రూ.20వేలకు పైగా పెట్టుబడులు పెట్టానని, రెండెకరాలకు కౌలు 24 బస్తాలు కట్టాల్సివుందని ఆవేదనవ్యక్తం చేశాడు.

మందు వల్ల ఇలా జరింగిందా?

మందు వాడకంవల్ల ఇలా జరిగిందా అని అధికారులు విచారణ చేపట్టారు. గతంలో గ్రామంలోని ఎంతోమంది రైతులు పచ్చపురుగు నివారణకు వేరేరకం పురుగుల మందును వాడారు. కానీ ఎలాంటి పంట నష్టం జరగలేదు. ఈరకం పురుగులమందు వాడకం గ్రామంలో ఇదే మొదటిసారని రైతులు చెబుతున్నారు. సత్యనారాయణ మందులు కొనుగోలు చేసినప్పుడు షాపు యజమాని బిల్లులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారు.

పంట మొత్తం నష్టపోయా...

సత్యనాయణ రైతు, సదాశివునిపాలెం



రెండెకరాలు కౌలుకు తీసుకోని వరిసాగు చేస్తున్నాను. పురుగుల మందుల షాపు వాళ్ల మాటలు నమ్మి పచ్చ పురుగు నివారణకు మందువాడితే పంట ఎండిపోయింది. ఇప్పటివరకూ రూ.20వేలకుపైగా పెట్టుబడులు పెట్టాను. నాకు న్యాయంచేయాలి.



వరి పంట మాడిపోయిన దృశ్యం

పరిశోధనకు పంపించాం

రామ్మోహన్‌రావు, ఏవో, సత్తుపల్లి



వరి పంటకు వాడిన మందులను సేకరించి పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్‌కు పంపాం. మండలంలో చాలామంది రైతులు పచ్చపురుగు నివారణకు వివిధ కంపెనీల మందులు వాడుతున్నారు. ఇలాజరగటం ఇదే మొదటిసారి. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ నర్సింహారావు

ముదిగొండ: మండల పరిధిలోని పమ్మి గ్రామంలో గ్రూప్-2, గ్రూప్-3, గురుకుల, ఎస్‌ఐ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు ఉచిత శిక్షణను బుధవారం ప్రారంభించారు. ప్రముఖ ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ బుగ్గవీటి నర్సింహారావు, సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ ఆర్థికసహకారం అందించారు. ప్రభుత్వ హైస్కూల్లో సాయంత్రం ఆరుగంటల నుంచి తొమ్మిదిగంటల వరకు ఉచిత శిక్షణ నిర్వహించటంజరుగుతుందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నాయకుడు పీసీ.వీరస్వామి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీఎస్.కళ్యాణ్, సర్పంచ్ సుతారి శ్రీదేవి, ఎంపీటీసీ వడ్డే శ్రీను, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల సేవలు: ఎమ్మెల్యే

కొణిజర్ల: జిల్లాలో వాణిజ్య బ్యాంకులకు ధీటుగా రైతులకు సేవలు అందించడంలో సహకార బ్యాంకులు పని చేస్తున్నాయని వైరా ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ తెలిపారు. బుధవారం కొణిజర్లలో నూతనంగా నిర్మించిన గోపవారం సహకార సంఘం భవనాన్ని ఆయన ప్రారభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక సహకార సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి అయ్యాయన్నారు. జిల్లాలో డీసీసీబీ అభివృద్ధికి మువ్వా విజయ్‌బాబు కృషి మరువలేనిదన్నారు. ఒక గోపవారం సహకార సంఘం పరిధిలోని రూ.11కోట్ల 40లక్షలు రైతులకు రుణామాఫీ లభించిందన్నారు. రైతులు బ్యాంకుల లావాదేవీల కోసం ఖమ్మం బ్యాంకుకు వెళ్లకుండా కొణిజర్ల పరిధిలోని సేవలు అందేవిధంగా కృషిచే స్తామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సహకార బ్యాంకులన్నీ అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగానే నిలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ సీఈవో నాగచెన్నారావు, వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోతు నర్శింహారావు, సొసైటీ ఛైర్మన్ మోత్కూరి వెంకటేశ్వరావు, సీఈవో వెంకటేశ్వర్లు, డీసీవో రాజేశ్వరశాస్త్రి, తహసీల్దార్ సాంబశివరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ వడ్లమూడి ఉమారాణి, ఆత్మ ఛైర్మన్ బి.బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌లాల్

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొణిజర్ల: ఎన్ని నిబంధలు పెట్టినా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం మాత్రం అగడంలేదు. బుధవారం 25 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో తరలుతున్న వ్యాన్ మండలంలోని పల్లిపాడు సమీపంలో బోల్తాపడింది. సంఘటనా స్థలంలో ఆర్‌ఐ కొండల్‌రావు మాట్లాడుతూ ఖమ్మం రంగనాయకుల గుట్ట ప్రాంతం నుంచి వ్యాన్‌లో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పల్లిపాడు సమీపంలో వ్యాన్ టైర్ పంచర్ కావడంతో బోల్తా పడింది. వ్యాన్లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించినట్టు ఆర్‌ఐ తెలిపారు. వ్యాన్ ఖమ్మం నుంచి కృష్ణ జిల్లా నందిగామ వెళుతోందని తెలిపారు. పట్టుకున్న రేషన్ బియ్యాన్ని లాలాపురం డీలర్‌కు అప్పగించి వ్యాన్, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 6ఏ కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు.



బయట పడిన రేషన్ బియ్యం

15క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం వద్ద మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ఓఆటోలో 15క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని ఎస్‌ఐ లవణకుమార్ పట్టుకున్నారు. ఈమేరకు బుధవారం ఉదయం బియ్యాన్ని తహసీల్దార్‌కు అప్పగించారు.

రీసర్వేతో రెవెన్యూ కార్యాలయంలో బిజీబిజీ


ముదిగొండ: రెవెన్యూ రీసర్వేలో భాగంగా గ్రామాలవారీగా రెవెన్యూ రికార్డులను, ఖాతానెంబర్లు, 1బీ నెంబర్లను అన్ని ప్రక్షాళన చేస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం బిజీబిజీగా కనిపించింది. గ్రామాలవారీగా ఖాతానెంబర్లను పరిశీలించి ఎలా సంక్రమించింది? రిజిస్ట్రేషన్ ద్వారా ఎన్ని, వారసత్వం, సాదాబైనామా, కోర్టు వివాదాలు, డెత్ ఖాతాలన్నీ అయోమయంగా ఉన్నాయి. 2004 నుంచి 2007వరకు మండలంలో భారీగా పాస్‌పుస్తకాలు, టైటిల్‌డీడ్లు మధ్యదళారుల ద్వారా పాస్‌బుక్‌లు చేయించినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. ఆసమయంలో చేసిన పాస్‌బుక్స్ అన్నీ తప్పులతడకలతో ఉండటంతో ప్రధానంగా ముదిగొండ, కృష్టాపురం, వల్లభి, పెద్దమండవ గ్రామాల్లో భారీగా తప్పులు దొర్లాయి. సంబంధిత రికార్డులు కూడా లేకపోవడం, కొన్ని పాస్‌పుస్తకాల ఖాతానెంబర్లు లేకపోవడం, ఒకే ఖాతా ముగ్గురికి ఉండటం, కొన్ని పుస్తకాలపై ఆర్డీవో సంతకాలు లేకపోవడంతో రెవెన్యూ సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ముదిగొండలో సర్వేనెంబర్‌లో ముగ్గురికి పాస్‌పుస్తకాలు ఇవ్వటంతో ఆన్‌లైన్ పహాణీలో 2000వ సంవత్సరంలో ఉన్న పేర్లే వస్తున్నాయి. అలాగే ముదిగొండకు చెందిన భూములు చిరుమర్రి రెవెన్యూలో, సువర్ణాపురినొకొ చెందినవి ముదిగొండలోనూ రకరకాల తప్పులు దొర్లాయి. వీటిని ఆసరా చేసుకొని సంబంధిత అధికారులు ముడుపులు తీసుకున్నట్టుగా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈసారైనా మాభూమి మాపాస్‌పుస్తకంలో వచ్చేట్టు చూడాలని రైతులు కోరుతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ రమాదేవిని వివరణకోరగా ప్రతి ఖాతానెంబర్, 1బీ నెంబర్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలియజేసి తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



రైతుల దగ్గరనుంచి వివరాలు తీసుకుంటున్న వీఆర్‌వో, వీఆర్‌ఏలు

అదృశ్యమైన లారీ డ్రైవర్ మృతదేహం లభ్యం

● మృతిపై పలు అనుమానులు



ఎస్కే సద్దాం (ఫైల్)

పెనుబల్లి: అదృశ్యమైన లారీడ్రైవర్ మృతదేహం బుధవారం లభ్యమైంది. రూరల్ సీఐ మడత రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున సత్తుపల్లి నుంచి కొత్తగూడెం బొగ్గు లోడుతో వెళుతున్న రెండు లారీలను పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి గ్రామశివారులో గుర్తుతెలియని ఇద్దరు మహిళలు అపారు. లారీలు పక్కన పెట్టిన డ్రైవర్లు ఎస్‌కే సద్దాం(26), గోపాలస్వామితో మహిళలు మాట్లాడుతుండగా వారివద్దకు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బెదిరించి వారివద్ద వున్న రూ.4వేలను లాక్కున్నారు. సద్దాం విడిపించుకోని పారిపోతుండగా వెంబడించారు. గోపాలస్వామి అక్కడినుంచి సద్దాంకోసం రోడ్డుపైకి వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో తోటి డ్రైవర్లు, పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు కేసునమో దుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం పరిసర ప్రాంతాలలో పోలీసులు వెతుకుతుండగా పక్కనే ఉన్న బావిలో సద్దాం(26) మృతదేహం లభ్యమైంది. సద్దాంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుకొండ మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందినవాడు. సద్దాంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటన స్థలాన్ని కల్లూరు ఏసీపీ బల్లా రాజేష్ పరిశీలించారు. మృతదేహాన్ని పెనుబల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మార్చురీ వద్ద బైఠాయించిన వారితో మాట్లాడుతున్న సీఐ రమేష్

ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా

సద్దాం మృతిపై పలు అనుమానులు ఉన్నాయని, కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేస్తూ బంధువులు, స్నేహితులు పెనుబల్లి ఏరియా ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రూరల్ సీఐ మడత రమేష్ ఆసుపత్రికి చేరుకొని మృతిని కుటుంబసభ్యులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

పట్టపగలే.. కొట్టిచంపారు

ఎన్డీ చంద్రన్న వర్గం చేతిలో టీడీపీ కార్యకర్త భాస్కర్ హత్య


నర్సంపేటలో పోలీసు బలగాలు(ఇన్‌సెట్) రాయలభాస్కర్ (ఫైల్)

పాల్వంచ రూరల్: అడవి పక్కనే నర్సంపేట గ్రామం. ఉదయాన్నే గ్రామస్థులంతా వ్యవసాయ పనుల కోసం సిద్ధమౌతున్నారు. అంతలో చేతిలో తుపాకులు, కర్రలతో 20 మంది రాయల భాస్కర్ ఇంటికి వెళ్లింది. దళాన్ని చూసిన భాస్కర్ సమీప జామాయిల్ తోటలో పరుగులు తీశాడు. అక్కడ నుంచి జామాయిల్ తోటలో దళం తుపాకులు, కర్రలతో చితక బాదారు. ఆతర్వాత గ్రామ బొడ్రాయి వద్దకు తీసుకువచ్చి అందరు చూస్తుండగానే చితకబాదారు. ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం నర్సంపేటలో మంగళవారం ఉదయం జరిగింది.

ఇదీ జరిగింది

పాల్వంచ మండలంలోని పాండురంగాపురం గ్రామపంచాయతీ నర్సంపేట గ్రామానికి చెందిన రాయలభాస్కర్ (55) తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తున్నాడు. వ్యవసాయం చేసుకుంటూ ట్రాక్టర్‌తో వ్యవసాయ కిరాయిలకు పంపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సీపీఐ ఎంఎల్ ఎన్డీ చంద్రన్న వర్గానికి సానుభూతిపరుడిగా ఉంటున్నాడని సమాచారం. ఈనేపథ్యంలో నాలుగు నెలల క్రితం రాయలవర్గం దళాలతో సంబంధాలు పెట్టుకున్నట్లు తెలిసింది. ఈక్రమంలో పోడు భూములు, ట్రాక్టర్ కిరాయిల విషయంలో సమీపంలో ఉన్న రాజీవ్ నగర్ కాలనీ గొత్తి కోయలతో రాయల భాస్కర్‌కు వివాదాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఎంఎల్ ఎన్డీ చంద్రన్న వర్గానికి చెందిన దళ కమాండర్ రవి పలుమార్లు హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో రాయల భాస్కర్ ఎన్డీ రాయల వర్గానికి చెందిన దళాలకు చెప్పినట్లు సమాచారం.

చంద్రన్నవర్గం పనే

రాయల వర్గానికి దగ్గరగా గొత్తి కోయలను బెదిరిస్తున్నారని నెపంతో చంద్రన్న వర్గానికి చెందిన మోరె రవి దళం ఉదయం నర్సంపేట భాస్కర్ ఇంటికి వెళ్లారు. మొత్తం 10మంది దళ సభ్యులతో పాటు మరో 10మంది గొత్తికోయలతో కలిసి వెళ్లగా అప్పటికే గమనించిన భాస్కర్ ఇంటిపక్క నుంచి సమీపంలోని జామాయిల్ తోటకు పరుగులు తీశారు. దళం సభ్యులు వెంటాడి జామాయిల్ తోటలో పట్టుకొని తుపాకి మడమలతో, కర్రలతో తీవ్రంగా కొట్టారు. కాళ్లు చాతిపై తగిలిన దెబ్బలకు అక్కడే కుప్పకూలిపోయాడు. కొన ప్రాణంతో ఉన్న భాస్కర్ తిరిగి గ్రామంలోకి తీసుకువచ్చి ప్రజలు చూస్తుండగానే మళ్లీ కొట్టారు. భాస్కర్ భార్య నాగమణి, కొడుకు సందీప్ ప్రాధేయపడ్డా విడిచిపెట్టలేదు. గ్రామానికి చెందిన శ్రీను, వెంకన్న వదిలి పెట్టమని కోరగా.. దళకమాండర్ రవి అడ్డువచ్చిన శ్రీనును కూడా తుపాకీతో కొట్టాడు. దీంతో అక్కడ నుంచి శ్రీను, వెంకన్న వెళ్లిపోయారు. తీవ్రగాయాలతో రోడ్డుపై పడి పోయిన భాస్కర్‌కు మంచినీళ్లు కూడా ఎవరూ పోయవద్దని హెచ్చరించారు. గిరిజనులపై పెత్తనం చెలాయిస్తే ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరికలు చేశారు. దళం సభ్యులు అక్కడ నుంచి వెళ్లిపోయిన తర్వాత గ్రామస్థులు ఆసుపత్రికి తీసుకువెళ్దామని ప్రయత్నించగా అప్పటికే మృతిచెందాడు.

పోలీసులు రంగ ప్రవేశం

దళం చేతిలో హత్యకు గురైన రాయల భాస్కర్ మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఎస్పి అంబర్‌కిషోర్‌ఝా మంగళవారం సందర్శించారు. భాస్కర్‌కు తగిలిన గాయాలను పరిశీలించారు. స్థానిక పోలీసులతో మాట్లాడారు. నర్సంపేట గ్రామంలో దళం చేతిలో రాయల భాస్కర్ హత్య విషయం తెలుసుకొని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. గ్రామస్థులతో మాట్లాడారు. జరిగిన సంఘటన పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పెషల్ పార్టీ పోలీసులు రంగ ప్రవేశం చేశారు. రాజీవ్‌నగర్ కాలనీ వైపు ప్రత్యేక బలగాలు కాలి నడకన వెళ్లి గాలింపు చర్యలు చేపటాయి. పాండురంగాపురం, నర్సంపేట, ప్రభాతనగర్ గ్రామాల్లో బలగాలు మోహరించాయి.

నాడు ప్రభాత్‌నగర్... నేడు నర్సంపేట

పాల్వంచ రూరల్: నాడు ప్రభాతనగర్‌లో...నేడు నర్సంపేటలో హత్యలతో ప్రజలు వణికి పోతున్నారు. అప్పడు మావోయిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి భద్రు దళంతో క్రియాశీలకంగా ఉన్న మోరె రవి ప్రభాతనగర్‌లో సామా వెంకటరెడ్డిని కాల్చి చంపారు. ఇప్పుడు ఎన్డీ దళ కమాండర్‌గా మోరె రవి నర్సంపేటలో రాయల భాస్కర్‌ను హత్య చేశాడు. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మోరె రవి పాల్వంచలో నివాసం ఏర్పర్చుకున్నారు. తొలుత సీపీఐ ఎంఎల్ ఎన్డీలో పనిచేశాడు. ఈ క్రమంలో ప్రభాతనగర్ ఏరియాలో పోడు భూముల సమస్యలపై పనిచేస్తూ కొంత మంది చేతిలో ఉన్న వందల ఎకరాల భూములపై దృష్టిపెట్టారు. ఈ క్రమంలో ప్రభాతనగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సామ వెంకటరెడ్డికి, రవికి తీవ్ర విభేదాలు చోటుచేసుకున్నాయి. చివరకు రవి, భద్రు దళంలో పనిచేస్తూ వెంకటరెడ్డిని కాల్చి చంపారు. ఆతర్వాత పోలీసులకు లొంగిపోయి కొంతకాలం బయటకు వచ్చి పలు పార్టీల్లో పనిచేశాడు. ఇప్పుడు సీపీఐ ఎంఎల్ ఎన్డీ చంద్రన్న వర్గంలో పనిచేస్తూ ఇటీవలే దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఉల్వానూరు అటవీ ప్రాంతం దళకమాండర్‌గా పనిచేస్తున్నాడు. నర్సంపేటకు చెందిన భాస్కర్‌ను హత్య చేయడంతో ఈప్రాంతం లో మోరె రవి మరోసారి సంచలనం రేపాడు. పట్టపగలు దళంతో వచ్చి హత్య చేయడంతో ప్రజలు వణికి పోతున్నాడు.

ఆగస్టు 14 నుంచి రగిలింది

హత్యకు గురైన రాయలభాస్కర్ మొదట ఎన్డీ చంద్రన్న వర్గానికి సానుభూతి పరుడుగు ఉండేవాడు. ఆతర్వాత రాయల వర్గానికి దగ్గరయ్యాడు. రాజీవ్‌నగర్ కాలనీలోని చంద్రన్న వర్గానికి చెందిన భద్ర, శ్రీను, మరో ఇరువురితో రాయల భాస్కర్‌కు గొడవలు జరుగుతున్నాయి. ఈవిషయంపై దళ కమాండర్ మోరె రవి పలుమార్లు భాస్కర్‌ను హెచ్చరించాడు. దీంతో భాస్కర్ ఎన్డీ రాయల వర్గానికి చెందిన బట్టు ప్రసాద్, ఆజాద్ దళాల వద్దకు వెళ్లి మోరె రవి హెచ్చరిస్తున్నట్లు వివరించాడు. వీరు 14వ తేదీ రాత్రి చంద్రన్న వర్గానికి చెందిన భద్ర, శ్రీనును కొట్టి వెళ్లినట్లు తెలిసింది. ఆతర్వాత ఈ హత్య జరిగింది. చంద్రన్న, రాయల వర్గాల ఆదిపత్య పోరు హత్యల వరకు దారితీసింది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఇల్లెందురూరల్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జాల్లా ఇల్లెందు మండల పరిధిలోని భద్రుతండా గ్రామంలో బుధవారం జరిగింది. పోలారం పంచాయతీ భద్రుతండాకు చెందిన ఇస్లావత్ రాంజి(42) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న రాంజీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కొమరారం పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా రాంజి దహన సంస్కారాలకు డబ్బులు సైతం లేకపోవడంతో కొమరారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రూ.నాలుగువేలు ఆందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస రావు (ఫైల్)

కల్లూరు: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం యజ్ఞనారాయణపురంలో బుధవారం విద్యుదా ఘాతంతో రైతు మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కట్టా శ్రీనివాసరావు(36) బుధవారం సాయంత్రం వరిపొలానికి నీరు పెట్టేందుకు వ్యవసాయ మోటార్ స్విచ్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు కల్లూరులో ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. శ్రీనివాసరావుకు భార్య అరుణ, కుమారుడు ఉన్నారు.

రేంజర్ సదానందాచారి సస్పెన్షన్

అశ్వారావుపేట: స్వాతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించకుండా మద్యం మత్తులో మునిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అచుతాపురం అటవీపరిశోధన కేంద్రం అధికారి సదానందాచారిపై సస్పెన్షన్ వేటు పడింది. మంగళవారం తన కార్యాలయంలో జెండా ఎగరేయలేదు. పైగా బెల్ట్‌షాపులో మద్యం తాగుతూ జెండాను ఎగురవేయక పోవడం పెద్దనేరం కాదని వ్యాఖ్యానించారు.. దీనిపై ఆంధ్ర జ్యోతిలో కథనం ప్రచురిచతమైంది. స్పందించిన వరంగల్ డీఎఫ్ఓ పురుషోత్తం సదానందచారి సస్పెన్షన్‌కు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీని ఆధారంగా సస్పెన్షన్ చేశారు. ఆయన స్థానంలో వరంగల్‌లో రేంజర్‌గా పని చేస్తున్న నాగిని భానుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సదానందచారి గతంలో కరీంనగర్ జిల్లా కాటారంలో పనిచేసి, సస్పెండయ్యారు.

అంతర్ జిల్లాల దొంగల అరెస్టు

- ఆరుక్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం
- రికవరీ సొత్తు విలువ సుమారు రూ. ఎనిమిది లక్షలు
- ఇద్దరు నిందితుల అరెస్టు.. పరారీలో ఒకరు..
- వివరాలు వెల్లడించిన మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి


నిందితులను చూపుతున్నఎస్పీ

బయ్యారం: జల్సాలు, చెడువ్యసనాలకు అలవాటుపడి నాలుగు జిల్లాల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని బుధవారం మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో అరెస్టు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరిచినట్లు ఆ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం సుదిమళ్లకు చెందిన కుందూరి అనిల్‌రెడ్డి, మర్రిగూడెం గ్రామానికి చెందిన కుంజ శేఖర్ మంచి స్నేహితులు. సుదిమళ్లకు చెందిన అనిల్‌రెడ్డి ఎలక్ట్రికల్ విభాగంలో డిప్లమా చేసిన అనంతరం ఇల్లందులోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షాపులో పనిచేసేవాడు. ఈక్రమంలోనే అక్కడికి తరుచూ వస్తున్న మర్రిగూడేనికి చెందిన కుంజ శేఖర్‌తో పరిచయం ఏర్పడింది.దొంగతనాలకు పన్నాగం పన్నారు. అనుకున్నదే తడువుగా తనకున్న పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సుమారు ఆరునెలల వ్యవధిలో మహబూబాబాద్, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలో 59 ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైరును అపహరించారు. దీన్ని సులువుగా విక్రయించేందుకు ఎవరికీ అనుమానం రాకుండా ఇంటి వద్దనే కరిగించి, బిళ్లలుగా మార్చేవారు. దాదాపు ఆరు క్వింటాళ్ల బిళ్లలను సొంత ఆటోలో ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. గార్ల ఎస్ఐ వంశీధర్ నేతృత్వంలో వాహన తనిఖీల్లో దిరికారు. కాపర్‌వైరు విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. జిల్లాల వారిగా నిందితులు మహబూబాబాద్ జిల్లా పరిధిలో 22, ఖమ్మంలో 06, భద్రాద్రి కొత్తగూడెంలో 30, వరంగల్ పరిధిలో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌వైరు అపహరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అనిల్‌రెడ్డి, శేఖర్‌పై అవసరమైతే పీడీ యాక్టు కింద కూడా కేసు నమోదు చేయనున్నట్లు ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి పేర్కొన్నారు.

నా భార్యపై చర్య తీసుకోండి

ఇల్లెందు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట భర్త బైఠాయింపు


ఐసీడీఎస్ కార్యాలయం వద్ద పిల్లలతో బైఠాయించిన శ్రీనివాస్

ఇల్లెందురూరల్: భర్తల వేధింపులు తాళలేక తమకు రక్షణ కల్పించమంటూ... జీవనభృతి ఇవ్వాలంటూ ఆందోళనలు... న్యాయవివాదాలకు దిగుతున్న భార్యలను అనేక మందిని చూశాం. కానీ తన భార్య అన్యాయం చేసిందంటూ ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ ఏకంగా భర్త ఆందోళనకు దిగాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో బుధవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం సుదిమళ్ల పంచాయతీలోని సుభాశ్‌నగర్‌లో నివసిస్తున్న కుంజ శ్రీనివాస్ అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్‌గా పనిచేస్తున్న తన భార్య తమకు అన్యాయం చేసిందంటూ ఇరువురు పిల్లలతో ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద బైఠాయించాడు. తాను ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ పేరుతో జాప్యం చేస్తూ ఆమెపై చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించాడు. అందువల్లనే ఐసీడీఎస్ ఆఫీస్ ఎదుట బైఠాయించానని తెలిపాడు. కాగా ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ సీడీపీవో దయామణి మాట్లాడుతూ ఈ వివాదం కుటుంబానికి సంబంధించిందని, శాఖాపరంగా తాము ఎలా చర్యలు తీసుకోలేమని పేర్కొన్నారు. అంతేగాక శ్రీనివాస్ వేధిస్తున్నాడంటూ ఆయన భార్య జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారని ఈమేరకు విచారణ జరపాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించారని సీడీపీవో తెలిపారు.. కాగా శ్రీనివాస్ భార్య ఫోన్‌లో మాట్లాడుతూ తనను అనేక విధాలుగా హింసిస్తూ వేధింపులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనపై తప్పుడు ఫిర్యాదులు, అసత్య ప్రచారాలు చేస్తున్నాడని వాపోయింది.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు. విద్యా సంస్థలతో పనులు పూర్తవుతాయి. ప్రియతముల నుంచి ఆహ్లాదకరమైన సమాచారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ఆర్థిక విషయాల్లో మీ వైఖరిని సమీక్షించుకుంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక పరమైన లక్ష్యాలు సాధిస్తారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం.

మిథునరాశి: (మే21-జూన్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు ఫలిస్తాయి. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. రాజకీయ, సినీరంగాల వారికి ప్రోత్సాహకరం. శుభవార్త అందుకుంటారు. రవాణా, బోధన రంగాల వారికి అనుకూలం.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. దూరప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. పెట్టుబడుల విషయాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పూర్తిచేస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): మిత్రులు, బంధువులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): వృత్తి, వ్యాపారాల్లో ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు పూర్తవుతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. మెడికల్ క్లెయిములు పరిష్కారం అవుతాయి.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు సంభవం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. సంకల్పం నెరవేరుతుంది.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వైద్య, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి అనుకూల సమయం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): డిపాజిట్లపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. బ్యాంకుల, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బదిలీలు, మార్పులకు అనుకూలం. హోటల్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి పోత్సాహకరం. సేవల రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

● జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎన్	10	03


సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855
ఈవో రమణమూర్తి: 94910 00705
ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.
- 5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.
- 6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.
- ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.
- 7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.
- 10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.
- సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.

● భద్రాచలం రామయ్య

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	19
వందగదుల సదనం	62	23
శ్రీరామ సదనం	18	11
టీటీడీ సదనం	26	05
సౌమిత్రి సదనం	30	09

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (క్వింటాలుకు)

పంట	కనిష్ఠం	నమూనా	గరిష్ఠం
పత్తి	3,000	4,625	5,000
మిర్చి	2,000	3,800	5,000
మిర్చి (తాలు)	1,000	1,200	1,500
కందులు	4,200	4,300	4,411
పెసలు	3,300	3,900	4,711
మొక్కజొన్న	1,000	1,000	1.306
బొబ్బర్లు	5,100	5,100	5,100

ఉష్ణోగ్రత వివరాలు సెల్సియస్ డిగ్రీల్లో..

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	29	26
కొత్తగూడెం	32	26

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: జిల్లాలోని నాలుగు గురుకుల సంక్షేమ డిగ్రీ కళాశాలల్లోని వివిధ ఖాళీపోస్టులను అవుట్ సోర్సింగ్ ద్వారా నిరుద్యోగ యువతతో భర్తీచేస్తామని జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో రాజీవ్‌గాంధీ హనుమంతు ఒకప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాల్లో డిగ్రీ కళాశాలలు బాలురు ఒకటి, మూడు బాలికలకు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు.

కళాశాల్లో పనిచేసేందుకు బోధనేతర సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థనను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన నియమిస్తామని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల26వ తేదీలోగా ప్రాంతీయ సమన్వయ అధికారికి సమర్పించాలని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇలా ఎన్నిసార్లు..?

● కడుతున్నారు.. కూల్చుతున్నారు.. ● భద్రాద్రి వంతెన ఫిల్లర్ల నిర్మాణంలో నత్తనడక
● పనుల నిర్మాణ తీరుపై ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల అసంతృప్తి

భద్రాచలం: భద్రాచలంలో రెండో వారధి నిర్మాణంలో లోపాలు తలెత్తుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా సాగుతున్న పనుల పురోగతికి విఘాతం కలుగుతోంది. రెండో వారధి నిర్మాణానికి అవసరమైన ఫిల్లర్ల నిర్మాణంలో తరచూ సాంకేతికపరమైన లోపాలు తలెత్తుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. తాజాగా సారపాక వైపు నుంచి భద్రాచలం వైపు వస్తుండగా నిర్మిస్తున్న ఫిల్లర్ వంకరగా రావడంతో ఆ భాగాన్ని బుధవారం ఇంజనీరింగు అధికారుల సూచన మేరకు నిర్మాణ సంస్థ సిబ్బంది కూల్చివేశారు. ఇటీవల పలుమార్లు ఇలా ఫిల్లర్లు వంకరగా రావడంతో కూల్చివేసినట్లు ప్రచారం సాగుతోంది. సుమారు మూడు నెలల క్రితం నేషనల్ హైవే సీఈ ఢిల్లీ నుంచి వచ్చి వారధి నిర్మాణ పనులను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తంచేసినట్లు విశ్వసనీయ సమాచారం. అంతే కాదు ఇదే రీతిలో పనులు కొనసాగితే కాంట్రాక్టు రద్దుచేస్తామని హెచ్చరించినట్లు వినికిడి.

2015 ఏప్రిల్ ఒకటిన పనులు ప్రారంభం

భద్రాచలం వద్ద గోదావరిపై రెండో వారధి పనులు వాస్తవానికి జూలై 2014లో ప్రారంభం కావాల్సి ఉంది. సాంకేతికపరమైన అనుమతుల జాప్యంతో ఈ పనులు ప్రారంభంలో ఆలస్యం ఏర్పడింది. కాగా 2015 ఏప్రిల్ ఒకటిన రూ.65 కోట్లతో చేపట్టిన పనులకు కేంద్ర మంత్రులు నితన్‌గడ్కరీ, బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు శంకుస్థాపన చేశారు. ముంబైకి చెందిన కనస్ట్రక్షన్ ఈ టెండర్ దక్కించుకుంది. వారధికి 37పిల్లర్లతో రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది.

తొలి నుంచి నత్తనడకే..

తొలి నుంచి రెండో వారధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ క్రమంలో జాతీయ రహదారుల శాఖ అధికారులు పలుమార్లు సంబంధిత సంస్థకు నోటీసులు జారీచేసినా ఎటువంటి పురోగతి లేదు. 2016 జూలైనాటికి ఈ పనులు పూర్తిచేయాల్సి ఉంది. నిర్దేశించిన సమయానికి పనులు పూర్తికాకపోవడంతో సంబంధిత సంస్థ వినతి మేరకు నేషనల్ హైవే ఉన్నతాధికారులు 2017 సెప్టెంబరు 30 వరకు రెండో వారధి నిర్మించేందుకు గడువు పొడిగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 2018 జూలై నాటికైనా పనులు పూర్తవుతాయా అనేది ప్రశ్న.

ఫిల్లర్లు పగలకొట్టడానికి కారణం ఇదే..

భద్రాద్రిలో రెండో వారధికి సంబంధించిన ఫిల్లర్ల లెవల్‌లో తేడా రావడంతో పరిశీలించిన అధికారులు ఆ భాగాన్ని తొలగించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల పలు ఫిల్లర్లపై భాగాన్ని పగలకొడుతున్నారు. సెంట్రింగ్‌లో నూతన విధానం ద్వారా వీటిని నిర్మించగా ఈ సమస్య రావడంతో తిరిగి సాధారణ పద్ధతిలోనే ఫిల్లర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



ఫిల్లర్‌ను పగులగొడుతున్న దృశ్యం

ఫిల్లరు కూలిపోయినట్లు పుకార్లు

భద్రాద్రి రెండో వారధి నిర్మాణంలో ఫిల్లరు కూలిపోయిందంటూ బుధవారం సాయంత్రం జోరుగా పుకార్లు షికార్లు చేశాయి. దీంతో మొదటి వారధిపై నుంచి దానిని చూసేందుకు పలువురు అక్కడికి చేరుకున్నారు. సోషల్ మీడియాలో సైతం దీనిపై ప్రచారం జరగడంతో అంతా ఆందోళన చెందారు.

మేమే సూచించాం: నేషనల్ హైవే డీఈ

ఫిల్లర్ నిర్మాణంలో మేమే సుమారు పది సెంమీ. భాగం ఫ్లమ్ తేడారావడంతో (వంకర) కూల్చివే యాలని సంబంధిత నిర్మాణ సంస్థ సిబ్బందికి సూ చించామని నేషనల్ హైవే డీఈ విద్యాసాగర్ తెలిపా రు. 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ ఫిల్లరు కూలిపోయిన మాట వాస్తవం కాదు, సాంకేతికపర మైన లోపం రావడంతో కూల్చేవేశామన్నారు.

అపరాల మార్కెట్ ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: వ్యవసాయ మార్కెట్ యార్డులో అపరాల మార్కెట్‌ను బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా అపరాలు మార్కెట్‌కు రాకపోవడంతో వ్యాపార లావాదేవీలు నెమ్మదించగా ప్రస్తుతం కొత్త సీజన్‌లో అమ్మకానికి పెసలు, కందులు వస్తుండటంతో అపరాల యార్డును ఆయన ప్రారంభించి ఈనామ్ పద్ధతిలో జరిగిన కొను గోళ్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ ఆర్. సంతోష్‌కుమార్, అసిస్టెంట్ సెక్రటరీ నర్సింహారావు, సూపర్‌వైజర్లు ఆంజనేయులు, రాజా పాల్గొన్నారు.

రెండురోజుల టోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధం

ఉమ్మడి జిల్లా సదస్సులోవక్తలు

ఖమ్మంకార్పొరేషన్: మునిసిపల్ కార్మికుల వేతనాలు పెంపు కోసం ఈనెల 29, 30తేదీల్లో రెండురోజులటోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెచేస్తామని హెచ్చరించారు. బుధవారం ఖమ్మంలోని షాదీఖానాలో ఉమ్మడి ఖమ్మంజిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ , ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి కె.సూర్యం, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఎస్ఏ జలీల్ మాట్లాడారు. జీహెచ్ఎంసీతో సహా రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నా కేవలం జీహెచ్ఎంసీ కార్మికులకు మాత్రమే వేతనాలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు.



సదస్సులో జేఏసీ నాయకులు అభివాదం

బంగారు భవిత!

ఉన్నతమైన చదువులు చదివినా ఉద్యోగం రాక.. ఉపాధి అవకాశాలు ఉన్నా సద్వినియోగం చేసుకోలేని గిరిజన యువత జీవితాల్లో వెలుగులు నింపుతోంది భవిత కార్యక్రమం.. ఏటా ఎందరికో శిక్షణను ఇచ్చి స్వయం ఉపాధిని పొందేలా చేస్తోంది. వారి భవిష్యత్తుకు రాచబాట వేస్తోంది. రెండు రోజుల పాటు అవగాహన కల్పించి.. మూడు నెలల పాటు కోరుకున్న అంశంలో శిక్షణ ఇచ్చి నేరుగా ఉద్యోగా అవకాశాలను కల్పిస్తూ గిరిజన యువతీ యువతకు బాసటగా నిలుస్తోంది. గిరిజన నిరుద్యోగ యువతకు వరంగా మారిన "భవిత"పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

\- అశ్వారావుపేట రూరల్


ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్న అధికారులు


ఉపాధి అవకాశాలను చూసుకుంటున్న గిరిజన యువత


సదస్సులతో అవగాహన పెంచుకుంటున్న యువత


కుట్టు శిక్షణ పొందుతున్న యువతులు

- ఐటీడీఏ ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణ
- 100 అంశాల్లో ఉపాధి అవకాశాలు
- నాలుగేళ్లలో 1,200 మందికి ఉద్యోగాలు
- ఆదివాసీలకు అండగా నిలుస్తున్న గిరిజన సంక్షేమ శాఖ

గిరిజన సంక్షేమానికి ముఖ్యంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుంది. రకరకాల పథకాలు ఉన్నా యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి కల్పన అంతంత మాత్రంగానే ఉంటోంది. నిత్యం ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కనీసం ప్రైవేటు రంగంలోనైనా ఉపాధి కల్పించండంటూ వేడుకునే యువత వేలల్లోనే ఉన్నారు. అధికారులు తగిన ఉద్యోగాలు కల్పించకలేకపోవటంతో నిరుద్యోగ యువత పెడదారి పట్టిన ఘటనలు లేకపోలేదు.

నాలుగేళ్లలో 1 20మందికి ఉద్యోగ, ఉపాధి..

2013లో ప్రారంభమైన ఈకార్యక్రమం ద్వారా ఏటా వేలాది మంది నిరుద్యోగులు శిక్షణలు పొందుతూ వంద లసంఖ్యలో ఉద్యోగాలు పొందారు అవగాహన సదస్సులు, శిక్షణ అనంతరం వివిధ కంపెనీల సహకారంతో మండల, నియోజకవర్గస్థాయిలో జాబ్ మేళాలను నిర్వహిస్తూ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలను కల్పిస్తారు. ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, హైదరాబాదు, భద్రాచలం, సూర్యాపేట ఇలా పలు ప్రాంతాల్లో ఉగ్యోగ అవకాశాలను కల్పించారు. రెండు రోజుల పాటు శిక్షణను ఇచ్చారు. ఏడాదిలో దాదాపు 2500మంది అవగాహన కార్యక్రమాలకు హాజరయ్యారు. వీరిలో 700మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందగా 500 మంది వరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలను పొందారు. మరికొందరు ఐటీడీఏ ద్వా రా స్వయం ఉపాధిని పొందారు. 2015లో 10 మండలాల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించగా 1,115 మంది శిక్షణ పొందారు. వీరిలో దాదాపు 200మంది కి రక్ష సెక్యూరిటీ ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పించారు. 2016లో దాదాపు 1,050 మందికి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. దాదాపు 300మందికి ఉద్యోగాలు కల్పించారు. 2017-18కి సంబందించి అశ్వారావుపేటలో రెండు రోజుల పాటు అవగాహన సదస్సును నిర్వహించారు. 90 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. 26మందికి నేరుగా ఉ ద్యోగ అవకాశాలను కల్పించారు. ఈఏడాది మరో 15 చోట్ల కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు తయారుచేస్తున్నారు.

గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ ఆలోచనతోనే...

2013లో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్‌గా పనిచేశారు. ప్రతి సోమవారం ఐటీడీఏల్లో జరిగే ప్రజాదర్బారుకు గిరిజన యువతీ యువకులు వందలాదిగా వచ్చి ఉపాధి చూపమని దరఖాస్తులు చేసేవారు. సుదూర ప్రాంతాల నుంచి యువత స్వయం ఉపాధిని కల్పించాలంటూ రూ.వందలు ఖర్చుచేసి కార్యాలయానికి వస్తున్నారు. ఈనేపథ్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి జాబ్‌మేళాను నిర్వహిస్తే యువతకు దారి చూపవచ్చనే ఆలోచన చేశారు. కమిషనర్ ఆలోచన ప్రకారం భవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నిరంతరం నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తూ వస్తోంది భవిత.

దాదాపు 100 అంశాల్లో శిక్షణ..

భవిత కార్యక్రమం ద్వారా దాదాపు వందఅంశాల్లో నిరుద్యోగ గిరిజన యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నారు. విద్యార్హతల ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారు. ఐదో తరగతి నుంచి ఎంఎస్సీ, బీటెక్ ఇలా వరకు విద్యాభ్యాసం చేసిన వారు శిక్షణ పొందటానికి అర్హులే. జిల్లా కేంద్రాలతో పాటు రాష్ట్ర రాజదానిలోనూ దాదాపు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతిని కల్పిస్తున్నారు. సెక్యూరిటీ. డాటా ఎంట్రీ, టాలీ అకౌంటెంట్, హోటల్ క్యాషియర్, మేనేజ్‌మెంట్, వైద్యరంగంలో ఏఎన్ఎం, జీఎన్ఎం, భవన నిర్మాణ రంగంలో ఎలక్ట్రిషియన్, వెల్డర్, రాడ్ వెండింగ్, ప్లంబర్, పెయింటింగ్, డెకరేషన్, జనరల్ వర్క్స్, మల్టీమీడియాలో వెబ్ డిజైనర్, మల్టీ మొబైల్ సర్వీస్, మహిళలకు బ్యూటిషియన్, కుట్లు అల్లికలు, కంప్యూటర్ ట్రైనింగ్, ఆటో క్యాడ్ ఇలా దాదాపు వంద అంశాల్లో వీరికి శిక్షణను ఇస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న దీన్‌దయాల్ ఉపాధ్యాయ కౌసల్య యోజన(డీడీజీకేవై), ప్రధానమంత్రి కౌసల్య కిసాన్ యోజన(పీఎంకేవీవై)ద్వారా గిరిజన యువతకే కాకుండా ఇతర వర్గాల వారికి శిక్షణ ఇస్తున్నారు.

రూ.8వేల నుంచి రూ.25వేల వరకు..

విద్యార్హత, తీసుకున్న శిక్షణ ఆధారంగా ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. వీరి వేతనం రూ.8వేల నుం చి రూ.25వేల మధ్యన ఉంటుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన వారే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పదుల సంఖ్యలోనే పనిచేస్తున్నారు. నర్సు శిక్షణ తీసుకున్న పలువురు నేడు వైద్యశాఖలో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నారు. పలువురు కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నారు.


జాబ్‌మేళాలో పేర్లు నమోదు చేసుకుంటున్న యువతులు



భవిత ద్వారా ఉద్యోగాన్ని పొందాను..
జె.శివాజీ, బచ్చువారిగూడెం

భవిత ద్వారా హైదరాబాదులో 2016లో శిక్షణ పొందాను. వజీర్ స్కిల్స్ సెంటర్ ద్వారా మూడు నెలల పాటు శిక్షణ పొందాను. ప్రస్తుతం ఇక్కడే హెరిటేజ్ ఫుడ్ సూపర్ మార్కెట్‌లో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్నాను. ఒకపుడు ఖాళీగా ఉండి భవిత ద్వారా ప్రస్తుతం ఉపాధిని పొంది నెలకు రూ.తొమ్మిది వేల వరకు వేతనాన్ని పొందుతున్నాను.



ఎందరికో ఉపాధి..
సీహెచ్..అంబిక.. వెంకటాపురం మండలం

మాది మారుమూల మర్లగూడెం గ్రామం. భవిత ద్వారా గతేడాది శిక్షణ పొంది ప్రస్తుతం హెరిటేజ్ ఫుడ్ సూపర్‌మార్కెట్‌లో కస్టమర్ సేల్స్ అసోసియేట్‌గా పనిచేస్తున్నా. భవిత ద్వారా ఎందరో ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో ఉపాధిని పొందారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటే భవితకు ఢోకా ఉండదు.



వరంగల్‌లో ఉచితంగా శిక్షణ తీసుకున్నా..
పి.ముత్యాలరావు..ఆసుపాక..అశ్వారావుపేట మండలం

భవిత ద్వారా నిర్వహించిన అవగాహన సదస్సులకు హాజరై డ్రైవింగ్‌లో శిక్షణ పొందాను. గతేడాది మార్చి 9వ తేదీనుంచి దాదాపు 45రోజుల పాటు వాహనాలు నడపటంతో శిక్షణ పొందాను. శిక్షణ పొందినందుకు సర్టిఫికెట్ ఇచ్చారు.



స్వయం ఉపాధి కల్పనే ధ్యేయం..
వెంకయ్య, భవిత కోఆర్డీనేటర్

గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా భవితను ముందుకు తీసుకెళుతున్నాం. జిల్లా పాలనాధికారి, ఉన్నతాధికారుల సూచనల ప్రకారం కార్యక్రమ నిర్వహణ చేపడుతున్నాం. ఇతర వర్గాల వారికి ఉపాధి చూపేందుకు కృషిచేస్తున్నాం.



అనేక విషయాలను నేర్చుకున్నా..
జి.జ్యోతి, వినాయకపురం

రెండు రోజుల పాటు నిర్వహించిన అవగాహన సదస్సులకు హాజరయ్యాను. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగ, ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నారు. శిక్షణా కార్యక్రమంలో అనేక అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ నామ్ కేవాస్తే..!

eNAM Uttam Fasal Uttam Enaam

- వ్యవసాయ మార్కెట్‌లో ఈ-మార్కెటింగ్ అమలు ఎప్పుడు ?
- ఎప్పటికప్పుడు వాయిదాలతో సరి..
- దళారుల దందాకు అడ్డుకట్ట ఎన్నడు ?
- త్వరలో ప్రారంభం కానున్న పత్తిసీజన్
- ఆన్‌లైన్ కొనుగోళ్లకోసం రైతుల ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం)

రైతుకు గిట్టుబాటు ధర... దళారీ వ్యవస్థ నిర్మూలన.. వ్యవసాయ మార్కెటింగ్‌కు ఆదాయం తదితర లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెటింగ్ ఈ-నామ్ వ్యవస్థ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఇప్పట్లో అమలుకు నోచుకునే అవకాశం కనిపించడం లేదు. ప్రతీసారి ఏదో ఒక సాకుతో ఈ-నామ్ అమలు వాయిదా పడుతూనే ఉంది. దాంతో మార్కెట్‌లో దళారీ వ్యవస్థ నిర్మూలన జరగడంలేదు. వాస్తవానికి బుధవారం నుంచి ఖమ్మం మార్కెట్‌లో ఈ-నామ్ పద్ధతిలో మిర్చి, పత్తి కొనుగోళ్లు జరుగుతాయని మార్కెటింగ్ శాఖ పేర్కొన్నప్పటికీ మళ్లీ వాయిదా పడింది. ఈసారి కంప్యూటర్లు రాలేదని వర్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ-నామ్ కోసం రూ.30లక్షలతో మార్కెటెంగ్ శాఖ కంప్యూటర్లను కొనుగోలు చేయాలనుకుంది. అయితే జీఎస్టీ రావడంతో కంప్యూటర్ల ధరల్లో వ్యత్యాసం వల్ల టెండర్లను రద్దు చేశామని, అందువల్లే కంప్యూటర్లు కొనుగోలు చేయలేదని చెబుతున్నారు. మరో నెల రోజుల్లో పత్తి సీజన్ కూడా ప్రారంభమవుతోంది. ఇప్పటి నుంచే ఈ-నామ్ కొనుగోళ్లు ప్రారంభిస్తేనే అప్పటి వరకు రైతులు, వ్యాపారులు నూతనవిధానానికి అలవాటు పడే అవకాశం ఉంటుంది. కానీ ఎప్పటికప్పుడు ఆలస్యమవుతుండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ఆదిలోనే హంసపాదు..

ఈ-నామ్ వ్యవస్థ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గత ఏడాది నుంచే అమలుకావాల్సి ఉంది. కానీ ఇంతవరకు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. ఈ సీజన్‌లో అయినా ఈ-నామ్‌లో కొనుగోళ్లు ఉంటాయా అని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటినుంచే కార్యచరణ జరపాల్సి ఉన్నప్పటికీ మళ్లీ అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. తెలంగాణలోనే ప్రముఖ వ్యవసాయ మార్కెట్‌లో ఒకటిగా ఉన్న ఖమ్మం మార్కెట్‌కు ఏటా రూ.15కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పంట విలువలో వ్యాపారులు 1శాతం, మార్కెటింగ్ శాఖకు సెస్ చెల్లిస్తారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి, మిర్చి తోపాటు అపరాలు, మొక్కజొన్న పంటలు కూడా కొనుగోలు జరుగుతాయి. జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాలతోపాటు ఆంధ్రాలోని కృష్ణా జిల్లాల నుంచి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఉత్పత్తులు వస్తాయి. ఖమ్మం జిల్లాలో లక్షకు పైగా హెక్టార్లలో పత్తి, 65వేల హెక్టార్లలో వరి, 9వేల హెక్టార్లలో పెసర, మరో 9వేల హెక్టార్లలో మొక్కజొన్న, 5వేల హెక్టార్లలో కంది పంటలతోపాటు మిర్చి సుమారు 25 వేల హెక్టార్లకుపైగా సాగవుతోంది. రైతు లు పండించే పంటల కొనుగోళ్లు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచే జరుగుతాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు, దళారులు, కమీషన్ ఏజంట్లదే హవా నడుస్తోంది. అంతా రింగ్‌గా మారడంతో వారు చెప్పిన రేటుకే రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ-నామ్ అమలులోకి వస్తే ఈ పరిస్థితి మారే అవకాశముంటుందని రైతులు ఆశించారు. ఈ విధానంలో రైతు మార్కెట్‌కు తీసుకొచ్చిన పంటను రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న వ్యాపారులు కూడా నాణ్యతను బట్టి, ధరను బట్టి కొనుగోలు చేసే సౌలభ్యం ఉంది. తద్వారా దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో, ఏ మార్కెట్‌లో రైతులు పండించిన వ్యవసాయ పంటలకు ధర లభిస్తుందో ఆ ధర ఇక్కడ కూడా అమలయ్యే అవకాశం ఉంది. ఈ-నామ్ పద్ధతిలో వ్యవ సాయ మార్కెట్‌కు రైతు పంట తీసుకురాగానే ఆ రైతు వివరాలతోపాటు పంట వివరాలు, లాట్ నెంబర్, పంట గ్రేడ్, నాణ్యత గ్రేడ్, వ్యాపారులు కొనుగోలు చేసిన విలువ, రైతులకు రావాల్సిన సొమ్ము వివరాలు అంతా క్షణాల్లోనే జరిగిపోతుంది.



ఈ-నామ్‌లో లైసెన్డ్ వ్యాపారికే అవకాశం..

ఈ-నామ్ అమలైతే ప్రతీ వ్యాపారి ఖచ్చితంగా లైసెన్స్ పొంది ఉండాలి. లైసెన్స్ లేని వ్యాపారులు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉండదు. ఆ లైసెన్స్‌పైనే ఇతర ప్రాంతాలకు కొనుగోలు చేసిన పంటలను ఎగుమతి చేసుకునే సౌలభ్యం ఉంటుంది. అయితే కొందరు వ్యాపారులు రైతులు అమ్మిన పంటను ఈ-మార్కెటింగ్ పద్ధతిలో వేరే ప్రాంత వ్యాపారి కొనుగోలు చేస్తే రైతులకు డబ్బులు ఎలా వస్తాయని రైతులకు భద్రత ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ-మార్కె టింగ్ పద్దతిలో ఎప్పటినుంచో పొగాకు ఉత్ప త్తులను వేలంలో వ్యాపారులు కొనుగోలు చే స్తున్నారు. రైతులు అమ్మిన పొగాకుకు మధ్యవర్తిగా పొగాకుబోర్డు ఉండి వ్యాపారుల నుంచి సొమ్ములు వసూలు చేసి రైతులకు అందిస్తోంది. ఇందుకు పొగాకు వ్యాపార కంపెనీలు బ్యాంకు గ్యారంటీలు సమర్పించి కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇదే విధంగా ఈ-నామ్ పద్దతిలో వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటే పరిష్కారం ఉంటుంది. ఏది ఏమైనా వ్యవసాయ సీజన్ మొదలైనందున త్వరలోనే పత్తిసీజన్ రాబోతున్నందున ఖమ్మంవ్యవసాయ మార్కెట్‌లో ఈ-నామ్ కొనుగోళ్లు ప్రారంభించి పకడ్బందీగా చర్యలు తీసుకుంటే రైతులకు మార్కెట్‌లో ఆదాయం లభించే అవకాశం ఉంది. ఇటీవల మిర్చి మార్కెట్‌లో జరిగిన ఘర్షణలు, మార్కెట్‌పై దాడి సంఘటనను దృష్టిలో ఉంచుకుని ఈ-నామ్ అమలుకు శ్రీకారం చుడితే ఎటువంటి ఘర్షణలు తెలెత్తే అవకాశం ఉండదు.



ఈ-నామ్ అమలు చేస్తాం
మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో త్వరలోనే ఈ-నామ్ అమలు చేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బుధవారం నుంచి ఈ-నామ్ అమలు చేద్దామనుకున్నప్పటికీ కంప్యూటర్లు రానందున వాయిదా వేశామని, జీఎస్టీ వల్ల కంప్యూటర్ల కొనుగోలు టెండర్ రద్దయిందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఈ-నామ్ పద్ధతిలో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు పట్టుదలతో ఉందని, తద్వారా మార్కెట్‌కు కూడా ఆదాయం పెరుగుతుందని తెలిపారు. వ్యాపారులు, రైతులకు ఈ-నామ్ అమలుపై అవగాహన కల్పించామని, ఇందులో వారికున్న అపోహలను కూడా తొలగించామని, అభ్యంతరాలుంటే పరిష్కరిస్తామని వివరించారు.

రామాలయంలో మళ్లీ బాపు చిత్రాలు

- రెండేళ్ల తరువాత రామాయణ చిత్రాల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బాపు రామాయణ చిత్రాలు మళ్లీ భక్తుల ముంగిటకు వచ్చాయి. రామాలయ ప్రాంగణంలోని చిత్ర కూట మండపంలో వీటిని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ముళ్లపూడి వెంకటరమణ రచించిన రామాయణానికి ప్రముఖ చిత్రకారుడు బాపు అందమైన బొమ్మలు గీశారు. దానికి మరింత శోభను తీసుకొచ్చారు. వీటిని తొలుత మిథిలా స్టేడియం ప్రాంగణంలోని డార్మిటరీ హాల్లో ఏర్పాటు చేశారు. 2009 అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డా. వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. రామాలయాన్ని దర్శించిన భక్తులు స్వామి వారి దర్శనంతో పాటు భద్రాద్రి క్షేత్ర చరిత్ర, రామాయణ ప్రాశస్త్యం తెలుసుకునేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశారు. అయితే, ఆ ప్రాంగణం తరచూ వర్షాకాలంలో నీట మునుగుతుండడంతో అధికారులు వాటిని తొలగించారు.వాటిని మరలా ఏర్పాటు చేయకుండా రెండేళ్లపాటు కాలం గడిపారు. అధికారుల ఉదాసీనతపై 'ఆంధ్రజ్యోతి'లో అప్పట్లో కథనం సైతం ప్రచురితమైంది. ఈక్రమంలో భద్రాచలం దేవస్థానం ఈవో కె. ప్రభాకర్ శ్రీనివాస్ బాపు చిత్రాలకు మళ్లీ మోక్షం కల్పించారు. ఇదిలా ఉండగా దేవస్థానం అధికారులు ఇటీవల రామాయణం ఇతివృత్తంగా ఉన్న చిత్రాలు రామాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. బాపు చిత్రాలు చిట్రకూట మండపంలో తాజాగా ఏర్పాటు చేస్తున్నారు. మరో రెండు నెలల్లో మాస్టర్‌ప్లాన్ అమల్లో భాగంగా అబివృద్ధి పనులు చేపట్టనుండడంతో మళ్లీ వీటిని తొలగించే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సారి మళ్లీ వీటిని ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది తేలాల్సి ఉంది.


బాపు చిత్రాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



సూక్తి

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- సర్వేపల్లి రాధాకృష్ణ

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : మీ ఇంట్లో దొంగలు పడ్డారట కదా నిజమేనా!

వెంగళప్ప : అవును

టీచర్ : వాళ్లను చూసి నువ్వు భయంతో దాక్కున్నావట కదా.

వెంగళప్ప : నేను భయంతో దాక్కోలేదు.

టీచర్ : మరి!

వెంగళప్ప : మా ఇంట్లో విలువైన వస్తువులు ఏమీ లేకపోవడం మూలంగా దొంగలకు ముఖం చూపించడానికి సిగ్గేసింది.

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియంల ▸ ....
2. ప్రయంళ ▸ ....
3. నయంన ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

కొంటె ప్రశ్న

సముద్రం మధ్యలో ఏముంటుంది?

చుక్కలు కలపండి



టంగ్‌ట్విస్టర్స్

1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.





10,000 ఆమ్లెట్ ఫెస్టివల్

ఇంట్లో ఆమ్లెట్ రుచి చూడటం అందరూ చేసేదే. హోటల్‌కెళ్తే డబల్ ఎగ్ ఆమ్లెట్‌ను ఆర్డర్ చేస్తాం. కానీ ఏకంగా పది వేల కోడిగుడ్లతో ఆమ్లెట్ వేయడం ఎక్కడైనా చూశారా? బెల్జియంలోని మాల్‌మెడి పట్టణంలో నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవంలో అలా ఆమ్లెట్ వేశారు. కోడిగుడ్లలో ఫిప్రోనిల్ అనే విషపదార్థం ఉందంటూ వార్తలు రావడంతో ఆ భయాన్ని పోగొట్టేందుకు ఈ ఆమ్లెట్ ఉత్సవాన్ని నిర్వహించారు.

రోజూ గుడ్డు తినండి. ఆరోగ్యంగా ఉండండి అని టీవీల్లో చూస్తుంటాం. డాక్టర్లు సైతం కోడిగుడ్డు ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. అయితే యూరప్ దేశాల్లో నిర్వహించిన తనిఖీల్లో కోడిగుడ్లలో ప్రమాదకరమైన ఫిప్రోనిల్ అనే ఇన్‌సెక్టిసైడ్(పురుగులను చంపే రసాయన పదార్థం) ఉన్నట్లు తేలిందని వార్తలు వెలువడ్డాయి. యూరోపియన్ యూనియన్ ఫుడ్ సేఫ్టీ అలర్ట్ సిస్టమ్ ఈ విషయాన్ని ధృవీకరించింది. బెల్జియంతో పాటు నెదర్లాండ్, జర్మనీ వంటి దాదాపు 18 దేశాల్లో ఈ రకమైన రసాయనం ఉన్న గుడ్లు ఉన్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఇది ఆ నోట ఈ నోట జనాల్లోకి పాకిపోయింది. దాంతో ప్రజలు గుడ్లు తినడం మానేశారు. అయితే యూరప్



దేశాల్లో ఉత్పత్తి అయ్యే గుడ్లతో ఎలాంటి ప్రమాదం లేదని, హాంకాంగ్ నుంచి కల్తీ గుడ్లు వచ్చి చేరాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. ప్రజలు కొన్ని లక్షల గుడ్లను నాశనం చేశారు. ఫిప్రోనిల్ ఉండే అవకాశం ఉన్న గుడ్లన్నింటినీ సూపర్‌మార్కెట్లలో నుంచి తొలగించారు. ఈ దెబ్బకు దాదాపు 180 పౌల్ట్రీ పరిశ్రమలు మూతపడ్డాయి.

ఆమ్లెట్ ఫెస్టివల్‌తో మళ్లీ కళకళ

ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు ఆమ్లెట్ ఫెస్టివల్‌ను వేదికగా చేసుకోవాలని నిర్ణయించాయి వ్యాపార వర్గాలు. ఆమ్లెట్ ఫెస్టివల్ నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. రెండు దశాబ్దాలుగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'ఆమ్లెట్ ఫెస్టివల్‌ను 22 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇది సంప్రదాయంగా వస్తోంది. ఇప్పుడు కోడిగుడ్లతో ప్రమాదం అని భయపడి ఫెస్టివల్ నిర్వహించకుండా ఉండలేం' అని బెల్జియంకు చెందిన ఒక కుటుంబం అభిప్రాయపడింది. నిర్వాహకులు సైతం వెనకంజ వేయకుండా ఆమ్లెట్ ఫెస్టివల్‌ను నిర్వహించారు.

ఆమ్లెట్ ఎలా వేశారంటే...!

ముందుగా నాణ్యమైన గుడ్లను వ్యాపారస్తుల నుంచి, సరఫరాదారుల దగ్గర నుంచి సేకరించారు. పట్టణంలోని సెంటర్‌లో కట్టెల పొయ్యి ఏర్పాటు చేశారు. 4 మీటర్ల వైశాల్యం ఉన్న ప్యాన్ పెట్టారు. అందులో కోడిగుడ్లను కొడుతూ బాగా కలియబెట్టారు. తరువాత ఆమ్లెట్‌లుగా వేస్తూ ఫెస్టివల్‌కు వచ్చిన వారందరికీ పంచారు. 'మా స్థానిక ఉత్పత్తులపై, మా సరఫరాదారులపై మాకు పూర్తి నమ్మకం ఉంది. మేం నిర్వహించిన ఆమ్లెట్ ఉత్సవానికి ఇంత మంది హాజరుకావడం కూడా ఆనందంగా ఉంది. ప్రజల్లో కొంత భయం మాట ఉన్న నిజం, అయితే ఇక్కడికి వచ్చిన వారి సంఖ్యను చూస్తే ముందున్నవి మంచి రోజులేనని అనిపిస్తోంది' అని కార్యక్రమానికి గ్రాండ్‌మాస్టర్‌గా పనిచేసిన గిల్లిస్ అన్నారు. గతంలోనూ బెల్జియంలో ఇలాంటి రూమర్ వ్యాపించింది. చికెన్, గుడ్లలో కార్సినోజన్‌గా పిలిచే డైఆక్సిన్ అనే విషపదార్థం ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అప్పటి నుంచి ఏటా ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ వస్తున్నారు.

జవాబులు

జంతర్‌మంతర్ : 1. విలయం 2. ప్రళయం 3.నయనం
జంబ్లింగ్ వర్డ్స్ : 1.FOUR 2.GEAR 3.WEAR
కొంటె ప్రశ్న : నీళ్లే ఉంటాయి.

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. UORF ▸ ....
2. RAGE ▸ ....
3. RWEA ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

దారి కనుక్కోండి



వ్యాధి నిరోధక కొత్తటీకా సిద్ధం

● నేటినుంచి పిల్లలకు 'మీజిల్స్ రుబెల్లా' ● 3.54 లక్షల మందికి వేసే లక్ష్యం ● తప్పకుండా వేయించాలి: డీఎంహెచ్‌వో

ఖమ్మం టౌన్: గతంలో మీజిల్స్ (తట్టు) రాకుండా టీకా వేసేవారు. ప్రస్తుతం మీజిల్స్, రుబెల్లా రెండు వ్యాధులు రాకుండా ఒక కొత్త టీకాను తయారు చేశారు. గురువారం సదరు టీకా 9నెలల నుంచి 15ఏళ్ల వయస్సు గల పిల్లలందరికీ వేయనున్నారు. జిల్లాలో 9 నెలల నుంచి 15ఏళ్ల వయస్సు గల పిల్లలు 3.54లక్షల మంది ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఆ పిల్లలకు టీకాలు వేయాల్సి లక్ష్యంగా పెట్టుకున్నారు. మీజిల్స్ రుబెల్లా ఒకే టీకాగా వేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ (ఎన్‌హెచ్‌ఎం) నిర్ణయించింది. గతంలో కొన్ని రాష్ట్రాల్లో ఈ టీకాను వేయగా గురువారం తెలంగాణ రాష్ట్రంలో కొత్త వ్యాధి నిరోధక టీకా వేయడం ప్రారంభిస్తారు. వచ్చే నెల 25వరకు టీకాలు వేసే కార్యక్రమం ఉంటుంది. మీజిల్స్‌ను తట్టు అంటారు. బాలలకు తీవ్రమైన జ్వరం, చర్మం మీద ఎర్రటి దద్దుర్లు రావడం, మీజిల్స్ వ్యాధి లక్షణాలు. ఇది దగ్గడం, తుమ్మడం ద్వారా కూడా ఒకరి నుంచి ఒకరికి సోకుతుంది. మీజిల్స్ ఒక ప్రాణాంతక వ్యాధిగా వైద్యులు గుర్తించారు. దీని కారణంగా బాలలకు న్యూమోనియా, విరేచనాలు, మెదడు వాపు వ్యాధులు వస్తాయి.

ఇక రుబెల్లా కూడా హాని కలిగించే వ్యాధి. గర్భంతో ఉన్న మహిళలకు రుబెల్లా సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పుట్టబోయే బిడ్డకు దృష్టి వినికిడి లోపం, మెదడు, గుండె సంబంధ వ్యాధులు వస్తాయి. ఒక్కోసారి గర్భస్రావం, మృత శిశువు జన్మించడం జరుగుతోంది. ఈ వ్యాధులను అరికట్టేందుకు మీజిల్స్ రుబెల్లాకు వేర్వేరు టీకాలు కాకుండా ఒకే టీకాను 9నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలకు వేసే కార్యక్రమం గురువారం ప్రారంభమవుతుంది.

ప్రత్యేక వైద్యుల ద్వారా...

పోలియో చుక్కలు ఎవరైనా వేయొచ్చు. కానీ మీజిల్స్ రుబెల్లా (ఎంఆర్) టీకా ప్రత్యేకంగా నిపుణులైన వైద్యులు మాత్రమే వేయాల్సిందే. అందుకు జిల్లాలో 3.54లక్షల మంది 9నెలల నుంచి 15ఏళ్లవయస్సు గల బాలలకు టీకాలు వేసేందుకు 450మంది ప్రత్యేక వైద్య నిపుణులను నియమించారు. మరో 30మందిని సిద్ధంగా ఉంచారు. 112మంది సూపర్‌వైజర్లను నియమించారు. మొబైల్ టీమ్ కోసం 64వాహనాలను ఏర్పాటు చేశారు.

జిల్లాలో మొత్తం కేంద్రాలు: 3763

పాఠశాలలు 1671
అంగన్‌వాడీ కేంద్రాలు 1596
పీహెచ్‌సీ, పీపీ యూనిట్లు 432
క్వారీలు, ఇటుక బట్టీల వద్ద 64
జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు : 22
అప్‌గ్రేడ్ పీహెచ్‌సీలు 3
పీపీ యూనిట్లు 2

ఐసీడీఎస్ నుంచి 1896మందిని, 1391 మంది ఆశ వర్కర్లను, పాఠశాలలకు సంబంధించి 1671 మంది నోడల్ సిబ్బంది, మొత్తం 4958 మంది మీజిల్స్ రుబెల్లా టీకా కార్యక్రమానికి సహకారం అందిస్తారు.

బాలల సంఖ్య ఇలా...

మీజిల్స్ రుబెల్లా ఎంఆర్ టీకా వేసేందుకు పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లల సంఖ్య వైద్యాధికారుల లెక్కల ప్రకారం ఇలా ఉంది. 1236ప్రభుత్వ పాఠశాలల్లో 1.08లక్షలు, 314 ప్రైవేటు పాఠశాలల్లో 1.76లక్షలు 1896 అంగన్‌వాడీ సెంటర్లలో 69వేల మంది ఉన్నారు.

ఎంఆర్‌టీకా తప్పనిసరిగా వేయించాలి
డీఎంహెచ్‌వో కొండల్‌రావు



మీజిల్స్, రుబెల్లా టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలి. గతంలో మీజిల్స్ టీకా వేయించుకున్నవారుకూడా ఈటీకాను వేయించుకోవచ్చు. తల్లిదండ్రులు 9నెలలనుంచి 15 ఏళ్లవయస్సు గల తమ పిల్లలకు ఎంఆర్ టీకావేయిస్తేభ విష్యత్తులో తట్టు, రుబెల్లావ్యాధులు రావు. ఆరోగ్యశాఖ ప్రత్యేకంగా టీకాను ప్రవేశపెట్టింది. పీహెచ్‌సీలలోఈటీకాను వేసేందుకు ఏర్పాట్లు చేశాం.

జిల్లాలో 3.54లక్షల మందికి

'మీజిల్స్ రుబెల్లా' వేక్సిన్‌లు

● డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండలరావు



జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కొండలరావు

మధిర టౌన్: జిల్లాలో 3.54లక్షల మంది పిల్లలకు ఈ నెల 17నుంచి సెప్టెంబరు 25వ తేదీవరకు మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్లు వేసేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కొండలరావు అన్నారు. మధిర ప్రభుత్వ ఆసుపత్రినుంచి బుధవారం మీజిల్స్-రుబెల్లా' వ్యాక్సిన్‌పై అవగాహన కలిగించేందుకు ఏర్పాటుచేసిన ర్యాలీని ఆయన జెండాఊపి ప్రారంభించారు. మీజిల్స్ ఒక ప్రాణాంతకమైనవ్యాధి అని.. దీంతో చిన్నారులు నిమోనియా, మెదడువాపు వంటి వ్యాధులకు గురవుతారని డీఎం అండ్‌హెచ్‌వో పేర్కొన్నారు. రుబెల్లా కారణంగా కంటిచూపు, వినికిడిలోపం, మెదడు, గుండె సంబధిత లోపాలు కలుగుతాయని, వీటిద్వారా ఒక్కోసారి పిల్లలు మరణిస్తారని వివరించారు. వీటి బారినపడకుండా ఉండేందుకు జిల్లా వెద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తొమ్మిదినెలల నుంచి 15 సంవత్సరాలమధ్య పిల్లలకు టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు సందర్భంగా వివరించారు. జిల్లాలో 1461 కేంద్రాల్లో టీకాలువేసేందుకు నిష్ణాతు లైన 400 మంది సిబ్బందిని నియమించామన్నారు. తల్లిదండ్రులు తమచిన్నారులకు ఈ వ్యాధులు సోకకుండా ఉండేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, ఇవిచాలా సురక్షితమైనవన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అంగన్‌వాడీ, పాఠశాలల్లో ఈ నెల 17నుంచి సెప్టెంబరు 25వ తేదీవరకు ఈ టీకాలను వేయనున్నట్టు డాక్టర్ కొండలరావు తెలిపారు. గతంలో టీకాలు వేయించుకున్న చిన్నారులకు కూడా మళ్లీ టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బాలాజీ, వైద్యులు రవికిషోర్, ప్రియాంక, శ్రావణ్‌కుమార్, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఉపాధికి 'జీఎస్టీ' గండం

● సమానపనికి .. సమానవేతనమివ్వాలి ● ఇఫ్టూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సూర్యం

ఖమ్మం అర్బన్: జీఎస్టీ (వస్తు, సేవల పన్ను) కారణంగా కార్మికులకు ఉపాధి గండం ఏర్పడిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సూర్యం ఆరోపించారు. ఖమ్మంలోని సీపీఐ ఎంఎల్ (ఎన్డీ) జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీతో చిన్న పరిశ్రమలు మూతపడుతుండటంతో అక్కడి కార్మికులు రోడ్లపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ పరిశ్రమల్లో అనేకమంది కార్మికులు ఇటీవలి కాలంలో ఈ దుస్థితికి గురయ్యారన్నారు. గ్రానైట్ పరిశ్రమలోనూ ఇలాగే కార్మికులకు గడ్డుపరిస్థితి ఏర్పడిందన్నారు. బహుళజాతి సంస్థల పెత్తనం నిలబెట్టేందుకే ప్రభుత్వం జీఎస్టీని ప్రవేశపెట్టిందని ఆరోపించారు. పెట్రోలియంను జీఎస్టీ పరిధికి తేకపోవటం ఇందుకు ఉదాహరణ అన్నారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రజావ్యతిరేకవిధానాలే కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్రఇబ్బందుదలకు గురవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన ఒకేవిధంగా ఉందన్నారు. సింగరేణి ఉద్యోగాల విషయంలో తాను కోర్టు చెప్పినట్లు నడుచుకుంటానని కేసీఆర్ అంటున్నారని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని కోర్టు ఏనాడో ఆదేశించినా.. దాన్ని ఎందుకు అమలు చేయట్లేదని సూర్యం ప్రశ్నించారు. ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ.. ఈ నెల 19, 20తేదీల్లో మంచిర్యాలలో జరిగే రాజకీయశిక్షణ తరగతులకు కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి ఎ.అశోక్, ఉపాధ్యక్షుడు ఎ.రామారావు, జిల్లా నాయకులు సీహెచ్ విప్లవ్ కుమార్, ఎస్కే యాకూబ్ షావలీ పి.వెంకన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంటౌన్: ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సుతో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన నిధులను బుధవారం టీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యా లయంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, మాజీ ఎమ్మెల్సీ పోట్లనాగేశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావులు బాధితులకు అందించారు. ఖమ్మం నియోజకవర్గం వేపకుంట్ల, మధిర, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, బోనకల్ మండలానికి చెందినవారు అనారోగ్యంతో బాధపడుతూ మంత్రి తుమ్మలను ఆశ్రయించారు. మంత్రి సిఫార్సు మేరకు సీఎం సహాయ నిధినుంచి నలుగురికి రూ. 2.50లక్షలు మంజూరు కాగా బుధవారం సదరు చెక్కులను బాధితలకు అందించారు.

పోలీసులకు సవాల్‌గా వైరా వరుస దొంగతనాలు

● ప్రతిష్టాత్మకంగా మారిన కేసు
● సీసీ పుటేజీలపైనే ఆధారం

వైరా: నియోజకవర్గ కేంద్రమైన వైరాలో ఈనెల 12వతేదీ అర్ధరాత్రి జరిగిన నాలుగు వరుస చోరీల కేసుల ఛేదన పోలీసు ప్రతిష్టకు సవాల్‌గా మారింది. ఈ చోరీ కేసుల పరిశోధనకు పోలీసులకు కేవలం సీసీ పుటేజీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ చోరీలకు పాల్పడిన ముఠా బీహార్ రాష్ట్రానికి చెందిందా? లేక నెల్లూరు జిల్లాకు చెందిన దొంగల ముఠానా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు చెందిన పాతనేరస్థుల కదలికలపై పోలీసులు దృష్టిసారించారు. ఈనెల 12వతేదీ అర్ధరాత్రి వైరా గాంధీచౌక్‌లోని మిట్టపల్లి నాగేశ్వరరావు ఇంట్లో రూ.15లక్షల నగదు, 520గ్రాముల బంగారు ఆభరణాలు, సుందరయ్యనగర్‌లోని తల్లాడ శ్రీరామ కోల్డ్‌స్టోరేజీ మేనేజర్ వెలగ నాగేశ్వరరావు ఇంట్లో రూ.తొమ్మిదిలక్షల నగదును దోచుకెళ్లారు. వేర్వేరుగా రెండు కేసులు నమోదయ్యాయి. సీఐ నాయుడు మల్లయ్యస్వామి ఆధ్వర్యంలో ఈ రెండుకేసుల దర్యాప్తు నడుస్తుంది. ఉపాధ్యాయుడు నున్నా శ్రీనివాసరావు, రూ.రెండులక్షల విలువచేసే బంగారు ఆభరణాలు రూ. పదివేల నగదు దోపిడీకి సంబంధించి మరో కేసు నమోదు చేశారు. ఈకేసులను త్వరితగతిన చేధిస్తామని ఇప్పటికే ఖమ్మం సీపీ తఫ్సీర్ ఇక్బాల్ ప్రకటించారు. వైరా ఏసీపీ ఎం.శ్రీధర్‌రెడ్డి ఈచోరీ కేసుల దర్యాప్తు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సీఐ మల్లయ్యస్వామి వైరా సర్కిల్ పరిధిలోని చింతకాని, తల్లాడ, కొణిజర్ల, వైరా ఎస్‌ఐలతో పాటు బోనకల్ ఎస్‌ఐతో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పాతనేరస్థుల వివరాలు సేకరిస్తున్నారు. ఈనెల 11వతేదీ అర్ధరాత్రి కొంతమంది కొత్తవ్యక్తులు మోటారుసైకిళ్లపై వైరాలో సంచరించినట్లు భావిస్తున్నారు. ఒక వ్యక్తి అర్ధరాత్రి సమయంలో మొఖానికి కర్చీఫ్ కట్టుకొని వెళ్తున్న దృశ్యం శ్రీనివాస థియేటర్‌కు ఎదురుగా ఉన్న ఒక సీసీ పుటేజీలో రికార్డుఅయి ఉంది. అయితే ఆద్విచక్రవాహనం నెంబర్ సరిగా కన్పించకపోవడంతో నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ)సహకారంతో ఆవాహన నెంబర్‌ను తెలుసుకొనేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చోరీలు జరిగిన అర్ధరాత్రి కూడా సీసీ పుటేజీల్లో ఏమైనా ఆధారాలు లభిస్తాయోనని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. చోరీలకు పాల్పడిన దొంగలు ఎక్కడా కూడా వేలిముద్రలు దొరకకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నారు. జాగిలాలు కూడా మొదట మిట్టపల్లి నాగి ఇంట్లోనే చోరీ జరిగినట్లు పసిగట్టాయి. అక్కడి నుంచి దొంగలు సుందరయ్యనగర్‌లో చోరీకి పాల్పడినట్లు జాగిలాలు తిరగటాన్నిబట్టి స్పష్టమవుతుంది. సుందరయ్యనగర్‌లో చోరీలు జరిగిన మూడిళ్ల నుంచి జాగిలాలు వైరా బస్టాండ్ వరకు వెళ్లి ఆగిపోయాయి. దాంతో ఈకేసు దర్యాప్తు పోలీసులకు సవాల్‌గా మారింది. ఇప్పటికే ఏపీలోని విజయవాడ ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు చోరీలకు పాల్పడే పాతనేరస్థుల వివరాలు సేకరించినట్లు సమాచారం. నెల్లూరు జిల్లాకు చెందిన దొంగలముఠా కడప జిల్లాలో పలుచోట్ల చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడ్డారు. ఆతర్వాత జైలుశిక్ష అనుభవించి కొన్నినెలల కిందట బయటకు వచ్చారు. ఆతర్వాత పలుచోట్ల ఆముఠా చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఆముఠా ఏమైనా వైరాలో చోరీకి పాల్పడిందా అనేవిధంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బీహార్ ఇతర ప్రాంతాలకు చెందిన దొంగల ముఠా ఈ చోరీలకు పాల్పడిందా అనేదిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు. మొత్తంగా ఈ చోరీకేసులను సాధ్యమైనంతత్వరగా చేధించి సవాల్‌గా మారిన పోలీసు ప్రతిష్టను ఇనుమడింపజేస్తామనే రీతిలో దర్యాప్తు జరుగుతుందని సిబ్బంది చెప్పుకుంటున్నారు. చోరీ కేసులను త్వరితగతిన చేధించి ప్రజలకు భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

బోనకల్: దేశవ్యాప్తంగా తపాలశాఖలో పనిచేస్తున్న గ్రామీణ సిబ్బంది ఏడవ వేతన సంఘం సిఫార్సులు అమలు చేయాలని కోరుతూ బుధవారం సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా బోనకల్ మండలంలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరసనవ్యక్తంచేశారు. జీడీఎస్‌లకు 8గంటలు పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్‌జీఎస్ పెన్షన్లు ఇచ్చే విధులు కూడా నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలందిస్తున్నప్పటికీ జీతాలు పెంచనందున తాము పలు ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.

విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో, డీపీవో కొండల్‌రావు, శ్రీనివాసరెడ్డి

చింతకాని: గ్రామాలలోని ప్రజలు విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండి ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో కొండల్‌రావు, డీపీవో శ్రీనివాసరెడ్డి సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో విషజ్వరాలు ఎక్కువగా ఉండటంతో వారు బుధవారం గ్రామాన్ని సందర్శించి మండల అధికారులు, గ్రామస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో విషజ్వరాలు సోకినప్పుడు వెంటనే ఏఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు. జ్వరాలతో బాధపడేవారు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చులు చేసుకుంటున్నారని .. ప్రభుత్వం ఆసుపత్రులలో అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నాయని, రోగులు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో మండల పంచాయతీ కార్యదర్శులు, సాక్షరభారత్





సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో, నీటి తొట్లో నిల్వ నీరు తొలగిస్తున్న ఎంపీడీవో, రక్తనమూనాల సేకరణ

గ్రామకోఆర్డినేటర్లు, వైద్యసిబ్బందితో కలిపి 9 బృందాలు ప్రతి ఇంటినీ పరిశీలించి తొట్లలో నీటిని గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా తొలగించి మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా నిర్మూలనా అధికారి రాంబాబు, ఎంపీడీవో నవాబ్‌పాషా, ఈవోఆర్డీ రామయ్య, పంచాయతీ కార్యదర్శులు బత్తిన శ్రీనివాసరావు ,కొండపల్లి అనిల్‌కుమార్, ఖాన్, మేహెరాజ్, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ మందా శివకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వస్తున్నారు.. పోతున్నారు..

నాగులవంచ గ్రామంలో జ్వరాలు తీవ్రస్థాయిలో ఉన్నా.. అధికారులు వస్తున్నారు... పోతున్నారు..తప్ప కనీసం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి రోగ నిర్ధారణ మాత్రం చేయడంలేదని గ్రామస్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10 రోజులుగా జ్వరాలతో గ్రామస్తులు బాధపడుతూ ఖమ్మం, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టుకుంటున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికే ఖమ్మంలో 50మందికిపైగా చికిత్స పొందుతున్నారని అధికారులు వచ్చి వెళుతున్నారే తప్ప తమను పట్టించుకోవడంలేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి మృతి

మధిర టౌన్: రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం మధిర రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సుమారు 21సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు రైలు కింద పడి మృతిచెందాడు. ఇతను సుమారు 5.6 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు, కోలముఖం కలిగివున్నాడు. తెలుపు, నలుపుగళ్ల కలిగిన నిండుచేతుల చొక్కా, బ్లూజీన్స్ ప్యాంటు, నిండుచేతులు కల్గిన పచ్చరంగుగళ్ల బన్నీ ధరించాడు. డౌన్‌లైన్‌లోని ఒకటోనెంబర్ ప్లాట్‌ఫారం చివరన మృతిచెంది ఉన్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ బాలస్వామి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈజీఎస్ ఆధ్వర్యంలో గ్రామసభ

ఎర్రుపాలెం: మండలపరిధిలోని పెద్దగోపవరం, జమలాపురం గ్రామాలలో ఈజీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్ బండారి వెంకట నర్సమ్మ, మువ్వా స్వప్నకుమారి అధ్యక్షతన గ్రామసభలను బుధవారం నిర్వహించారు. ఆయాగ్రామాలలో ఈజీఎస్ నిధులతో ఖర్చు చేసిన పనుల లెక్కలను నమోదు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శీలం.లక్ష్మి, ఏసుబాబు, సెక్రటరీలు నరేష్, హరీ, ఎస్ఆర్‌పి వెంకన్న, డీఆర్‌పీ లక్ష్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

మధిర: ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ గ్రామీణ పోస్టల్ ఉద్యోగులు బుధవారం నిరవధిక సమ్మెకు దిగారు. మధిర డివిజన్ పరిధిలోని మధిర, ఎర్రుపాలెం, బోనకల్, వైరా, చింతకాని మండలాల్లోని గ్రామాల్లో పనిచేస్తున్న పోస్టల్ ఉద్యోగులు ఈసమ్మె చేపట్టారు. దీంతో బుధవారం నుంచి గ్రామీణ పోస్టాఫీసులు మూతబడ్డాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా కోశాధికారి షేక్ మౌలాలి, సంయుక్త కార్యదర్శి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఏఐజీడీఎస్‌యూ సూచించిన సవరణలతో జీడీఎస్ కమిటీ రిపోర్టు అమలుచేయాలని, 9గంటల పని కల్పించి సివిల్‌సర్వెంట్ హోదా ఇవ్వాలని, ఢిల్లీ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ ఇచ్చిన తీర్పు ప్రకారం పింఛన్ మంజూరు చేయాలని, టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయటం, వేధించటం ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేశ్వరరావు, షేక్‌పాషా, రామారావు, సత్యనారాయణ, నాగుల్‌మీరా, భాస్కర్‌రావు పాల్గొన్నారు.



మధిరలో సమ్మెచేస్తున్న ఉద్యోగులు

ఎర్రుపాలెంలో: మండలంలోని గ్రామీణ తంతితపాలా సేవకులు బుధవారం నిరవదిక సమ్మెలో పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామీణ మండల తపాలా సేవకుల అధ్యక్షుడు శంకరయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తపాల సేవకులు రామకోటేశ్వరరావు, రామకృష్ణారెడ్డి, నరసింహారావు, బూసిరెడ్డి, శ్రీనివాసులు, లవణ్య పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వాలు: పొన్నం

ఎర్రుపాలెం: బడా కార్పొరేట్ సంస్థలకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం జిల్లా సెక్రటరీ పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. బుధవారం మీనవోలు గ్రామంలో కె.నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దు వల్ల దేశం ఆర్థికంగా లాభపడుతుందని చెప్పి దేశాన్ని అధోగతి పాలుచేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. కేంద్రానికి మద్దతు ఇస్తున్న రాష్ట్రప్రభుత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. జీఎస్‌టీ వల్ల వ్యాపారస్తులు, ప్రజలకు ఏమీ మేలు లేదన్నారు. ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తూ కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లను వసూళ్ళు చేయడమే అధికార పార్టీ పని అని విమర్శించారు. పెట్టుబడిదారులకు పనులు కట్టబెట్టి ప్రజలను మోసంచేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు త్వరలో బుద్ది చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రటరీ దివ్వెల వీరయ్య, జోగయ్య, బేతి శ్రీనివాసరావు, జి.రాములు, వెంకటేశ్వర్లు, సంజీవరావు, మాబు శ్రీనివాసరెడ్డి, కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, మండల గ్రామ శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈయూ ధర్నా

మధిర టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం మధిర డిపో ఎదుట ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామసమయంలో గేటుధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఏ ఖాదర్ మాట్లాడుతూ మధిర డిపోలో కండక్టర్లు, డ్రైవర్ల కొరతను వెంటనే తీర్చాలని, ప్రతి కార్మికుడికి నెలకు రెండురోజులు ప్రత్యేక సెలవు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈయూ డిపో అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఎంఆర్‌సీరావు, నాయకులు డీఎస్.రావు, ప్రదీప్, రవి, ఎస్ఎస్‌రావు, అరుణకుమారి, పీపీ.రావు, రాధిక పాల్గొన్నారు.



మధిర డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రుబెల్లా వేక్సినేషన్ విజయవంతం చేయాలి

బోనకల్: మీజిల్స్, రుబెల్లా వేక్సినేషన్‌ను అన్ని గ్రామాలలో విజయవంతం చేయాలని వైద్యాధికారి సురేష్ కోరారు. మండలంలోని బోనకల్, కలకోట, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలలో బుధవారం వేక్సినేషన్‌పై అవగాహన పెంపొందించడానికి వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి సురేష్ మాట్లాడుతూ మండలంలో 11,432 మంది చిన్నారులకు వేక్సినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే గ్రామాలలో పోస్టర్లు, బ్యానర్లు, ఇంటింటి ప్రచారంతో ప్రజల్లో చైతన్యం నింపామని పేర్కొన్నారు. 17నుంచి వచ్చేనెల 25వరకు టీకాలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసరావు, సిబ్బంది శ్రీదేవి, రాజశేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నేడు 11వ సామాజిక తనిఖీ

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 11వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2016నుంచి ఏప్రెల్ 2017 వరకు ఈజీఎస్ నిధులతో గ్రామాలలో పూర్తిచేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈప్రజా వేదికలో అన్నిగ్రామాల ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ కూలీలు తమ గ్రామాలలో జరిగిన పనులపై చర్చించవచ్చని సూచించారు.

మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

మధిర	9985411342
మధిర టౌన్	9491890567
మధిర రూరల్	9963852263
బోనకల్	9701255161
ఎర్రుపాలెం	9492104750
వైరా	9866316711
చింతకాని	9492104828
ముదిగొండ	9866492332

సినిమాలు

మధిర

● శాంతి	జయ జానకీ నాయక
● శ్రీలక్ష్మీ శ్రీనివాస	నేనే రాజు.. నేనే మంత్రి
● వాసవి	లై

ఆర్యవైశ్య కల్యాణమండపం అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

ఏన్కూరు: ఏన్కూరులోని ఆర్యవైశ్య కల్యాణమండపం అధ్యక్షుడిగా కంభంపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. బుధవారం ఏన్కూరులో జరిగిన సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గుమ్మడెల్లి నాగేశ్వరరా వు, కోశాధికారిగా వజినేపల్లి గోపాలరావు, గౌరవ సలహాదారుడిగా రాయల రామలింగం, డీవీ.కృష్ణారావులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన కంభంపాటి శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

పూసలపాడు సొసైటీకి శంకుస్థాపన

వైరా: మండలంలోని పూసలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి బుధవారం వైరా ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న సొసైటీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన కార్యాలయ భవన నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో చేపట్టిన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, వ్యాపార కార్యకలాపాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు కడియాల సతీష్, ఉపాధ్యక్షురాడు గాలి అరుణ, సిరిపురం సర్పంచ్ తాటి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వరరావు, వైరా ఎంపీపీ బొంతు సమత, జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, వైరా సొసైటీ ఛైర్మన్ తాతా రంగారావు, డీసీసీబీ సీఈవో నాగచెన్నారావు, వైరాసూపర్‌వైజర్ రామకృష్ణ, సొసైటీ సీఈవో కేశవ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



సొసైటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సినిమాలు

వైరా- వాసవీ

జయ జానకీ నాయక

ఏన్కూరు- లక్ష్మీనరసింహా

ఫిదా

దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే..

లీడ్ఇండియా2020 టీం ఇన్‌చార్జ్ లాలు





సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ఇండియా ఇన్‌చార్జ్ లాలు, హాజరైన విద్యార్థులు

ఏన్కూరు: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని లీడ్ఇండియా2020 టీం ఇన్‌చార్జ్ ఎం.లాలు అన్నారు. బుధవారం ఏన్కూరులోని హైస్కూల్లో జరిగిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నేషనల్ కోఆర్డినేటర్ సుదర్శన్ ఆచార్య ఆధ్వర్యంలో బి.పార్థసారథిరెడ్డి ఆర్థిక సౌజన్యంతో లీడ్ఇండియా కార్యక్రమాలను రెండుజిల్లాల్లోని అన్ని హైస్కూళ్లలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి అభివృద్ధే దేశాభివృద్ధి అని, మానవతావిలువలు, నైపుణ్యాలు, జీవిత లక్ష్యం, తల్లిదండ్రులు, గురువులపై గౌరవం విద్యార్థులు కల్గిఉండాలన్నారు. కార్యక్రమం లో ఆబృందం సభ్యులు ప్రమీల, రాధాబాయి, లక్ష్మీ పాల్గొన్నారు.

విప్పలమడకలో లయన్స్‌క్లబ్ చేయూత



బోరు ఏర్పాటుపనులను ప్రారంభిస్తున్న డాక్టర్ కాపా మురళీకృష్ణ

వైరా: మండలంలోని విప్పలమడక గ్రామంలో చేతిపంపు నిర్మాణానికి లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ కాపామురళీకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. విప్పలమడక సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు చొరవతో డాక్టర్ మురళీకృష్ణ సహకారంతో వైరా లయన్స్‌క్లబ్ రూ.20వేలతో చేతిపంపు నిర్మాణానికి ముందుకొచ్చింది. దానికి సంబంధించి బోరు పాయింటుకు శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ఆగ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 15కుర్చీలు బహూకరించారు. అలాగే ఎన్ఆర్ఐలు చెరుకుమల్లి రామ్మోహన్, కళ్యాణి దంపతుల సంతానమైన అరుష్, అద్వైత్ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పారుపల్లి కృష్ణారావు, వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పుతుంబాక కృష్ణమూర్తి, ఏడునూతల బుచ్చిరామారావు, జిల్లా సెక్రటరీ ఉండూరి శ్యాంబాబు, కోశాధికారి పి.ఉపేంద్రరావు, నంబూరి మధు, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, ఏపూరి రాజారావు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వాసిరెడ్డి విజయకుమారి, బూర్గు శైలజ పాల్గొన్నారు.

ఏన్కూరు సమాచారం

తహసీల్దార్	- 9701346968
ఎంపీడీవో	- 9440906929
ఎస్ఐ	- 9440904272
ఎంఈవో	- 9885416782
ఏఎంసీ సెక్రటరీ	- 9508119940
వ్యవసాయ అధికారి	- 8886614250
విద్యుత్ ఏఈ	- 9440814142
గృహ నిర్మాణ ఏఈ	- 7799722902
పీహెచ్‌సీ డాక్టర్	- 9700266095
వెటర్నరీ డాక్టర్	- 9440597361

గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమ్మె

వైరా: వైరా సబ్‌పోస్టాఫీసు పరిధిలోని 24మంది గ్రామీణ తపాలా కార్యాలయాల సిబ్బంది బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. దాంతో వైరా, కొణిజర్ల మండలాల్లోని 24 గ్రామీణ తపాలా కార్యాలయాలు మూతపడ్డాయి. ఈనెల 16నుంచి తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జయరాజు ఆధ్వర్యంలో వైరాలోని సబ్‌పోస్టాఫీసు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గతనెల 30వతేదీన తమ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎస్.మహదేవయ్య సమ్మెనోటీసును తపాలాశాఖ అధికారులకు అందించారని పేర్కొన్నారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ సూచించిన సవరణలతోసహా జీడీఎస్ కమిటీ రిపోర్టు అమలుచేయాలని, జీడీఎస్‌లకు ఎనిమిదిగంటల పనికల్పించి సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలని, టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయటం, వేధించటం ఆపివేయాలని, పింఛన్‌మంజూరు చేయాలనే డిమాండ్‌తో సమ్మెచేస్తున్నట్లు వివరించారు.

నేటినుంచి మిజిల్స్-రుబెల్లా వేక్సినేషన్

ఏన్కూరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ గురువారం నుంచి మిజిల్స్-రుబెల్లా వేక్సినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఏన్కూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తొమ్మిదినెలల వయస్సు నుంచి 15సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరికీ ఈ వేక్సిన్ ఇస్తారని తెలిపారు. మండలంలోని 11సబ్‌సెంటర్లలో 11టీంలు పనిచేస్తాయని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పీహెచ్‌సీ సందర్శించిన అడిషనల్ జాయింట్ డైరెక్టర్

ఖమ్మంరూరల్: రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీని బుధవారం అడిషనల్ జాయింట్ డైరెక్టర్ పద్మావతి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిజిల్స్ రుబెల్లా వ్యాధి టీకాలు నేటి నుంచి ప్రారంభించాలని సూచించారు. తొమ్మిది నెలలనుంచి 15 ఏళ్లున్న పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. గురువారం నుంచి సెప్టెంబర్ 25 వరకు టీకాలువేసే కార్యక్రమాన్ని తప్పని సరిగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పీహెచ్‌సీ డాక్టర్ సృజనాగౌడ్ పాల్గొన్నారు



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి

'అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలి'

వైరా: అర్హులైన పేదలందరికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని అలాగే మూడెకరాల భూమి ఇవ్వాలని వ్య.కా.సం జిల్లా కార్యదర్శి వేదగిరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాజోజి రమణ అధ్యక్షతన బుధవారం వైరాలో జరిగిన ఆసంఘ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ పథకం అలాగే మరుగుదొడ్లు, ఇందిరమ్మ పక్కాగృహాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆసంఘం మండల కార్యదర్శి సుంకర ఉదయభాస్కర్, తాటిపూడి ఎంపీటీసీ సభ్యుడు మంచల జయరావు, నాయకులు బోడేపూడి వీరభద్రం, గంగదేవుల తిరుపమ్మ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..



విద్యుత్‌దీపాల అలంకరణ



ఉత్సాహంగా సాగిన ఉట్టికొట్టే కార్యక్రమం

వైరా: వైరాలో మంగళవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ముఖ్యంగా ద్వారకానగర్ విద్యుత్‌దీపాలతో మిరిమిట్లుగొలిపింది. వైరా సొసైటీ వద్ద ఈ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు కూరపాటి నాగభూషణం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని స్థానికులతో కలిసి ప్రారంభించారు. వైరా ఎంపీపీ బొంతు సమత, జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా ఉమాదేవి, వైస్ఎంపీపీ తన్నీరు జ్యోతి, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు ఈ సందర్భంగా పూజలు చేశారు. ఆ తర్వాత అర్ధరాత్రి వరకు డప్పువాయిద్యాలు, కోలాట నృత్యాలతో శోభయాత్ర సాగింది. భక్తులు ఆసక్తిగా తిలకించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలోనూ శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులు రాధా,కృష్ణ అలంకరణలతో అలరించారు. తాటిపూడి గ్రామంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. 2020, 2024, 2028 ఒలింపిక్స్‌ల్లో భారత ప్రమాణాల మెరుగుదలకు కావాల్సిన సూచనల నివేదికను కేంద్ర క్రీడల శాఖకు సమర్పించిన ఎనిమిది మంది సభ్యుల కమిటీలో లేనివారు?
ఎ) పుల్లెల గోపీచంద్ బి) వీరేన్ రస్కిన్హ
సి) మిల్కాసింగ్ డి) అభినవ్ బింద్రా

2. భారత సుప్రీంకోర్టు తదుపరి, 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) జస్టిస్ ఎన్.వి.రమణ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ రంజన్ గగోయ్
డి) జస్టిస్ సంజన్ కిషన్ కాలే

3. కెన్యా అధ్యక్షుడిగా ఇటీవల తిరిగి ఎవరు ఎన్నికయ్యారు?
ఎ) ఉహూరు కెన్యాట్టు బి) డేనియల్ అరప్ మాయి
సి) జోమో కెన్యాట్టు డి) మవాయి కిబాకి

4. 2017 ఆగస్టు 11న ముప్పవరపు వెంకయ్య నాయుడు భారతదేశానికి ఎన్నో ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు?
ఎ) 15 బి) 14 సి) 16 డి) 13

5. కేంద్ర సెన్సార్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) ప్రసూన్ జోషి బి) విద్యాబాలన్
సి) పహలాజ్ నిహలని డి) అదూర్ గోపాలకృష్ణన్

6. 2017లో లండన్ వేదికగా జరిగిన 'ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్' జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కి చేరిన తొలి భారతీయుడు?
ఎ) నీరజ్ చోప్రా బి) దవిందర్‌సింగ్ కాంగ్
సి) వికాస్‌గౌడ్ డి) అనిల్‌కుమార్

7. ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం?
ఎ) ఆగస్టు 12 బి) ఆగస్టు 10
సి) ఆగస్టు 15 డి) ఆగస్టు 9

8. పర్యావరణ హానికరమైన 50 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ బ్యాగ్‌లను 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' ఇటీవల ఏ ప్రాంతంలో నిషేధించింది?
ఎ) చెన్నై బి) బెంగళూరు సి) కోల్‌కతా డి) ఢిల్లీ

9. పేదలకు అతి తక్కువ ధరకు మందులను విక్రయించే 'ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన(పిఎంబిజెపి)' కేంద్రాలను 1000కి పైగా ఏర్పాటు చేయడానికి కేంద్రంతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకొన్న రాష్ట్రం?
ఎ) బీహార్ బి) ఉత్తరాఖండ్
సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యానా

10. 2017 నవంబరు 28న జరిగే 'ప్రపంచ భాగస్వామ్య సదస్సు'కు ఆతిథ్యమిస్తున్న నగరం?
ఎ) అహ్మదాబాద్ బి) కాన్పూర్
సి) మద్రాస్ డి) హైదరాబాద్

11. మసూమా ఎబ్టేకర్, మౌలావర్డి అనే మహిళలు ఏ దేశానికి ఉపాధ్యక్షులుగా ఇటీవల నియమితులయ్యారు?
ఎ) ఇరాన్ బి) పాకిస్థాన్ సి) ఇరాక్ డి) జోర్డాన్

12. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నూతన చైర్మన్?
ఎ) షహర్యార్‌ఖాన్ బి) నజమ్ సేథి
సి) జహీర్ అబ్బాస్ డి) జావెద్ మియందాద్

13. కేంద్ర స్వయం సహాయక సంఘాల కార్యక్రమాల డిజిటలైజేషన్ కోసం 'ఈ-శక్తి' అనే కార్యక్రమం నిర్వహిస్తున్న సంస్థ?
ఎ) స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బి) ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సి) రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా
డి) నేషనల్ బ్యాంక్ ఫర్ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్

14. 'BIMSTEC' కి సంబంధించి సరైనది?
ఎ) బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్
బి) 1997 జూన్ 6న ప్రారంభం
సి) సభ్యదేశాలు - బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్, శ్రీలంక డి) పైవన్నీ

15. 2017 ఆగస్టు 8న 'BIMSTEC' దేశాలు తమ తొలి విపత్తు నిర్వహణ విన్యాసాలను ఏ నగరంలో ప్రారంభించాయి?
ఎ) థింపు(భూటాన్)
బి) జయవర్దనపుర కొట్టె(శ్రీలంక)
సి) నేపిడా(మయన్మార్)
డి) న్యూఢిల్లీ(ఇండియా)

16. అయోధ్య వివాదానికి సంబంధించి అన్ని కేసుల పరిశీలనకు సుప్రీం కోర్టు ఇటీవల నియమించిన ముగ్గురు జడ్జీల కమిటీకి నేతృత్వం వహిస్తున్నది?
ఎ) జస్టిస్ జాస్తి చలమేశ్వర్
బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ కురియన్ జోసఫ్
డి) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్

17. 2017కి గాను UEFA సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్
బి) యునైటెడ్ మాంచెస్టర్స్ క్లబ్
సి) బార్సిలోన క్లబ్ డి) మిలాన్ క్లబ్

18. 2017 ఆగస్టులో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 'ప్రపంచ ఏనుగుల దినోత్సవం' సందర్భంగా 'గజయాత్ర' ప్రచార కార్యక్రమం ప్రారంభించింది. 'ఏనుగుల దినోత్సవం' ఎప్పుడు?
ఎ) ఆగస్టు 16 బి) ఆగస్టు 9
సి) ఆగస్టు 8 డి) ఆగస్టు 12

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్



19. అంగారక గ్రహంపై మేఘాల దృశ్యాలను చిత్రీకరించిన 'క్యూరియాసిటీ' రోవర్ ఏ దేశానికి చెందింది?
ఎ) జపాన్ బి) రష్యా సి) ఇండియా డి) అమెరికా

20. 2017 అక్టోబరు 19 నుంచి 29 వరకు రష్యా, భారత్ సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?
ఎ) వరుణ బి) గరుడ సి) ఇంద్ర డి) మిత్రశక్తి

21. పదవికి రాజీనామా చేసిన గురుదీప్‌సింగ్ సప్పాల్ స్థానంలో నియమితులైన రాజ్యసభ టి.వి. నూతన సిఇఒ?
ఎ) సూర్యప్రకాశ్ బి) వెంపటి శశిశేఖర్
సి) శోభాసేన్ డి) మృదులాసిన్హా

22. 2017 ఆగస్టు 9, 10 తేదీల్లో 'ఇండియన్ టెక్నాలజీ కాంగ్రెస్'ను నిర్వహించిన నగరం?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్
సి) అలహాబాద్ డి) కోల్‌కతా

23. 'భారత్-ఆసియాన్ దేశాల యువసదస్సు'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) భోపాల్(మధ్యప్రదేశ్)
బి) మాండలే(మయన్మార్)
సి) కంపాంగ్ చామ్(కంబోడియా)
డి) సిసిలి(ఇండోనేషియా)

24. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇటీవల రూపొందించిన మూకీ(సంజ్ఞలు) భాషలో 'జనగణమన'కు దర్శకత్వం వహించింది?
ఎ) మధుర్ బండార్కర్ బి) అభిషేక్ చాబే
సి) గోవింద్ నిహలాని డి) అలంక్రిత్ శ్రీవాస్తవ్

25. 2017 ఆగస్టులో భారత కోస్ట్‌గార్డ్ దళం ప్రవేశపెట్టిన తీరగస్తీ నౌక?
ఎ) ఐఎన్ఎస్ మిత్ర బి) ఐఎన్ఎస్ మౌర్య
సి) ఐఎన్ఎస్ శౌర్య డి) ఐఎన్ఎస్ సుచిత్ర

26. 2017కి గాను 'ద హ్యూగో అవార్డు' పొందిన నవల 'ద ఒబిలిస్క్ గేట్' రచయిత?
ఎ) ఎన్.పి.ఉల్లేఖ్ బి) నోరా.కె.జెమిసిన్
సి) జేవియర్ మోరో డి) అనురాధ రాయ్

27. 2017 నవంబరులో జరగాల్సిన అండర్ 19 క్రికెట్ ఆసియా కప్ ఆతిథ్య వేదికను బెంగళూరు నుంచి ఎక్కడికి మార్చారు?
ఎ) శ్రీలంక బి) మలేషియా
సి) బంగ్లాదేశ్ డి) పాకిస్థాన్

28. కుష్టు వ్యాధి నివారణ కోసం పోరాడి ఇటీవల మరణించిన 'రూత్‌ఫౌ' ని ఏ దేశంలో మరో 'మదర్ థెరిసా'గా వ్యవహరిస్తున్నారు?
ఎ) పాకిస్థాన్ బి) కజకిస్థాన్
సి) శ్రీలంక డి) నేపాల్

29. కజకిస్థాన్ రాజధాని అస్తానా వేదికగా ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించిన మహేశ్వరి చౌహాన్ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?
ఎ) ఆర్చరీ బి) బాక్సింగ్ సి) టెన్నిస్ డి) షూటింగ్

30. 'దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన'లో భాగంగా కేంద్రం ప్రారంభించిన 'ఆజీవక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన' ముఖ్య ఉద్దేశం?
ఎ) అసహాయ వర్గాలకు పెన్షన్ అందించడం
బి) వ్యవసాయ రంగంలో ఉచిత ట్రాక్టర్లు అందించడం
సి) గ్రామీణ ప్రాంతాల్లో రవాణా స్వయం సహాయక సంఘాలు నిర్వహించడం
డి) బ్యాంకింగ్ రంగంలో గ్రామీణ పరపతిని పెంచడం

31. ఎడిస్ ఈజిప్ట్ ద్వారా సంక్రమించే జికా వైరస్ క్యూలెక్స్ దోమల ద్వారా సంక్రమిస్తుందని ఏ దేశ శాస్త్రవేత్తల పరిశోధనలు వెల్లడించాయి?
ఎ) కెనడా బి) సెనెగల్ సి) పెరూ డి) బ్రెజిల్

32. SATH(సస్టైనబుల్ యాక్షన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ హ్యూమన్ క్యాపిటల్) కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' ఆరోగ్య కార్యక్రమాలు అమలుచేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) కర్ణాటక బి) అస్సాం సి) హర్యానా డి) ఉత్తరప్రదేశ్

33. SATH కార్యక్రమంలో భాగంగా 'నీతి ఆయోగ్' విద్య కార్యక్రమాలు అమలు చేస్తున్న మూడు రాష్ట్రాల్లో లేనిది?
ఎ) బీహార్ బి) ఒడిశా సి) జార్ఖండ్ డి) మధ్యప్రదేశ్

34. ఏ కార్యక్రమం 75 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా మోదీ నూతన భారత నిర్మాణం కోసం 'సంకల్ప్ సె సిద్ధి' అనే ప్రచారానికి పిలుపునిచ్చారు?
ఎ) చంపారన్ ఉద్యమం
బి) క్విట్ ఇండియా ఉద్యమం
సి) సహాయ నిరాకరణ ఉద్యమం
డి) శాసన ఉల్లంఘన ఉద్యమం

35. ఇటీవల గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ముగ్గురిలో లేనివారు?
ఎ) స్మృతి ఇరాని బి) అహ్మద్ పటేల్
సి) శంకర్ సింఘ్ వాఘేలా డి) అమిత్‌షా

36. ఇటీవల మరణించిన కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత అజ్మీర్ ఎం.పి. సన్వర్‌లాల్ జాట్ ఏ పార్టీకి చెందినవారు?
ఎ) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)
బి) భారతీయ జనతాపార్టీ(బిజెపి)
సి) ఇండియన్ నేషనల్ లోక్‌దళ్(ఐఎన్ఎల్‌డి)
డి) ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సి)

37. ఆసియా సొసైటీ నుంచి 2017కి గాను 'ఆసియా గేమ్ చేంజర్స్ అవార్డు'కి ఎంపికైనది?
ఎ) నరేంద్ర మోదీ బి) రవీంద్ర జడేజా
సి) జాక్ మా డి) దేవ్ పటేల్

38. 17 దేశాలు పాల్గొన్న 'హర్ట్ ఆఫ్ ఆసియా' 8వ సమావేశానికి 2017 ఆగస్టులో ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) ఆస్తానా(కజకిస్థాన్) బి) ఇస్తాంబుల్(టర్కీ)
సి) బాకు(అజర్‌బైజాన్) డి) న్యూఢిల్లీ(ఇండియా)

39. ప్రపంచ యువజన దినోత్సవంగా ఆగస్టు 12ని ఐక్యరాజ్య సమితి ఎప్పటి నుంచి నిర్వహిస్తుంది?
ఎ) 2000 బి) 1975 సి) 2002 డి) 1989

40. భారత్‌లో తొలిసారి 'విపత్తు నిర్వహణ సంస్థ'ను రైల్వే శాఖ ఏ గ్రామంలో ఏర్పాటు చేస్తుంది?
ఎ) హెజ్జాల(బెంగళూరు) బి) బీకనూర్(తెలంగాణ)
సి) యలమంచలి(ఆంధ్రప్రదేశ్)
డి) గుర్‌గామ్(హర్యానా)

41. 2016 గణాంకాల ప్రకారం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వెలువరించిన నివేదిక ప్రకారం 2021 నాటికి ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందనున్న నగరం?
ఎ) ఢిల్లీ(ఇండియా) బి) హనోయ్(వియత్నాం)
సి) టోక్యో(జపాన్) డి) ముంబై(ఇండియా)

42. యు ట్యూబ్‌కు పోటీగా 2017 ఆగస్టు 10న ఫేస్‌బుక్ ప్రారంభించిన చానల్?
ఎ) బీ మై ఐస్ బి) విర్లో సి) వాచ్ డి) లిటిల్ వండర్

43. ఒలింపిక్ పతకం సాధించే సత్తా కలిగిన క్రీడాకారుల సహాయం కోసం ప్రారంభించిన 'టార్గెట్ ఆన్ ఒలింపిక్ పోడియం'లో చోటు పొందిన అతి పిన్న వయస్కుడు(15 ఏళ్లు) శపథ్ భరద్వాజ్ ఏ క్రీడాకారుడు?
ఎ) బ్యాడ్మింటన్ బి) స్విమ్మింగ్
సి) బాక్సింగ్ డి) షూటింగ్

44. భారత్‌తో సహా 80 దేశాలకు వీసా రహిత ప్రవేశానుమతి ఇస్తున్నట్లు ప్రకటించిన దేశం?
ఎ) సౌదీఅరేబియా బి) టర్కీ సి) ఫిజి డి) ఖతార్

సమాధానాలు

1) సి	7) బి	13) డి	21) బి	29) డి	37) డి
2) బి	8) డి	14) డి	22) ఎ	30) సి	38) డి
3) ఎ	9) సి	15) డి	23) ఎ	31) డి	39) ఎ
4) డి	10) డి	16) బి	24) సి	32) సి	40) ఎ
5) ఎ	11) ఎ	17) ఎ	25) సి	33) ఎ	41) ఎ
6) బి	12) బి	18) డి	26) బి	34) బి	42) సి
		19) డి	27) బి	35) సి	43) డి
		20) సి	28) ఎ	36) బి	44) డి

ఉద్యోగాలు

ఎన్‌హెచ్ఎఐ

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఎఐ)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన సైట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 18
కాంట్రాక్ట్ వ్యవధి: రెండేళ్లు
అర్హత: బిఇ/ బిటెక్(సివిల్) ఉత్తీర్ణతతోపాటు రోడ్ & హైవే వర్క్స్‌లో ఏడాది అనుభవం ఉండాలి.
వయసు: దరఖాస్తు నాటికి 30 ఏళ్ల ఉండాలి.
వేతనం: నెలకు రూ.50,000
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 4
చిరునామా: Chief General Manager(Tech) & Regional Officer, Chennai
National Highways Authority of India Regional Office - Chennai
SRI Tower, 3rd Floor, DP - 34(SP), Industrial Estate, Guindy, Chennai, Tamil Nadu - 600032 **వెబ్‌సైట్:** www.nhai.org

ఆర్మీ వార్ కాలేజ్

మధ్యప్రదేశ్, మహౌలోని ఆర్మీ వార్ కాలేజ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు:** 10
పోస్టులు: ఎల్‌డిసి 3, సివిలియన్ మోటార్ డ్రైవర్ 2, కుక్ 1, సూపర్‌వైజర్ 3, ఫాటిగ్‌మన్ 1
అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/ ఇంటర్ ఉత్తీర్ణత + నిమిషానికి 30 పదాల టైపింగ్ వేగం+ ఏడాది అనుభవం ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.50
దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 27
చిరునామా: The Presiding Officer, Civilian Direct Recruitment(Scrutiny of Applications) Board, Junior Command Wing, Army War College, Mhow, Madhya Pradesh - 453441

పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?

భారతదేశ వ్యవసాయ రంగం

1. భారతదేశంలో సుమారు ఎంత శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి ఉంది?
ఎ) 46 బి) 50 సి) 58 డి) 64
2. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఎంత శాతం?
ఎ) 14 బి) 15 సి) 16.5 డి) 17.5
3. భారతదేశంలో ఎంత శాతం జనాభా పేదరికంలో ఉంది?
ఎ) 24 బి) 25 సి) 26 డి) 27
4. ఒక దేశ అభివృద్ధికి సరైన నిర్వచనం దేనితో తెలుస్తుంది?
ఎ) వ్యవసాయ రంగం బి) రవాణా రంగం
సి) స్థూల ఉత్పత్తి రంగం డి) తలసరి ఆదాయం
5. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా దేనిపై ఆధారపడి ఉంది?
ఎ) తయారీ రంగం బి) కార్పొరేట్ రంగం
సి) ప్రభుత్వ రంగం డి) వ్యవసాయ రంగం
6. 'ఆపరేషన్ ఫ్లడ్'కు పితామహుడు?
ఎ) నార్మన్ బోర్లాగ్ బి) ఎం.ఎస్. స్వామినాథన్
సి) డా. వర్గీస్ కురియన్ డి) విలియం గాండీ
7. భారతదేశంలో నూనె గింజల ఉత్పత్తి పెరగడానికి కారణం
ఎ) వైట్ రెవల్యూషన్ బి) ఎల్లో రెవల్యూషన్
సి) గ్రీన్ రెవల్యూషన్ డి) బ్రౌన్ రెవల్యూషన్
8. భారతదేశంలో అత్యధికంగా తేయాకును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) సిక్కిం
సి) అసోం డి) పశ్చిమ బెంగాల్
9. జాతీయ వ్యవసాయ బీమా పథకం ఎప్పటినుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1997 అక్టోబరు బి) 1998 అక్టోబరు
సి) 1999 అక్టోబరు డి) 2000 అక్టోబరు
10. కింది వాటిలో ఖరీఫ్ పంట కానిది?
ఎ) జొన్న బి) మొక్క జొన్న
సి) వేరుశనగ డి) గోధుమ
11. కిందివాటిలో భారత జాతీయ ఆదాయాన్ని మదించే సంస్థ?
ఎ) ప్రణాళికా సంఘం
బి) జాతీయ డేటా సెంటర్
సి) జాతీయ గణాంక సంస్థ
డి) ఏదీకాదు
12. నేషనల్ శాంపిల్ సర్వే సంస్థను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1947 బి) 1948
సి) 1949 డి) 1950
13. దేశంలో అత్యధికంగా రబ్బరును ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) పశ్చిమ బెంగాల్ బి) గుజరాత్
సి) ఉత్తరప్రదేశ్ డి) కేరళ
14. 'ద ఫ్యూచర్ ఆఫ్ ఇండియా' గ్రంథ రచయిత?
ఎ) అమర్త్యసేన్ బి) బిమల్ జలాన్
సి) అభిషేక్ నాయర్ డి) చేతన్ భగత్
15. కుద్రేముఖ్ ఇనుప ఖనిజ ఫీల్డ్ ఏ రాష్ట్రంలో ఉంది?
ఎ) కేరళ బి) తమిళనాడు
సి) గుజరాత్ డి) కర్ణాటక
16. కూరగాయల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు 3) మూడు 4) నాలుగు



సందీప్ కంభంపాటి
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

17. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశ స్థానం?
ఎ) మొదటి బి) రెండు
సి) మూడు డి) నాలుగు



18. నాబార్డ్‌ను ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1980 బి) 1981 సి) 1982 డి) 1983
19. హరిత విప్లవం ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1964 - 65 బి) 1965 - 66
సి) 1966 -67 డి) 1967 - 68
20. ప్రధాన మంత్రి గ్రామోద్యమ యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
ఎ) 1999 బి) 2000 సి) 2001 డి) 2002
21. కింది వారిలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ చట్టాన్ని ఎవరు ప్రకటించారు?
ఎ) ప్రణబ్ ముఖర్జీ బి) మన్మోహన్ సింగ్
సి) చిదంబరం డి) అరుణ్ జైట్లీ
22. ప్రభుత్వ కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 1953 ఏప్రిల్ బి) 1998 ఆగస్టు
సి) 1991 జూలై డి) 1995 నవంబరు
23. కిసాన్ కాల్ సెంటర్లను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2000 జూలై బి) 2002 మార్చి
సి) 2004 మార్చి డి) 2004 జనవరి
24. మైక్రో ఇరిగేషన్ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2002 మార్చి బి) 2004 మార్చి
సి) 2004 జనవరి డి) 2006 జనవరి
25. 2013- 14 లెక్కల ప్రకారం అత్యధికంగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసిన రాష్ట్రం?
ఎ) మధ్యప్రదేశ్ బి) పంజాబ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
26. 2010 లెక్కల ప్రకారం భారతదేశంలో చెరువుల ద్వారా అత్యధిక భూమి సాగులో ఉన్న రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) కర్ణాటక
సి) తమిళనాడు డి) ఉత్తరప్రదేశ్
27. జాతీయ ఆహార భద్రత పథకాన్ని ఏ కాలంలో ప్రారంభించారు?
ఎ) తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
బి) పదో పంచవర్ష ప్రణాళిక చివరలో
సి) పదకొండో పంచవర్ష ప్రణాళిక మధ్యలో
డి) పదకొండో పంచవర్ష ప్రణాళిక చివరలో
28. 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన'ను ప్రకటించినవారు?
ఎ) నరేంద్రమోది బి) మన్మోహన్ సింగ్
సి) ఎ.బి. వాజపేయి డి) ఐ.కె. గుజ్రాల్
29. భారత్‌లో జనపనార సాగు, ఏ నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కువగా కేంద్రీకృతమైంది?
ఎ) గంగ బి) మహానది
సి) బ్రహ్మపుత్ర డి) గోదావరి
30. భారత్‌లో అతి పొడవైన సేద్య కాలువ?
ఎ) బకింగ్ హం బి) సర్‌వాంద్
సి) ఇందిరాగాంధీ డి) సట్లెజ్ - యమున
31. అత్యధికంగా పత్తిని ఉత్పత్తి చేసే రాష్ట్రం?
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) గుజరాత్
32. రబీ, ఖరీఫ్‌లే కాక వ్యవసాయ రంగంలోని మరో కాలం?
ఎ) జమాద్ బి) బరేసాతి సి) షరద్ డి) ఝుం
33. నేలకు ఎక్కువ నత్రజనిని అందించాలంటే ఏ పంటను పండించాలి?
ఎ) గోధుమ బి) ఆవాలు
సి) పొద్దు తిరుగుడు డి) చిరుధాన్యాలు
34. కింది వాటిలో ఏ పంటకు నల్ల రేగడి భూమి ఎక్కువగా అనుకూలించదు?
ఎ) పత్తి బి) గోధుమ
సి) వేరుశనగ డి) బంగాళదుంప
35. కింది వాటిలో వాణిజ్య పంట ఏది?
ఎ) వరి బి) గోధుమ
సి) చెరకు డి) జొన్నలు
36. కేరళలో ఎక్కువగా వినియోగించే వరి వంగడాన్ని ఉప్పునేలలో కూడా సాగుచేయవచ్చు. అయితే దాని పేరు?
ఎ) నీవారా బి) పొక్కలి సి) పొన్ని డి) సాంబ
37. పర్వత ప్రాంతాల్లో దేనిని ఎక్కువగా పండిస్తారు?
ఎ) వరి బి) తేయాకు
సి) వేరుశనగ డి) బంగాళదుంప
38. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తయ్యే కాఫీ రకం?
ఎ) ఓల్డ్ చిక్స్ బి) కూర్గే
సి) అరబిక్ డి) కెంట్స్
39. కేంద్రీయ వరి పరిశోధన సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) కాన్పూరు
సి) కోయంబత్తూరు డి) కటక్
40. ఏ పంచవర్ష ప్రణాళిక కాలంలో వ్యవసాయ రంగంలో రుణాత్మక వృద్ధి నమోదయింది?
ఎ) మూడో బి) రెండో
సి) ఏడో డి) తొమ్మిదో

సమాధానాలు

1) సి	7) బి	13) డి	19) సి	27) డి	35) సి
2) డి	8) సి	14) బి	20) బి	28) బి	36) బి
3) సి	9) సి	15) డి	21) ఎ	29) ఎ	37) బి
4) డి	10) డి	16) బి	22) బి	30) సి	38) సి
5) డి	11) సి	17) ఎ	23) డి	31) డి	39) డి
6) సి	12) డి	18) సి	24) డి	32) ఎ	40) ఎ
			25) సి	33) డి	
			26) సి	34) సి	

ఉద్యోగాలు

గెయిల్ ఇండియా

గెయిల్ ఇండియా లిమిటెడ్ - కింది విభాగాల్లో **ఎస్ 3 & ఎస్ 5** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 151
విభాగాలు: ఎలక్ట్రికల్, ఫైనాన్స్ & అకౌంట్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, లేబొరేటరీ, మార్కెటింగ్, అఫిషియల్ లాంగ్వేజ్, స్టోర్స్ & పర్చేజ్
పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 15
వెబ్‌సైట్: www.gailonline.com

ఇండియన్ ఎయిర్ ఫోర్స్

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్)- **సూపరింటెండెంట్, స్టోర్ కీపర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 95
పోస్టులు - ఖాళీలు: స్టోర్ సూపరింటెండెంట్ 55, స్టోర్ కీపర్ 40
అర్హత: సూపరింటెండెంట్‌కు డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. స్టోర్ కీపర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. రెండు పోస్టులకు స్టోర్ అకౌంట్స్ మెయింటైన్ చేయడంలో అనుభవం ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా
పరీక్ష కేంద్రం: ఢిల్లీ
ఆర్డినరీ పోస్టు ద్వారా దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 9
చిరునామా: Director PC(AHC), Air Head quarter, J Block, New Delhi - 110106
వెబ్‌సైట్: www.indianforce.nic.in

ఎఎహెచ్‌సి

అగ్రికల్చర్ & హార్టికల్చర్ కార్పొరేషన్- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 1600
పోస్టులు: డిస్ట్రిక్ట్ ఆఫీసర్(డేటా కలెక్షన్) 1182, డిస్ట్రిక్ట్ మేనేజర్ 197, ఎంఐఎస్ ఆఫీసర్ 197, ఏరియా మేనేజర్ 20, స్టేట్ హెడ్ 4
అర్హత: డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి
ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.700
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 2
వెబ్‌సైట్: www.aahc.org.in

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్

వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 657
పోస్టులు - ఖాళీలు: మైనింగ్ సిర్దార్ 298, స్టాఫ్ నర్స్ 64, టెక్నీషియన్(రేడియోగ్రాఫర్ 1, పాథలాజికల్ 9, రిఫ్రాక్షన్/ ఆప్టోమెట్రీ 1), ఆడియొమెట్రీ టెక్నీషియన్ 4, జూనియర్ టెక్నీషియన్ (ఇసిజి/ ఇఇజి) 4, ఫార్మసిస్ట్ ట్రైనీ 2, ఓవర్సీర్ (సివిల్) 4, జూనియర్ టెక్నీషియన్ ఇన్‌స్పెక్టర్/ జూనియర్ కెమిస్ట్ 48, జూనియర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ 32, ట్రాన్స్‌లేటర్ ట్రైనీ 9, క్లర్క్ 139, స్టోర్ ఇష్యూ క్లర్క్ 31, అసిస్టెంట్ లోడింగ్ క్లర్క్ 11
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/ ఇంటర్/ మెట్రిక్యులేషన్/ డిగ్రీ పాసై ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 30
వెబ్‌సైట్: www.westerncoal.nic.in

ఐఐఎం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అకౌంటెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్), జూనియర్ ఇంజనీర్, సీనియర్ లైబ్రరీ& ఇన్ఫో అసిస్టెంట్, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్
వెబ్‌సైట్: www.iimv.ac.in/careers

ఐజీఎన్‌టీయు

ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఐజీఎన్‌టీయు)- ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
క్యాంపస్‌లు: అమర్‌కంటక్ క్యాంపస్ (యోగా డిపార్ట్‌మెంట్, కృషి విజ్ఞాన్ కేంద్ర ఐసిఎఆర్ ప్రాజెక్ట్, మోడల్ ట్రైబల్ స్కూల్), రీజనల్ క్యాంపస్ (మణిపూర్)(డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ ఆంత్రపాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
వెబ్‌సైట్: www.igntu.ac.in/recruitment.htm

ఇసిఐఎల్

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఇసిఐఎల్) - కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(న్యూక్లియర్), జనరల్ మేనేజర్(ఆర్&డి), డిప్యూటీ జనరల్ మేనేజర్(కంపెనీ సెక్రటరీ), పర్చేజ్ మేనేజర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్
వెబ్‌సైట్: http://careers.ecil.co.in

రైట్స్ లిమిటెడ్

రైట్స్ లిమిటెడ్ - కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్ (సివిల్) 2, జాయింట్ జనరల్ మేనేజర్(సివిల్ 2, ఇ&ఎం ఎక్స్‌పర్ట్ 2), మేనేజర్(సోషియాలజీ, సోషల్ వర్క్) 1, అసిస్టెంట్ మేనేజర్(ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ 2, సోషియాలజీ / సోషల్ వర్క్ 2, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ 4), సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్) 1, డిప్యూటీ జనరల్ మేనేజర్(సివిల్) 1
పూర్తి వివరాలకు ఆగస్టు 26 నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడవచ్చు
వెబ్‌సైట్: www.rites.com



ఖమ్మం సాంస్కృతికం: సినీ హీరో నందమూరి బాలకృష్ణ నటించిన పైసా వసూల్ ఆడియో ఆవిష్కరణ కు ఖమ్మం గుమ్మం వేదికయింది. గురువారం ఖమ్మం లోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సాయంత్రం ఆరు గంటలకు ఈ ఆడియో ఆవిష్కరణ జరగనుంది. నందమూరి బాలకృష్ణ నటించిన 101వ చిత్రమిది. భవ్య క్రియేషన్స్ నిర్మించిన చిత్రానికి నిర్మాత ఆనంద్ ప్రసాద్, దర్శకుడు పూరీ జగన్నాధ్, క్రిష్, హీరో బాలకృష్ణ, హీరోయిన్ కైరా అద్వానీ, సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ రానున్నారు. నటుడు ఆలీ, శ్రీముఖి యాంకరింగ్ చేయనున్నారు. కలకత్తా, బొంబాయి కళాకారులచే ప్రత్యేక ఆకర్షణగా నృత్యాలు ప్రదర్శించనున్నారు. ఆడియో ఆవిష్కరణకు ప్రత్యేకంగా భారీ ఏర్పాట్లు చేశారు. సినీ తారాగణంతోపాటు సాంకేతిక వర్గం ఈ ఆడియో ఆవిష్కరణకు హాజరుకానున్నారు. తొలిసారి ఖమ్మంలో ఆడియో ఆవిష్కరణ జరుగుతుంది. జిల్లా పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు రవిచంద్ర, ఆదిత్య థియేటర్ యజమాని కాంపాటి పిచ్చయ్య ఏర్పాట్లను ప్రత్యేకంగా పరిశీలించారు.


పైసా వసూల్ ఆడియో ఆవిష్కరణకు సిద్ధమవుతున్న వేదిక


ఏర్పాట్లు పరిశీలిస్తున్న వద్దిరాజు రవిచంద్ర

మరోసారి నై..!?

- రామాలయ ప్రాంగణంలో వివాహానికి నిరాకరణ
- ఏపీ జంటకు చేదు అనుభవం
- కోదండ రామాలయంలో వివాహం చేసుకున్న వధూవరులు

భద్రాచలం: ఇటీవల హైదరాబాద్‌కు చెందిన వధూవరులను భద్రాద్రి రామాలయ ప్రాంగణంలో వివాహం చేసుకునేందుకు అనుమతించని దేవస్థానం అధికారులు తాజాగా మరోసారి ఏపీ నుంచి వచ్చిన జంటకు వివాహం చేసుకునేందుకు నిరాకరించడంతో వారు మనో వేదనకు గురయ్యారు. ఏపీలోని కర్నూలుకు చెందిన నరేష్‌బాబు-శివ పార్వతి వధూవరులు భద్రాద్రి రామయ్య సన్నిధిలో పెళ్లి చేసుకుందామని బుధవారం వచ్చారు. ఈ సమయంలో రామాలయ ప్రాంగణంలో వివాహం చేసుకునేందుకు వారు దేవస్థానం అధికారులను సంప్రదించగా ఇక్కడ కుదరదు.. తానీషా కల్యాణ మండపానికి వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. దీంతో వారు తానీషా కల్యాణ మండపానికి వెళ్లగా అక్కడ రూ.2,500 కడితే పెళ్లి చేసుకోవచ్చు అని సమాధానం ఇవ్వడంతో వారు అంత మొత్తం తాము చెల్లించలేమని వాపోయారు. ఈ క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలోని కోదండ రాముని ఆలయాన్ని ప్రత్యామ్నాయంగా ఎంచుకొని వివాహం చేసుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ బాబు శివపార్వతి బంధువుల మాట్లాడుతూ తాము భద్రాద్రి రామయ్య సన్నిధిలో పెళ్లి చేసుకోవాలని వచ్చామని, కాని ఇక్కడి అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని వాపోయారు శ్రీరామ చంద్రుని వద్ద మా వివాహాన్ని చేసుకుందామని వస్తే దేవస్థానం అధికారులు వ్యవహరించిన తీరు తమను ఎంతో మనస్థాపానికి గురి చేసిందని వారు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో భద్రాద్రి దేవస్థానం ఈవో కె.ప్రభాకర శ్రీనివాస్ రామాలయ ప్రాంగణంలో వివాహాలను అనుమతించకపోవడం సంచలనం చర్చనీయాంశం కాగా భక్తులు అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రామయ్య సన్నిధిలో వివాహం చేసుకుందామని వస్తున్న వారిని అధికారులు వివిధ కారణాలతో అనుమతించకపోవడం సమంజసం కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.


కోదండ రామాలయంలో వివాహం చేసుకున్న జంట

వేగంగా బీటీపీఎస్ పనులు

- జోరుగా చిన్న బాయిలర్ నిర్మాణం
- తరచూ అధికారుల సందర్శన

పినపాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భద్రాద్రి థర్మల్‌పవర్‌ప్లాంటు, నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పర్యావరణ అనుమతులు లేక ఏడాదిన్నర పాటు ప్లాంటు పనులు నిలిచిపోయిన విషయం విదితమే. మూడు నెలలక్రితం కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ పర్యావరణ అనుమతులు ఇవ్వగా తిరిగి పనులను ఆరంభించారు. 1080 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించే ప్లాంటుకు ప్రభుత్వం రూ.7,500కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతను భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సంస్థకు అప్పగించింది. బీహెచ్ఈఎల్ టెండర్లు నిర్వహించగా కన్వర్ కన్‌స్ట్రక్షన్, బ్రిడ్జి అండ్ రూఫ్ సిస్‌కాన్, స్లిప్‌కోపహర్‌పుర, సృష్టి, శ్రీ విజయ, ఇండిలెవల్ తదితర సంస్థలు పనులు దక్కించుకున్నాయి. వివిధ విభాగాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండగా వివిధ విభాగల నిర్మాణానికి లక్షల టన్నుల ఉక్కు దిగుమతి చేశారు. ప్లాంటు లెవలింగ్ కోసం లక్షలాది టన్నుల మట్టిని తవ్వి బయటకు తరలిస్తు న్నారు. కొన్ని విభాగాల్లో పగలు, రాత్రి పనులు సాగుతున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఒక యూనిట్‌లో విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభించాలనే లక్ష్యంతో అధికార యంత్రాంగం పని చేస్తున్నారు.

కొనసాగుతున్న చిమ్నీ పనులు




సదస్సులో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ కోదండరాం

దసరా తర్వాత మరో ఉద్యమం

- ఒక్కడి వల్లే తెలంగాణ రాలేదు
- ప్రశ్నించే హక్కు అందరికీ ఉంది.
- ఏఐవైఎఫ్ నిరుద్యోగ సదస్సులో జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

ఖమ్మం అర్బన్: పూర్తిస్థాయి ఉద్యోగాల భర్తీ డిమాండ్‌తో దసరా పండుగ తరువాత మరో ఉద్యమం చేపడతామని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన నిరుద్యోగ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోవటంతో యువకులు ఉద్యోగాలకే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అయితే యువత అర్హతలకు తగిన ఉద్యోగాలు దక్కటం లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్లలో ప్రధానమైన నియామకాలు ఆశించిన స్థాయిలో లేకపోవటంతో నిరుద్యోగ యువత ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉద్యోగాల కల్పన విషయంలో ప్రశ్నించినందుకే ప్రభుత్వం తమ యాత్రను అడ్డుకుందన్నారు. అయినా దసరా తరువాత మరోసారి ఉద్యమం చేపడతామన్నారు. ఇందుకోసం తమతో కలిసివచ్చే పార్టీలు, అభ్యుదయ శక్తులతో చరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్లపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులపై లేదని ఆరోపించారు. మిషన్ కాకతీయ భగీరథ, తదితర పథకాలు, ఇసుక రీచ్‌లలో కమిషన్లు ఎలా దక్కుతాయా..? అన్న ఆలోచన తప్ప నిరుద్యోగుల సమస్యను పట్టించుకోవటం లేదన్నారు.

ప్రత్యేక రాష్ట్రం ప్రజలందరూ పోరాడితేనే దక్కిందన్నారు. తెలంగాణ కోసం అనేక మంది వీరులు ఆత్మబలిదానం చేసిన సంగతి మరువరాదన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రశ్నించే హక్కు అందరికీ ఉందన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఫలాలు ఉద్యమ వీరులందరికీ చెందాలన్నారు. ఇందులో భాగంగా ఉద్యోగ నియామకాలు తక్షణం చేపట్టాలన్నారు. ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ ఖాళీలకు ముఖ్యమంత్రి ప్రకటనకు పొంతన లేదన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల వరకు ఉద్యోగ ఖాళీలు ఉండగా ముఖ్యమంత్రి ఇరవైరెండు వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేయనున్నట్లు ప్రకటించారన్నారు. ప్రభుత్వం తక్షణం ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేసి ఏ నెలలో ఏ ఉద్యోగోలు భర్తీ చేయబోతున్నారో స్పష్టం చేయాలన్నారు. ప్రైవేటు సంస్థల్లో స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలతో పాటు ప్రభుత్వం ఉపాధి కల్పన లక్ష్యంగా ఆర్థిక విధానాలు రూపొందించుకోవాలన్నారు.

ప్రభుత్వం మెడలు వంచాలి: పువ్వాడ

నిరుద్యోగ యువత ఐక్యంగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచాలని సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాల విషయంలో ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మారపాక అనిల్, జిల్లా అధ్యక్షుడు అబ్బూరి మహేష్, జిల్లా కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్, సీపీఐ నాయకులు పోటు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

టీజాక్‌పై టార్గెట్ సమంజసం కాదు

ఖమ్మంలోనూ అమరవీరుల స్ఫూర్తియాత్ర

ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం దృష్టిసారించాలి: కోదండరామ్

ఖమ్మం కలెక్టరేట్: అమరవీరుల స్ఫూర్తియాత్రను ఖమ్మంలోనూ నిర్వహించనున్నట్లు టీజేఏసీ చైర్మన్ ఆచార్య కోదండరామ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే టీజేఏసీని టార్గెట్ చేస్తూ కార్యకలాపాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని ఆయన ఆరోపించారు. బుధవారం ఖమ్మంలోని జేఏసీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ అమరవీరులస్ఫూర్తి యాత్రను ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే అడ్డుకుంటుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తమను టార్గెట్ చేసినట్లు ఉందని, ఇది సరైంది కాదన్నారు. మిషన్‌కాకతీయ, భగీరథ పథకాలు ఇసుక లాంటి అంశాలపై శ్రద్ధను కనిపిస్తున్న ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం నిరుద్యోగులకు హామీ ఇచ్చిన ఉద్యోగాల భర్తీపై దృష్టిసారించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి వాటి సాధన కోసం ఉద్యమాలను నిర్వహించాలని తలుస్తున్నా ప్రభుత్వం వీటిని నిర్వీర్యం చేసేందుకు కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. టీజేఏసీపై ప్రభుత్వం నిర్భందాన్ని విధిస్తోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో టీజాక్ కన్వీనర్ డాక్టర్ ఎస్ పాపారావు, గిరిజన సంఘం నాయకులు భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు కోదండరామ్‌కు వినతిపత్రాలను అందచేశారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

క్రైం: టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారయ్యారు. అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొల్ల గూడెంలో పేకాట ఆడుతున్న మర్రిమేకల కార్తీక్, మర్రిమేకల వినయ్, కంచెర్ల కార్తీక్, ఎం. గణేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 17500 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సినిమాలు

● ఆదిత్య	నేనే రాజు నేనే మంత్రి
● వినోద	ఫిదా
● సుందర్‌మ్యాక్స్	లై
● నర్తకి	లై
● తిరుమల	జయజానకినాయక
● కిన్నెరసాని	గౌతమ్‌నందా
● శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

బస్సుల వేళలు



ఖమ్మం నుంచి హైదరాబాద్

● ఇంద్ర

- ఉదయం : 5.00, 6.00, 10.30, 1.00 (బీహెచ్‌ఈఎల్)
- మధ్యాహ్నం : 12.00, 1.00, 2.30 (బెంగళూరు)
- సాయంత్రం : 4.30, 6.00
- రాత్రి : 11.30, 12.30

● సూపర్ లగ్జరీ

- ఉదయం 4.00, 6.00, 9.30, 10.30, 11.30, 12.30, 1.00, 1.30, 1.45, 2.15, 2.30, 4.00, 4.15, 4.30, 5.15, 6.10
- విచారణ : 9959225979

-సాంస్కృతికం

ప్రధాన ఆసుపత్రి

ఆర్ఎంవో	8008553182
సూపరింటెండెంట్	8008553185

పోలీస్ సమాచారం

●డీఎస్పీ	9440795303
● వన్‌టౌన్	
ల్యాండ్	228333
సీఐ	9440795317
● టు టౌన్	
ల్యాండ్	224302
సీఐ	9440904888
● త్రీ టౌన్	
ల్యాండ్	223190
సీఐ	9440795339
● అర్బన్	
ల్యాండ్	223663
సీఐ	9440795309

ముమ్మరంగా ఓటర్ల సమగ్ర సర్వే

సాంకేతిక లోపాలపై బీఎల్‌వోలకు అవగాహన

రఘునాథపాలెం: ఓటర్ల సమగ్రసర్వేలో బీఎల్వోలు బిజీబిజీగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయకూలీలు అధికంగా ఉండటంతో ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు సర్వే నిర్వహిస్తున్నారు. ఇటీవలే వారికి ట్యాబ్‌లు అందించారు. ఇవే వారి సర్వేకు అవరోధంగా మారుతున్నాయి. సిగ్నల్ సరిగా లేకపోవడంతో ఆన్‌లైన్ నమోదుకు బీఎల్వోలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో పేరు నమోదుకు సుమారు పది నిమిషాల సమయం పడుతోందని బీఎల్వోలు అంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఖమ్మం నియోజకవర్గ ఎలక్షన్ డీటి పవన్, తహసీల్దార్ తిరుమలాచారి, ఆర్ఐలు క్రాంతికుమార్, నర్సింహరావు మండలంలోని రఘునాథపాలెం, బూడిదంపాడు గ్రామాల్లో పర్యటించారు. ఓటరు ఆన్‌లైన్‌విధానాన్ని పరిశీలించారు. బీఎల్వోల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపాలపై ఎలక్షన్ డీటి పవన్ బీఎల్వోలకు అవగాహన కల్పించారు. అస్థవ్యస్థంగా ఉన్న ఓటరు జాబితాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టిందని అన్నారు. సమగ్ర సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాకు తుది రూపం తెచ్చేవిధంగా పలు సూచనలు చేసిందని, పైలెట్ ప్రాజెక్టులను ఎంపిక చేసిందని, అందులో జిల్లాలో ఖమ్మం నియోజకవర్గం, పాలేరు నియోజకవర్గాలు ఉన్నాయని తెలిపారు. ఇంటెన్సీవ్ రివిజన్ ఎలక్ట్రోల్ రూల్ (ఐర్ఈఆర్) ప్రకారంగా నియోజకవర్గంలోని ఓట్లను ఒక పద్ధతి ప్రకారం రూపొందించనున్నారు. ఈ సర్వేలో రెండుచోట్ల ఉన్న ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ప్రాంతాలు మార్చాల్సిన ఓట్లను సవరించే అవకాశం ఉంది. పాలేరు నియోజకవర్గంలో వేగంగా సర్వే నడుస్తోందని అధికారులు తెలిపారు. ఖమ్మంలో ఉన్న లోపాలను గుర్తించి బీఎల్వోలకు అదనంగా పలు అంశాల్లో శిక్షణ ఇచ్చామని ఎలక్షన్ డీటి పవన్ తెలిపారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో 1000 నుంచి 1400 ఓట్లను మాత్రమే ఉంచనున్నట్లు తెలిపారు. ఖమ్మం నియోజకవర్గంలో 224 పోలింగ్ బూత్‌లకు 2,66, 840 ఓట్లు ఉన్నాయి. మరో 15 పోలింగ్‌బూత్‌లు పెరగనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్, బీఎల్వోలు నజ్మా, బోయిన వెంకటనర్సయ్య పాల్గొన్నారు.



ట్యాబ్‌లో సాంకేతిక వివరాలను తెలుపుతున్న అధికారులు

పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలు

కురువెళ్ల ప్రవీణ్ సేవలకు గుర్తింపు

గాంధీచౌక్: సమాజ సేవలకు, స్వచ్ఛంద కార్యక్రమాలకు గుర్తింపు లభించింది. శ్రీమిత్ర ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ స్తంభాద్రి ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నందుకు నగరంలోని త్రీటౌన్ వాసి కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌కు ఉత్తమ అవార్డు లభించింది. మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ కొంతమంది స్నేహితులతో కలిసి శ్రీమిత్ర ఫౌండేషన్, రోటరీక్లబ్ ఆఫ్ స్తంభాద్రి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం, జిల్లాలోని ఎన్నో పాఠశాలల్లో ఎల్ఈడీ టీవీలు, శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో నూతన నిర్మాణాలు, క్లాస్‌రూమ్‌లలో బెంచీలు ఇతర సామగ్రి, పుస్తకాల పంపిణీ, తాగునీటి ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో ప్రజల కోసం నీళ్ల ట్యాంకులు సైతం ఏర్పాటు చేశారు. ఆయన సేవలకు మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతులమీదుగా కలెక్టర్, సీపీలు లోకేష్‌కుమార్, తఫ్సీర్ ఇక్బాల్ సమక్షంలో ఉత్తమ సేవకుడిగా ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు.

అవార్డు అందజేసిన మంత్రి తుమ్మల



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

నేటి నుంచి కేంద్రీయ విద్యాలయంలో
పుస్తక ప్రదర్శన

స్పోర్ట్స్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పరిధిలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలలో నేటి నుంచి ఈ నెల 19 వరకు స్కాలాస్టిక్ పబ్లికేషన్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాలైన సుమారు 500పైగా పుస్తకాలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ప్రదర్శనకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పుస్తక ప్రేమికులు అందరూ ఆహ్వానితులని పేర్కొన్నారు.

‘బ్రహ్మంగారి చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు’

మయూరి సెంటర్: పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్రను వక్రీకరిస్తూ ఓ ఎలక్ట్రానిక్ చానల్‌లో ‘వెలిప్రేమ’ అనే కథనం పేరుతో బ్రహ్మంగారి చరిత్రను వక్రీకరిస్తోందని, తక్షణం ఆ కార్యక్రమాన్ని నిలిపివేయాలని విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన పోతులూరి వీరబ్రహ్మంగారి కులాన్ని తక్కువగా చేస్తూ చూపిస్తున్న బుల్లితెర యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న ఓ ఛానల్‌లో ప్రసారమైన ‘వెలిప్రేమ’ కథనంలో పోతులూరి వీరబ్రహ్మం చరిత్రను వక్రీకరించారని, విశ్వబ్రాహ్మణులను తక్కువగా చూపించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వసంత్‌బాబు, నాగచారి, సీతారామచారి, సువర్ణ ప్రసాద్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిక్కసాని సహృదయ్ దంపతులకు నామా శుభాకాంక్షలు

మామిళ్లగూడెం: బిక్కసాని దామోదర్ కుమారుడు బిక్కసాని సహృదయ్ - రవళి దంపతులను మాజీ ఎంపీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నామా నాగేశ్వరరావు బుధవారం ఆశీర్వదించారు. బిక్కసాని దామోదర్ కుమారుడు సహృదయ్, ఏలూరి శ్రీనివాసరావు కుమార్తె రవళిలకు ఈ నెల 20వ తేదీన వివాహం జరిగింది. ఆ కార్యక్రమానికి మాజరుకాకపోవడంతో బుధవారం నామా నాగేశ్వరరావు వారిని కలిసి ఆశీర్వదించారు. అలాగే కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ కుమార్తె వివాహానికి కూడా హాజరు కాలేకపోవడంతో వారి ఇంటికి వెళ్లిన నామా నాగేశ్వరరావు కొత్తదంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నామా వెంట జిల్లా టీడీపీ అధ్యక్షుడు తుళ్లూరి బ్రహ్మయ్య, కూరపాటి వెంకటేశ్వర్లు, తోటకూరి శివయ్య, చిత్తారు సింహాద్రి యాదవ్, మందపాటి వెంకటేశ్వర్లు, చీకటి రాంబాబు తదితరులున్నారు.



బిక్కసాని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

మాజీమంత్రి దామోదరరెడ్డికి మానుకొండ పరామర్శ

కమాన్‌బజార్: అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ బుధవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మానుకొండ వెంట నంద్యాల రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులలు మద్దినేని నర్సింహారావు తదితరులు ఉన్నారు.

నగరంలో వాన

పలు ప్రాంతాలు జలమయం ● ఇబ్బందులు పడిన ప్రజలు


జడ్పీ సెంటర్‌లో...


రోడ్డు పక్కన నిల్చున్న ప్రజలు


కమాన్‌బజార్ - కస్పాబజార్ మధ్య వరద నీరు

టౌన్: నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. గత రెండు రోజుల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు కూడా వాతావరణం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంది. సాయంత్రం మబ్బులు పట్టి భారీగా వర్షం కురిసింది. నగరంతో పాటు పరిసర ప్రాంతాలైన పాండురంగాపురం, బల్లేపల్లిలో కూడా వర్షం కురిసింది. కమాన్‌బజార్, కస్పాబజార్ తదితర ప్రాంతాలతో పాటు బస్టాండ్, మయూరిసెంటర్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రహదారులపై నిలిచిందది. దీంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.


వర్షంలోనే రవాణా...


రిక్కాబజార్‌లో వరదనీరు

'పైసావసూల్' ఆడియో విజయవంతం కావాలని బైక్ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న అభిమాన సంఘం నేతలు

సాంస్కృతికం: సినీహీరో నందమూరి బాలకృష్ణ నటించిన 'పైసావసూల్' చిత్రం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నందమూరి బాలకృష్ణఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. స్తానిక ఎన్టీఆర్ విగ్రహం నుంచి బైక్‌ర్యాలీ జరిపారు. ఈ ర్యాలీలో సంఘం జిల్లాఅధ్యక్షుడు టి.శ్రీనివాస్, సంఘంనేతలు, అభిమానులు పాల్గొన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం


కోర్టును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

స్పోర్ట్స్: నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ఆవరణలో వ్యాయామ విద్య (బీపీఈడీ) విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టును బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీపీఈడీ విద్యార్థులు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పోటీపరీక్షలకు ఉచిత శిక్షణ ప్రారంభం

ముదిగొండ: మండలంలోని పమ్మి గ్రామంలో గ్రూప్-2, గ్రూప్-3, గురుకుల, ఎస్ఐ తదితర పోటీ పరీక్షలకు విద్యార్థులకు ఉచిత శిక్షణను బుధవారం ప్రారంభించారు. ప్రముఖ ఈఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ బుగ్గవీటి నర్సింహారావు, సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ ఆర్థికసహకారం అందించారు. ప్రభుత్వ హైస్కూల్లో సాయంత్రం ఆరుగంటల నుంచి తొమ్మిదిగంటల వరకు ఉచిత శిక్షణ నిర్వహించనున్నారు.

ముదిరాజ్ మహాసభ

3వ డివిజన్ కమిటీ ఎన్నిక

కమాన్‌బజార్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ మూడో డివిజన్ కమిటీని బుధవారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా దంతాల రాము, కార్యదర్శిగా తేనె ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పిట్టల నాగేశ్వరరావు, సాధినేని నరేష్, సహాయ కార్యదర్శిగా రావుల లింగయ్య, లీలా వీరబాబు, కోశాధికారిగా భూషి వీరయ్య, గౌరవ సలహాదారులుగా కొత్తా రాము, శీలం శ్రీను, గొడుగు నాగేశ్వరరావు, పేరబోయిన వెంకన్న, దంతాల నర్సయ్య, ముత్తయ్య, లక్ష్మయ్య, ఇండ్ల వెంకన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ


పవిత్రోత్సవాలు ప్రారంభం

సాంస్కృతికం: నగరంలోని కాల్వొడ్డులోగల ఆంజనేయస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ఠ జరిపి ప్రత్యేకంగా హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్‌బీ. కృష్ణమాచార్యులు బృందం ఈ పూజల్ని జరిపారు. ఆలయ చైర్మన్ బచ్చు మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ శ్రీరామచంద్రమూర్తి, సిబ్బంది బేబి సరోజిని, ఆనంద్ పర్యవేక్షించారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వే సమాచారం



మామిళ్లగూడెం: న్యూఢిల్లీ, కన్యాకుమారి, చెన్నై మార్గాలకు అనుసంధానంగా ఉన్న ఖమ్మం రైల్వేస్టేషన్ నుంచి ప్రతీరోజు సుమారు 120 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటి రాకపోకల వివరాలకు 08742- 224541 ఫోన్ నంబరు ద్వారా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఖమ్మం నుంచి విజయవాడ వైపు(వీక్లీ)

రైలునెం	పేరు	నుంచి వరకు	సమయం
12778	కాకినాడ	సికింద్రాబాద్-కాకినాడ	00:08 (మంగళ, గురు, శని)
16863	మన్నారుగుడి	భగత్‌కోటి-చెన్నై	00:20(శని)
16360	ఎర్నాకుళం	పట్నా-ఎర్నాకుళం	00:35(గురు)
22632	అనురావత్	భగత్‌కోటి-చెన్నై	00:53(మంగళ)
17214	నర్సాపూర్	నాగర్‌సోల్-నర్సాపూర్	03:00(ఆది, మంగళ)
22351	పాటలీపుత్ర	పాటలీపుత్ర-యశ్వంత్‌పూర్	04:20 (ఆది)
12670	గంగాకావేరి	చాప్రా- చెన్నై	04:20(బుధ, శుక్ర)
18502	గాంధీధామ్	గాంధీధామ్-విశాఖ	04:31(మంగళ)
22664	జోధ్‌పూర్	జోధ్‌పూర్-చెన్నై	07:28(బుధ)
18112	టాటానగర్	యశ్వంత్‌పూర్-టాటానగర్	08:54(సోమ)
17205	షిర్డీ	షిర్డీ-కాకినాడ	13:05(సోమ, బుధ, శుక్ర)
17207	షిరీ	షిర్డీ -విజయవాడ	13:05(గురు)
18504	విశాఖ	షిర్డీ-విశాఖ	13:05(శని)
12511	రప్తీసాగర్	గోరఖ్‌పూర్-త్రివేండ్రం	13:35(సోమ, శుక్ర, శని)
22647	కోర్బా	కోర్బా-త్రివేండ్రం	13:35(ఆది, గురు)
12521	బరౌని	బరౌని-ఎర్నాకుళం	13:35(బుధ)
22646	అహల్యనగరి	ఇండోర్-త్రివేండ్రం	13:35(మంగళ)
77253	ప్యాసింజర్	మహబాద్-విజయవాడ	13:48(బుధ, శని)
16318	హిమసాగర్	జమ్ముతావి-కన్యాకుమారి	17:08
16094	లక్నో	లక్నో-చెన్నై	20:18(గురు, శుక్ర)
16032	అండమాన్	జమ్ముతావి-చెన్నై	20:18(ఆది, సోమ, గురు)
16688	నవయుగ	జమ్ముతావి-మంగుళూరు	20:18(శని)
12784	సికింద్రాబాద్	సికింద్రాబాద్-విశాఖ	21:44
12762	కరీంనగర్	కరీంనగర్-తిరుపతి	23:09(ఆది, గురువారం)

ఖమ్మం నుంచి వరంగల్ వైపు(వీక్లీ)

22352	పాటలీపుత్ర	యశ్వంత్‌పూర్-పాటలీపుత్ర	00:20(మంగళ)
18501	గాంధీధామ్	విశాఖ-హైదరాబాద్	01:29(శుక్ర)
12669	గంగాకావేరి	చెన్నై-చాప్రా	01:43(మంగళ,ఆది)
12775	కాకినాడ	కాకినాడ-సికింద్రాబాద్	02:19(సోమ, బుధ,శుక్ర)
16864	భగత్‌కోటి	చెన్నై-భగత్‌కోటి	04:11(మంగళ)
22631	అనురత్	చెన్నై-డీకెన్	05:15(శుక్ర)
12761	కరీంనగర్	తిరుపతి-కరీంనగర్	06:08(గురు, ఆది)
22646	త్రివేండ్రం	త్రివేండ్రం,ఇండోర్	07:30(ఆదివారం)
12522	బరౌని	ఎర్నాకుళం-బరౌని	07:30(శని)
16326	అహల్యనగర్	త్రివేండ్రం-ఇండోర్	07:30(ఆదివారం)
12512	రప్తిసాగర్	త్రివేండ్రం-గోరఖ్‌పూర్	07:30 (సోమ, బుధ, గురు)
22648	కోర్బా	త్రివేండ్రం-కోర్బా	07:30(మంగళ, శుక్ర)
12512	రప్తీసాగర్	త్రివేండ్రం- గోరఖ్‌పూర్	07:30(సోమ,బుధ,గురు)
17206	కాకినాడషిర్డీ	కాకినాడ-షిర్డీ	11:40(సోమ, బుధ, శని)
17208	విజయవాడషిర్డీ	విజయవాడ-షిర్డీ	11:40(మంగళ)
77254	పెద్దపల్లిప్యాసింజర్	విజయవాడ-పెద్దపల్లి	12:00(మంగళ, శుక్ర)
17213	నర్సాపూర్	నర్సాపూర్-నాగర్‌సోల్	15:10 (సోమ, మంగళ, బుధ,గురు, శుక్ర)
16031	అండమాన్	చెన్నై-జమ్ముతావి	16:04(ఆది,బుధ, గురు)
16093	లక్నో	చెన్నై-లక్నో	16:04(మంగళ, శని)
18503	విశాఖ	విశాఖ-షిర్డీ	16:30(గురు)
18111	టాటానగర్	టాటానగర్-యశ్వంత్‌పూర్	16:54(శుక్ర)
16687	నవయుగ	మంగుళూరు-జమ్ముతావి	17:30(మంగళ)
16317	హిమసాగర్	కన్యాకుమారి-జమ్ముతావి	17:30(శని)
12125	జోద్‌పూర్	చెన్నై-జోద్‌పూర్	23:30(ప్రతిరోజు)

స్టే వైర్ వివాదం... నిలిచిన విద్యుత్ సరఫరా

కమాన్‌బజార్: విద్యుత్ స్తంభాలకు సపోర్టుగా ఏర్పాటు చేసే స్టే వైర్ వివాదంగా మారింది. ఈ స్టేవైర్ విషయంలో విద్యుత్‌శాఖ సిబ్బందికి, పంపింగ్ వెల్ వాసులకు మధ్య వాగ్వాదం జరగడంతో బుధవారం ఆ ప్రాంతానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పంపింగ్‌వెల్‌రోడ్డులో పాత విద్యుత్ లైన్‌ను, స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త లైన్లు, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ స్తంభాలకు స్టే వైర్ ఏర్పాటుచేసే క్రమంలో తమ ఇంటికి వద్దు అంటే... తమ ఇంటికొద్దు అంటూ పలువురు స్థానికులు విద్యాశాఖ సిబ్బందితో వాగ్వావాదానికి దిగారు. సిబ్బంది ఇది పై అధికారుల నిర్ణయమని, మా ఇష్టం వచ్చినట్టు వేస్తామని దురుసుగా ప్రవర్తించడంతో వివాదం ముదిరింది. దీంతో పట్టణ ఏడీఈ బాలాజీ పరిస్థితిని గమనించి రెండు గంటల్లో విద్యుత్తు అందిస్తామని తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

16వ డివిజన్‌లో మేయర్ పాపాలాల్ పర్యటన



మయూరి సెంటర్: నగరంలోని 16వ డివిజన్ శాంతినగర్, పాకబండ బజార్, ఎస్పీ ఆఫీస్‌రోడ్ ప్రాంతాలలో బుధవారం మేయర్ పాపాలాల్ పర్యటించి రహదారులు, మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరంలో పాకబండబజార్‌లో ఆరులక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలించారు. శాంతినగర్ పాఠశాలలో కొళాయి కనెక్షన్, టాయ్‌లెట్లు నిర్మించనున్నట్టు తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ కమర్తపు మురళి, డీఈ స్వరూపరాణి, ఏఈ సురేష్, ఎస్ఐ ముర్తుజా, ప్రభాకర్, తాజుద్దీన్ ఉన్నారు.

16వడివిజన్‌లో పనులు పరిశీలిస్తున్న మేయర్

ప్రేమపేరుతో మోసగించాడని ఫిర్యాదు

అర్బన్: ప్రేమ పేరుతో తనను మోసం చేసిన యువకుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ రఘునాధపాలేనికి చెందిన ఓ యువతి బుధవారం జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు ఫిర్యాదు చేసింది. భక్తరామదాసు కళాక్షేత్రంలో కోదండరాంను కలిసిన ఆ యువతి తనను కొంత కాలంగా ఆ యువకుడు శారీరకంగా లొంగదీసుకొని పెళ్లి చేసుకొమ్మంటే ముఖం చాటేశాడని ఫిర్యాదు చేసింది. అతనికి ప్రభుత్వ ఉద్యోగం రావడం వల్లే తనను వదిలించుకునేందుకు యత్నిస్తున్నాడని ఆరోపించింది. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని వాపోయింది.

మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్



మురుగు గుంతల్లో ఆయిల్‌బాల్స్ వదులుతున్న దృశ్యం

కార్పొరేషన్: నగరంలోని 13వ డివిజన్‌లోని మురుగుగుంతల్లో, డ్రెయిన్లలో కార్పొరేటర్ ఆళ్ల నిరీషారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్‌బాల్స్, గంబూషియా చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మురుగుగుంతల్లో టైఫాయిడ్, మలేరియా కలిగించే దోమల లార్వాలు ఉంటాయన్నారు. మురుగు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు ఆళ్ల అంజిరెడ్డి, అర్బన్ మలేరియా సిబ్బంది లక్ష్మణ్, ఆనంద్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

రకం	కిలో ధర
టమోటా	50
వంకాయ	34
బెండకాయ	30
పచ్చిమిర్చి	30
కాకరకాయ	30
బీరకాయ	24
సొరకాయ	15
దొండకాయ	24
పొట్లకాయ	30
దోసకాయ	34
చిక్కుడు	50
గోరుచిక్కుడు	40
క్యాబేజీ	24
ములక్కాయ(1)	10
ఆలుగడ్డ	16
చామగడ్డ	34
క్యారెట్	68
బీట్‌రూట్	34
ముల్లంగి	40
కంద	60
బీన్స్	44
క్యాప్సికం	50
బచ్చలకూర(1కట్ట)	3
పాలకూర(1కట్ట)	3
తోటకూర(1కట్ట)	2.5
గోంగూర(1కట్ట)	2
కొత్తిమీర(1కట్ట)	10
ఉల్లిగడ్డలు	30

- ఖమ్మం స్పోర్ట్స్

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ఎం.వెంకటాయపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. ఆరెకోడు గ్రామానికి చెందిన ఆరెంపుల వెంకన్న(47) వరంగల్ క్రాస్‌రోడ్ నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎం.వెంకటాయపాలెం వద్ద ద్విచక్ర వాహనం పల్టీకొట్టి తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు వెంటనే ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

లక్ష్యం కోసం శ్రమిస్తే విజయం సాధ్యం

సివిల్స్ టాపర్ రవికుమార్

కూసుమంచి: లక్ష్యం కోసం పట్టుదలతో శ్రమిస్తే విజయం తప్పక సాధ్యమవుతుందని సివిల్స్ టాపర్ గుగులోతు రవికుమార్ అన్నారు. బుధవారం కూసుమంచి జూనియర్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం చదివి ఈస్థాయికి వచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో చదివిపట్టణవాసులతో పోటీపడి ఉన్నతస్థాయికి ఎదగలేమని నిరాశ చెందవద్దని అన్నారు తనతో పాటు అనేకమంది సివిల్ టాపర్లు గ్రామీణప్రాతం నుంచి వచ్చిన వారేనని అన్నారు. విద్యార్థి తలచుకుంటే ఎన్ని అవరోధాలు ఎదురైనా అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని హితవు పలికారు. అందుకు కొంతమందిని ఆదర్శంగా తీసుకుని సాధన చేయాలని ఉత్తేజపరిచారు. అనుకున్న లక్ష్యం చేరుకోవడానికి నిరంతర శ్రమ, సాధన అవసరమని పిలుపునిచ్చారు. ప్రణాళిక ద్వారా చదివి ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటన విడుదల చేసినందున విద్యార్హత ఉన్న ప్రతిఒక్కరు పోటీపడి అవకాశాలు పొందాలని అన్నారు. ముఖాముఖిలో కరస్పాండెంట్ ఆసీఫ్‌పాష, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, గిరిజన నాయకులు ధర్మనాయక్, బాణోతు బిక్షం, భాస్కర్, సంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

తిరుమలాయపాలెం సమాచారం

తహసీల్దార్	97013 46964
ఎంపీడీవో	94409 06924
ఎంఈవో	88970 51687
ఏవో	72888 94223
పశువైద్యాధికారి	99898 49639
ఏపీఎం	99634 90555
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	99086 87205
వైద్యాధికారి	96662 95855
వైద్యాధికారి సుబ్లేడ్	99511 21176
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	77997 22876
విద్యుత్ ఏఈ	94408 11545
విద్యుత్ ఏఈ బచ్చోడు	94408 14150
ఎస్ఐ	94409 04254

పీహెచ్‌సీ సందర్శించిన అడిషనల్ జాయింట్ డైరెక్టర్

ఖమ్మంరూరల్: రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం పీహెచ్‌సీని బుధవారం అడిషనల్ జాయింట్ డైరెక్టర్ పద్మావతి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మిజిల్స్ రుబెల్లా వ్యాధి టీకాలు నేటి నుంచి ప్రారంభించాలని సూచించారు. తొమ్మిది నెలలనుంచి 15 ఏళ్లున్న పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. నేటినుంచి సెప్టెంబర్ 25 వరకు టీకాలువేసే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీప్యుటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పీహెచ్‌సీ డాక్టర్ సృజనాగౌడ్ పాల్గొన్నారు



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మావతి

'గిరిజన ప్రజాప్రతినిధిని అవమానించిన వీఆర్వోపై చర్య తీసుకోవాలి'

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం గ్రామ సర్పంచ్, గిరిజన మహిళ అయిన దేవళ్ల జ్యోతిని అవమానించిన వీఆర్వోపై తగుచర్యలు తీసుకోవాలని టీమాస్ ఫోరం స్టాండింగ్ కమిటీ సభ్యులు బండి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దమ్మాయిగూడెంలో స్వాతంత్ర వేడుకల సందర్భంగా జరిగపై దానిపై విచారణ చేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడారు. గిరిజన మహిళా ప్రజాప్రతినిధి అయిన సర్పంచ్‌ని అవ మానించిన వీఆర్వోను సస్పెండ్ చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సయ్య, కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి కొమ్ముశ్రీను, కె.స్వామి, నాగేశ్వరరావు, సాలయ్య పాల్గొన్నారు.

'వీఆర్వోపై చర్యలుతీసుకోవాలి'

మండలంలోని దమ్మాయిగూడెం గ్రామసర్పంచ్ దేవళ్లజ్యోతిని అవమానించిన వీఆర్వో సత్యనారాయణపై చర్యలుతీసుకోవాలని లంబాడిసేన రాష్ట్రఅధ్యక్షుడు శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం తిరుమలాయపాలెంలో సర్పంచ్ జ్యోతితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర వేడుకల సందర్భంగా సర్పంచ్‌ను జాతీయ జెండాను ఎగరవేయకుండా అవమానించిన వీఆర్వోను సస్పెండ్ చేయాలన్నారు. దీనిపై సమగ్రవిచారణ జరిపించాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వెంకన్న, భూక్యా సంజీవులు, అంగడి మల్లయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంబాడసేవా రాష్ట్రఅధ్యక్షుడు శంకర్

'కసూర్బా' పాఠశాలను తనిఖీచేసిన డీఈవో

తిరుమలాయపాలెం: మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను బుధవారం జిల్లావిద్యాశాఖఅధికారి విజయలక్ష్మీబాయి తనిఖీచేశారు. ఈసందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు.అలాగే విద్యార్థినుల హాజరుపట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెను ప్రకారం ఆహారాన్ని అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలతో మాట్లాడివారి సమస్యలు అడిగారు. పదవతరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠ్యాంశాల వారీగా ప్రశ్నలు అడిగారు. దినచర్యలపై ఆరాతీశారు. మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ ఏడాది కూడా పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్‌వో రమాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థినులకు నిఘంటువుల అందజేత

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం కస్తూర్బా గాంధీబాలికల పాఠశాల విద్యార్థినులకు బుధవారం విజయలక్ష్మిగ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నారాయణరావు ఆర్థికసహాయంతో వితరణగా అందజేశారు. పాఠశాలల్లోని 9, 10వతరగతి విద్యార్థినులకు నిఘంటువులను హెచ్‌పీగ్యాస్ రీజనల్ మేనేజర్ అబీద్‌ఖాద్రీ అందించారు. సీఎస్ఆర్ కార్యక్రమాలలో విద్యార్థులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈకార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. విద్యార్థినులు కృషి, పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో చదువుకుని ముందుకు సాగాలని కోరారు. మంచిగా చదువుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సేల్స్ అధికారి రవి, విజయలక్ష్మి గ్యాస్‌ఏజెన్సీ ఎండీ నారాయణరావు, సిబ్బంది హరి, పాఠశాల ఎస్‌వో రమాకుమారి పాల్గొన్నారు.



విద్యార్థినులకు డిక్షనరీలు అందిస్తున్న అభిద్‌ఖాద్రీ

పోలీస్ మైసయ్య కుటుంబానికి రు.25వేలు సాయం

కూసుమంచి: తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన డి.మైసయ్య కుటుంబసభ్యులకు సహ పోలీసులు రు.25వేలు వితరణగా అందించారు. మైసయ్యతో పాటు పోలీసు ఉద్యోగంలో చేరి 1995 బ్యాచ్ సివిల్ బ్యాచ్‌కు చెందిన పోలీసు సిబ్బంది అందరు బుధవారం జుజ్జులరావుపేట గ్రామంలో మైసయ్య దశదినకర్మలకు హాజరయ్యారు. ఈక్రమంలో మైసయ్య మృతిపట్ల సంతాపం వ్యక్తంచేసి ఆయన భార్యకు రు.25వేలు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ నర్సింహారావు, శ్రీహరి, పాపారావు, మన్సూర్ అలి, నోవ పాల్గొన్నారు.

'టీకాలతో తట్టు, పొంగు వ్యాధులకు అడ్డుకట్ట'

తిరుమలాయపాలెం: టీకాలతో మీజిల్స్ రుబెల్లా వ్యాధులను అరికట్టవచ్చని తిరుమలాయపాలెం ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి రాంబాబు తెలిపారు.బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తట్టు, పొంగు వ్యాధిపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 7503మంది పిల్లలకు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. 9నెలలనుంచి 15 ఏళ్లలోపు వారందరికీ టీకాలు వేయనున్నట్టు తెలిపారు. అందుకు గాను 44 ప్రభుత్వ పాఠశాలల్లో 48 అంగన్‌వాడీకేంద్రాలలో పిల్లలకు టీఆకాలు వేసేందుకుప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. తట్టు, పొంగు వ్యాధిప్రాణాంతకమైనదని దీనిపై ప్రజల్లో అవగాహన కలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో భాస్కర్, ఏఎన్ఎం ఉమారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సమ్మె

వైరా: వైరా సబ్‌పోస్టాఫీసు పరిధిలోని 24మంది గ్రామీణ తపాలా కార్యాలయాల సిబ్బంది బుధవారం సమ్మెలో పాల్గొన్నారు. దాంతో వైరా, కొణిజర్ల మండలాల్లోని 24 గ్రామీణ తపాలా కార్యాలయాలు మూతపడ్డాయి. ఈనెల 16నుంచి తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ తపాలా ఉద్యోగులందరూ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జయరాజు ఆధ్వర్యంలో వైరాలోని సబ్‌పోస్టాఫీసు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. గతనెల 30వతేదీన తమ యూనియన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎస్.మహదేవయ్య సమ్మెనోటీసును తపాలాశాఖ అధికారులకు అందించారని పేర్కొన్నారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ సూచించిన సవరణలతోసహా జీడీఎస్ కమిటీ రిపో ర్టు అమలుచేయాలని, జీడీఎస్‌లకు ఎనిమిదిగంటల పనికల్పించి సివిల్ సర్వెంట్ హో దా ఇవ్వాలని, టార్గెట్ల పేరుతో జీడీఎస్‌లను బలవంతం చేయటం, వేధించటం ఆపివేయాలని, పింఛన్ మంజూరు చేయాలనే డిమాండ్‌తో సమ్మె చేస్తున్నట్లు వివరించారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకుల సేవలు

వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్

కొణిజర్ల: జిల్లాలో వాణిజ్య బ్యాంకులకు ధీటుగా రైతులకు సేవలు అందించడంలో సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయని వైరా ఎమ్మెల్యే బానోతు మధన్‌లాల్ తెలిపారు. బుధవారం కొణిజర్లలో నూతనంగా నిర్మించిన గోపవారం సహకార సంఘం భవనాన్ని ఆయన ప్రారభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక సహకార సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి అయ్యాయన్నారు. జిల్లాలో డీసీసీబీ అభి వృద్ధికి మువ్వా విజయ్‌బాబు కృషి మరువలేనిదన్నారు. ఒక గోపవారం సహకార సం ఘం పరిధిలోని రూ.11కోట్ల 40లక్షలు రైతుల కు రుణామాఫీ లభించిందన్నారు. రైతులు బ్యాంకుల లావాదేవీల కోసం ఖమ్మం బ్యాం కుకు వెళ్లకుండా కొణిజర్ల పరిధిలోని సేవలు అందేవిధంగా కృషిచేస్తామని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పుడూ రైతులకు అండగానే నిలుస్తుంద న్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ సీఈవో నాగచెన్నారావు, వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోతు నర్సింహారావు, సొసైటీ ఛైర్మన్ మోత్కూరి వెంకటేశ్వరావు, సీఈవో వెంకటేశ్వర్లు, డీసీవో రాజేశ్వరశాస్త్రి, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌లాల్